సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 357

బుధవారం 18-3-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

9,000 దిగువకు నిఫ్టీ

కొనసాగుతున్న 'కోవిడ్' పతనం.. 32వేల పాయింట్ల దిగువకు సెన్సెక్స్ – బిజినెస్‌లో

ఒలింపిక్స్ ఆగవు...

అసాధారణ నిర్ణయాలు అవసరం లేదని తేల్చిన ఐఓసీ ప్రత్యేక సమావేశం –స్పోర్ట్స్‌లో

● భారత్ వృద్ధి రేటుపై మూడీస్

2020లో 5.3 శాతమే!

భారత్ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటు 2020లో 5.3 శాతమే ఉంటుందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ.. మూడీస్ తాజాగా అంచనా వేసింది. ఫిబ్రవరిలో వేసిన 5.4 శాతం అంచనాలను 10 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) మేర కుదించింది.

- బిజినెస్‌లో

● నేవీలో మహిళలకు శాశ్వత కమిషన్

కేంద్రానికి సుప్రీం ఆదేశం

భారత నావికా దళంలోని మహిళా ఉద్యోగుల కోసం శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పించాలని వ్యాఖ్యానించింది.

- 5లో

● కమల్ సర్కార్‌కు సుప్రీం నోటీసులు

బలపరీక్షపై వైఖరేంటి?



మధ్యప్రదేశ్ అసెంబ్లీలో తక్షణమే విశ్వాస పరీక్ష జరపాలన్న విషయంలో వైఖరి తెలపాల్సిందిగా కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హేమంత్ గుప్తాల ధర్మాసనం అత్యవసర విచారణ చేపట్టింది.

- 5లో

● ముందే హాలులోకి అనుమతి

రేపట్నుంచే టెన్త్ పరీక్షలు



పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం నుంచి వచ్చే నెల 6 వరకు జరిగే ఈ పరీక్షల కోసం 2,530 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోవిడ్ నేపథ్యంలో విద్యార్థులు గుంపులుగా ఉండకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

- 4లో

మండలి 'స్థానిక' అభ్యర్థిగా కవిత

నిజామాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నేడు నామినేషన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి వేముల

హాజరుకానున్న టీఆర్ఎస్ జిల్లా ఎమ్మెల్యేలు

సాక్షి, హైదరాబాద్: శాసన మండలి నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా స్థానానికి టీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ, సీఎం కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత బుధవారం 11.30 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. గురువారంతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుండగా, బుధవారం ఉదయం కవిత పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. టీఆర్ఎస్ నుంచి పలువురు ఆశావహులు టికెట్ ఆశించినా పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం కవిత అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపారు. కవిత నామినేషన్ కార్యక్రమాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పర్యవేక్షిస్తుండగా.. జిల్లాకు చెందిన టీఆర్ఎస్ శాసనసభ్యులు, పలువురు పార్టీ నేతలు

మిగతా 4వ పేజీలో ▶

మరో పాజిటివ్

వైరస్ బారిన ఇండోనేసియావాసి
రాష్ట్రంలో ఐదో కరోనా కేసు

- ఇటీవల ఢిల్లీ మీదుగా రాష్ట్రానికి రాక
- అతనితో ఉన్న మరో 10 మంది ఐసోలేషన్‌లో...
- ఇకపై పుణేతో పనిలేదు.. గాంధీలోనే తుది నిర్ధారణ పరీక్షలు
- రాష్ట్రంలో ఆరు కరోనా పరీక్షల ల్యాబ్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు నాలుగు పాజిటివ్ కేసులు బయటపడగా మంగళవారం ఐదో కేసు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇండోనేసియా నుంచి వచ్చిన బృందంలో ఒకరికి వైరస్ సోకినట్లు వెల్లడించింది. మొదట ఢిల్లీ వచ్చిన ఆ బృందం... అక్కడి నుంచి ఈ నెల 9న రాష్ట్రానికి వచ్చింది. బృందంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి కూడా ఉన్నాడు. వారంతా కరీంనగర్ వెళ్లి అక్కడి ఒక ప్రార్థనా కేంద్రంలో బస చేశారు. వారిలో ఒకరైన 58 ఏళ్ల విదేశీయుడిలో వైరస్ అనుమానిత లక్షణాలు బయటపడటంతో సోమవారం స్థానిక ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేపట్టారు. అక్కడి డాక్టర్లకు అనుమానం రావడంతో ఆయన్ను గాంధీ ఆసుపత్రికి

మిగతా 2వ పేజీలో ▶



రాష్ట్రంలో విదేశాల నుంచి వచ్చే వారి సంఖ్య పెరగడం, అనుమానిత లక్షణాలున్న వారు గాంధీ ఆసుపత్రికి పోటెత్తడంతో వైద్య, ఆరోగ్యశాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. విదేశాల నుంచి వస్తున్న వేలాది మంది

3000 ప్రత్యేక నిఘా బృందాలు

ప్రయాణికులతోపాటు వైరస్ పాజిటివ్ వ్యక్తులతో కలసి ఉన్న వారిని, వారు ఇంకెవరిని కలిశారన్న దానిపై ఆరా తీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 3 వేల నిఘా బృందాలను ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అనుమానితులు, లక్షణాలున్న వారిని, ఆయా వ్యక్తులు కలిసిన ప్రజలను గుర్తించే పనిలో నిమగ్నమైంది.

ఆరు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు

ప్రస్తుతం గాంధీ, ఉస్మానియాతోపాటు ఫీవర్ ఆసుపత్రి, ఐపీఎం, నిమ్స్, వరంగల్ ఎంజీఎంలలో కరోనా నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వం ల్యాబ్‌లు సిద్ధం చేసింది. ఇప్పటివరకు రాష్ట్రంలో పాజిటివ్‌గా వచ్చిన నమూనాలను తుది నిర్ధారణ కోసం పుణేకు పంపగా ఇకపై గాంధీలోనే తుది పరీక్షలు నిర్వహించి పాజిటివ్ కేసులను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించనుంది.

కరోనా ఎఫెక్ట్..

- షిర్డీ ఆలయం మూసివేత
- శనిసింగనాపూర్ ఆలయానికి తాళాలు
- రైల్వే ప్లాట్‌ఫామ్ టికెట్ ధర రూ.10 నుంచి 50కి పెంపు
- భక్తులు లేకుండానే భద్రాద్రి సీతారామ కల్యాణం
- చార్మినార్, గోల్కొండ సందర్శనకు నో
- ఐదు విమాన సర్వీసులు రద్దు
- యాదాద్రిలో భారీగా తగ్గిన భక్తుల రద్దీ..
- దక్షిణమధ్య రైల్వేలో పలు రైళ్లు రద్దు..

6 నెలల్లో ఔషధం..

- కరోనాకు ఉమ్మడిగా 3 మందుల తయారీకి సిద్ధమైన ఐఐసీటీ, సిప్లా
- రెమిడెస్‌విర్, బెలాక్సివిర్, ఫెవిపిరవిర్ రసాయనాలతో అన్ని వైరస్‌లకు చెక్
- ఇప్పటికే ఒకట్రెండు క్లినికల్ ట్రయల్స్ పూర్తి
- వాటిని మాత్రలుగా అందుబాటులోకి తెచ్చేందుకు ముందుకొచ్చిన సిప్లా

సాక్షి, హైదరాబాద్

ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌తో పాటు ఇతర వైరస్‌లకూ చెక్‌పెట్టే దిశగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), దేశీయ ఫార్మా దిగ్గజం సిప్లా వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టాయి. కరోనా వైరస్‌కు విరుగుడుగా పనిచేయగలవన్న ప్రాథమిక అంచనాకు వచ్చిన మూడు మందులను తయారు చేసేందుకు ఇరు సంస్థలు చేతులు కలిపాయి. రెమిడెస్‌విర్, బెలాక్సివిర్, ఫెవిపిరవిర్ అనే మూడు రసాయనాలు వైరస్‌లను నిరోధించేందుకు సమర్థంగా ఉపయోగపడతాయని ఐఐసీటీ శాస్త్రవేత్తలు గుర్తించగా.. వాటిని పారిశ్రామిక స్థాయిలో తయారు చేసి ఇస్తే తాము మాత్రలు తయారు చేసి అందరికీ అందుబాటులోకి తెస్తామని సిప్లా కంపెనీ ప్రతిపాదించింది. ఈ మూడు మందులపై ఒకట్రెండు క్లినికల్ ట్రయల్స్ ఇప్పటికే పూర్తయ్యాయని, వేర్వేరు కారణాల వల్ల మార్కెట్‌లోకి రాని వాటిని అత్యవసర పరిస్థితుల్లో నేరుగా ఉపయోగించే అవకాశం ఉండటం విశేషమని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. రెమిడెస్‌విర్‌ను గిలియాడ్ అనే

మిగతా 2వ పేజీలో ▶

జాగ్రత్త పడకపోతే.. వినాశనమే

- కరోనాపై పౌరులకు ఇరాన్ హెచ్చరిక..
- ఆగస్ట్ వరకు సంక్షోభం కొనసాగే అవకాశముందన్న ట్రంప్

5 లో

దేశంలో మూడో మరణం..

- ముంబైలో కోవిడ్‌తో మృతి చెందిన 63 ఏళ్ల వ్యక్తి
- ఇటీవలే దుబాయ్ వెళ్లొచ్చిన బాధితుడు

ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఏసీపీ రవీందర్‌రెడ్డి తదితరులు

హతమార్చి.. ముఖం ఛిద్రం చేసి..

తంగడపల్లిలో కల్వర్టు కింద మహిళ మృతదేహం

ఎక్కడో చంపి.. శవాన్ని ఇక్కడ పడేసిన దుండగులు!

అత్యాచారం చేసి హతమార్చారని అనుమానాలు

'దిశ'ఘటనలా ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం

చేవెళ్ల: నుజ్జునుజ్జయిన ముఖం.. కల్వర్టు కింద రక్తపు మడుగులో వివస్త్రగా పడి ఉన్న మహిళ మృతదేహం.. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన యువకుడు ఇచ్చిన సమాచారంతో రంగారెడ్డి జిల్లా తంగడపల్లిలో ఈ దారుణోదంతం వెలుగుచూసింది. 'దిశ'ఘటనలా ఉందంటూ జరిగిన ప్రచారం కలకలం రేపింది. ఎక్కడో హతమార్చి మృతదేహాన్ని ఇక్కడ పడేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడపల్లికి చెందిన యువకుడు శేరిల్ల నవీన్ ఉదయం ఏడు గంటల సమయంలో బహిర్భూమికి వెళ్తుండగా, వికారాబాద్– హైదరాబాద్ రహదారిపై గల కల్వర్టు కింద మహిళ మృతదేహం కనిపించింది. ముఖం మొత్తం నుజ్జయి, నగ్నంగా పడి ఉన్న ఆమె గురించి వెంటనే అతను సర్పంచ్ భర్తకు తెలిపాడు. సమాచారం అందుకున్న చేవెళ్ల సీఐ బాలకృష్ణ, ఎస్ఐ రేణుకారెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు బండరాళ్లతో మోదటంతో ముఖం గుర్తుపట్టరాని విధంగా మారింది. మృతదేహం వద్ద

మిగతా 4వ పేజీలో ▶

నాలుగు విడతల్లో రుణమాఫీ

- రూ.25 వేల లోపుంటే ఒకేసారి మాఫీ
- మార్గదర్శకాలు జారీచేసిన వ్యవసాయ శాఖ
- చెక్కుల రూపంలో రైతులకు సొమ్ము అందజేత

3 లో



పారాసిటమాల్ మింగి.. దర్జాగా ఇంటికి..!

విమానం దిగడానికి గంట ముందే ట్యాబ్లెట్ వేసుకుంటున్న వైనం

సాక్షి, హైదరాబాద్: విదేశాల నుంచి వస్తున్నవారు విమానం దిగాక థర్మల్ స్క్రీనింగ్‌కు దొరక్కుండా ఉండేందుకు జ్వరానికి ఉపయోగించే పారాసిట మాల్ మాత్రలు వేసుకుంటున్నారు. విమానం దిగేం దుకు గంట ముందు ఈ మాత్రలు వేసుకుంటున్నారు. దీంతో శరీర ఉష్ణోగ్రతలు తగ్గి స్క్రీనింగ్‌లో దొరక్కుండా ఇదో ఉపాయాన్ని వెతుక్కుంటున్నారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్న వారిని 'సీ'కేటగిరీ కింద భావించి నేరుగా ఇళ్లకు పంపుతారు. ఇంటి దగ్గరే ఐసోలేషన్‌లో ఉండాలని సూచిస్తున్నారు. జ్వరం ఉంటే ఎక్కడ గాంధీ ఆస్పత్రి లేదా క్వారంటైన్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందోననే భయంతో మరోదారిలో బయటపడుతున్నారు. ఈ విషయం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి వచ్చింది. ఇదే విషయాన్ని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేసింది. ఇలాంటి కేసుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రెండ్రోజుల కిందట ఇలాగే దుబాయ్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి పారాసిటమాల్ వేసుకొని, థర్మల్ స్క్రీనింగ్‌కు దొరక్కుండా నేరుగా ఇంటికే వెళ్లాడు. దీనిపై ఒకరు వైద్య ఆరోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు. శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలకు వస్తున్నప్పుడు జ్వరం వంటి లక్షణాలుంటే విమానం దిగడానికి ముందే పారాసిటమాల్ మాత్రలు వేసుకుంటున్నారని తెలిసింది. ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వారిపై నిఘా ఎలా పెట్టాలన్న దానిపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

శుభకార్యాలకు కోవిడ్ దెబ్బ

సాక్షి, హైదరాబాద్: వివాహాది శుభకార్యాలకు కోవిడ్ దెబ్బ తగిలింది. ఈ నెల 31 వరకు పరిమిత సంఖ్యలో అతిథులతో వివాహ వేడుకలు నిర్వహించుకునేందుకు అనుమతించిన రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయి ఆంక్షలు అమలు చేస్తామని ప్రకటించింది. దీంతో సుమారు 6 నెలల ముందే ముహూర్తం నిర్ణయించుకుని ఫంక్షన్ హాళ్లు, ఇతర వేదికలకు అడ్వాన్సు చెల్లించిన వధూవరుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు ఇప్పటికే ముహూర్తాలు కుదిరిన విదేశీ వధూవరుల్లో ఎవరో ఒకరు ఇప్పటికే స్వదేశానికి చేరుకోగా, విదేశీ ప్రయాణాలపై ఆంక్షలతో కాబోయే జీవిత భాగస్వామి ప్రస్తుత పరిస్థితుల్లో ముహూర్తం తేదీకి చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు. శుభకార్యం వాయిదా వేసుకున్నా మళ్లీ ఎప్పటికి కుదురుతుందో లేదోనన్న ఆందోళన వెంటాడుతోంది.

ప్రార్థనలు, ఉత్సవాలు బంద్

సాక్షి, హైదరాబాద్: సామూహిక మత ప్రార్థనలు, ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్‌రావు తెలిపారు. వైరస్ వ్యాప్తి చెందుతున్నందున గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉర్సు, ప్రార్థనలు, ప్రదర్శనలను జరపకుండా నిరోధించాలని, ప్రజలంతా ఒకే చోట గుమికూడితే వైరస్ ప్రబలే అవకాశమున్నందున ఈ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ములాఖత్‌లు రద్దు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ వ్యాప్తి చెందకుండా జైళ్లశాఖ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని జైళ్లలో ఉన్న ఖైదీలను కలవనీయకుండా అన్ని రకాల ములాఖత్‌లను రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ రాజీవ్ త్రివేది మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదే సమయంలో జైళ్లలో ఖైదీల ఆరోగ్యం కోసం పారిశుద్ధ్య చర్యలు మరింత పెంచాలని ఆదేశించారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంత వరకు ఎవరూ కలిసేందుకు రావొద్దని ఖైదీల బంధువులు, స్నేహితులకు సూచించారు. కలవాలని అనుకునేవారంతా టెలిఫోన్ సౌకర్యం వినియోగించుకోవాలన్నారు.

25 వరకు శస్త్ర చికిత్సలు వాయిదా

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తుగా ఎంపిక చేసిన శస్త్రచికిత్సలు ఈనెల 25వ తేదీ వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అత్యవసర కేసులు మినహా సాధారణ శస్త్ర చికిత్సలు వాయిదా వేస్తున్నట్లు వైద్య వర్గాలు ప్రకటించాయి.

ఐదు విమాన సర్వీసులు రద్దు

శంషాబాద్ రూరల్: కోవిడ్ ప్రభావంతో విమాన సర్వీసుల రాకపోకలు తగ్గిపోతున్నాయి. విదేశాల నుంచి ప్రయాణికుల రాకపోకలు స్తంభించిపోవడంతో మంగళవారం ఐదు విమాన సర్వీసులు రద్దయ్యాయి. షార్జా, జెడ్డా, దుబాయి, కౌలాలంపూర్, బహ్రెయిన్ నుంచి ఇక్కడికి రావాల్సిన సర్వీసులు, అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరాల్సిన మూడు విదేశీ సర్వీసులు కూడా రద్దయ్యాయి.

దిశ కమిషన్ విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై నియమించిన సుప్రీం కోర్టు త్రిసభ్య కమిషన్‌పై కోవిడ్ వైరస్ ప్రభావం పడింది. వాస్తవానికి ఈ కమిషన్ విచారణ ఈనెల 23, 24వ తేదీల్లో జరగాల్సి ఉంది. సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి సిర్పూర్కర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌లో బాంబే మాజీ చీఫ్ జస్టిస్ రేఖ, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్ సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో కోవిడ్ వైరస్ ప్రభావం ఉన్న నేపథ్యంలో హైకోర్టు కేసుల విచారణలో పలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ ఆంక్షలను పరిగణనలోకి తీసుకున్న కమిషన్ తమ పర్యటనను వాయిదా వేస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

కన్ఫ్యూజన్ క్లియర్ కరోనా..

ఎవరు దగ్గినా.. ఎవరు తుమ్మినా.. కోవిడ్ ఏమోనని డౌట్ పడే పరిస్థితి.. అది సాధారణ జలుబో లేదా కరోనానో తెలియని దుస్థితి.. జలుబు, ఫ్లూ, కరోనా ఈ మూడూ గాలి ద్వారా వ్యాపించేవే. వైరస్ ద్వారా కలుషితమైన ఉపరితలాలు, ముక్కు ద్వారా వచ్చే స్రావాల ద్వారా సంక్రమించేవే.. అందుకే కరోనా, ఫ్లూ, సాధారణ జలుబుకు మధ్య తేడాలు తెలుసుకుందాం.. కన్ఫ్యూజన్‌ను క్లియర్ చేసుకుందాం.

-సాక్షి సెంట్రల్ డెస్క్



కోవిడ్

వ్యాధి ప్రారంభం: అకస్మాత్తుగా

లక్షణాలు: జ్వరం, పొడి దగ్గు, కండరాల నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది

తక్కువగా కన్పించే లక్షణాలు: తలనొప్పి, దగ్గినప్పుడు రక్తం పడటం, విరేచనాలు

సీజనల్ ఫ్లూ

వ్యాధి ప్రారంభం: అకస్మాత్తుగా

లక్షణాలు: జ్వరం, పొడి దగ్గు, కండరాల నొప్పి, నీరసం, తలనొప్పి, గొంతు నొప్పి, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ

తక్కువగా కన్పించే లక్షణాలు: విరేచనాలు, వాంతులు

సాధారణ జలుబు

వ్యాధి ప్రారంభం: క్రమక్రమంగా

లక్షణాలు: ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తుమ్ములు, గొంతు నొప్పి

తక్కువగా కన్పించే లక్షణాలు: కండరాల నొప్పి లేదా ఒళ్లు నొప్పులు, తలనొప్పి, నీరసం

అంటే.. ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ, తుమ్మడం వంటి లక్షణాలు ఉన్నంత మాత్రాన కోవిడ్ సోకినట్లు కాదు.

మరో పాజిటివ్

▶ మొదటి పేజీ తరువాయి

రెఫర్ చేయగా కరోనా పాజిటివ్‌గా నిర్ధారించారు. ఆయనతోపాటు కలసి ఉన్న 10 మందిని ఐసోలేషన్‌లో పెట్టారు. అలాగే వారంతా గత కొద్ది రోజులుగా ఎక్కడెక్కడ తిరిగారన్న దానిపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. వారి దగ్గర నుంచి వివరాలను సేకరించే ప్రయత్నం చేస్తోంది. ఇందుకోసం జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బందిని రంగంలోకి దించింది.

వివిధ దేశాల విమాన సర్వీసులు రద్దు

అఫ్గానిస్తాన్, మలేసియా, యూకే, ఫిలిప్పీన్స్ నుంచి విమాన సర్వీసులను రద్దు చేసిన ప్రభుత్వం... ఈ నెల 31 వరకు యూరోపియన్ యూనియన్, టర్కీ, నుంచి వచ్చే విమాన సర్వీసులనూ రద్దు చేయనుంది. వైరస్ ప్రభావం తీవ్రంగా ఉన్న ఏడు దేశాల నుంచి వచ్చిన 221 మందిని వికారాబాద్, దూలపల్లిలోని ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలకు తరలించింది. అలాగే విదేశాల నుంచి వచ్చే తెలంగాణవాసులను ఏ జిల్లా వారిని అదే జిల్లాలో ఐసోలేషన్‌లో ఉంచే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటికే 1,238 మంది ఇళ్లకే పరిమితమయ్యేలా చర్యలు చేపట్టింది. చైనా, ఇరాన్, ఇటలీ, జర్మనీ, దక్షిణ కొరియా, ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల నుంచి వచ్చిన వారిని ఇప్పటివరకు ఐసోలేషన్ కేంద్రాలకు తరలిస్తుండగా బుధవారం నుంచి యూఏఈ, ఖతార్, ఒమన్, కువైట్ దేశాల నుంచి వచ్చే వారిని కూడా ఐసోలేషన్‌లోనే ఉంచనుంది.

మహారాష్ట్ర, కర్ణాటకలతో సరిహద్దు క్లోజ్!

మహారాష్ట్ర, కర్ణాటకల్లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో తెలంగాణ సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. మొత్తం సరిహద్దును బంద్ పెట్టాలా? ఒకవేళ సరిహద్దు మూసేస్తే ఎటువంటి సమస్యలొస్తాయన్న దానిపై కసరత్తు చేస్తోంది. కాగా, వైరస్ బారినపడి పూర్తిగా కోలుకున్న రాష్ట్రంలోని మొదటి బాధితుడు, హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిని బుధవారం విలేకరుల సమక్షంలో మాట్లాడిస్తామని వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

రాష్ట్రంలో నివసిస్తున్న వారెవరికీ వైరస్ లేదు

తెలంగాణలో నివసిస్తున్న ప్రజలెవరికీ కరోనా వైరస్ లేదని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇప్పటివరకు వైరస్ బారినపడిన వారంతా విదేశాల నుంచి వచ్చిన వాళ్లేనన్నారు. ఇప్పటివరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 66,182 మందికి థర్మల్ స్క్రీనింగ్ చేశామన్నారు. అలాగే 464 మందికి పరీక్షలు చేయగా అందులో ఐదుగురికి మాత్రమే కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందన్నారు. దుబాయ్ వచ్చిన మొదటి కరోనా పాజిటివ్ వ్యక్తి 88 మందిని కలిశాడనీ, వారందరికీ నెగెటివ్ వచ్చిందన్నారు. అలాగే రెండో పేషెంట్ అయిన ఇటలీ నుంచి వచ్చిన యువతి 42 మందిని, మూడో పేషెంట్ 69 మందిని, నాలుగో పేషెంట్ 11 మంది కలిశారని వారందరికీ కూడా నెగెటివ్ వచ్చిందన్నారు. కరోనాకు సంబంధించి ఇకపై రాతపూర్వక బులెటిన్లు విడుదల చేస్తామన్నారు.

మంగళవారం నాంపల్లి రైల్వేస్టేషన్‌లో మాస్కులు ధరించి విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు

నిమ్స్‌లో కేన్సర్ రోగికి కరోనా?

లక్డీకాపూల్: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేన్సర్ రోగికి కోవిడ్ లక్షణాలు ఉన్నట్లు తెలుస్తోంది. రేడియోథెరపీ చికిత్స కోసం నిమ్స్ వచ్చిన వెస్టిండీస్‌కు చెందిన యామాని అనే రోగికి కరోనా లక్షణాలు ఉన్నట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. అందుకు అనుగుణంగా అతనికి రేడియోతెరపీ చేస్తూనే ఇతర వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే నిమ్స్‌లో చికిత్స కోసం వచ్చిన వారిలో ముగ్గురికి కరోనా ఉన్నట్లు వారిని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో నిమ్స్‌లో కూడా కరోనా నోడల్ బృందాన్ని ఏర్పాటు చేసే దిశగా యాజమాన్యం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.



కరోనా లక్షణాలున్నాయా?

సాక్షి, హైదరాబాద్: మీకు కరోనా లక్షణాలున్నాయా? అని ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌లు ఇంటింటికీ వచ్చి ఆరా తీయనున్నాయి. ప్రతి కుటుంబ సభ్యుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోనున్నాయి. ఎవరికైనా అనుమానిత లక్షణాలుంటే హోం ఐసోలేషన్‌లో ఉండాలని సలహా ఇవ్వనున్నాయి. 14 రోజులు లేదా 28 రోజులపాటు సదరు వ్యక్తి హోం ఐసోలేషన్‌లో ఉంటున్నాడా లేదా అని నిఘా వేయనున్నాయి. ఒకవేళ హోం ఐసోలేషన్ సాధ్యం కాకపోతే అనుమానితుడిని క్వారంటైన్‌కు తరలించనున్నాయి. పురపాలికల్లో తక్షణమే ఈ టీమ్స్‌ను ఏర్పాటు చేసి కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశించింది.

పలు రైళ్ల రద్దు

కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: దేశంలో కోవిడ్ ప్రభావిత రాష్ట్రాల్లో మహారాష్ట్ర తొలి స్థానంలో ఉంది. అక్కడ వైరస్ బారినపడ్డ వారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. తెలంగాణకు పొరుగునే ఉండటంతో అక్కడికి నడిపే రైళ్ల సంఖ్యను భారీగా తగ్గిస్తూ దక్షిణమధ్య రైల్వే నిర్ణయం తీసుకుంది. కొన్నింటిని కొన్ని తేదీల్లో మాత్రం రద్దు చేసింది. పరిస్థితి మెరుగుపడితే సర్వీసులను పునరుద్ధరించనుంది. ఇటీవల కర్ణాటకలోని కలబుర్గికి చెందిన ఓ వృద్ధుడు కోవిడ్‌తో మృతి చెందడంతో ఆ ప్రాంతానికి నడిచే రైళ్ల సర్వీసులను కూడా తగ్గించటం గమనార్హం. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య నడిచే కొన్ని ప్రధాన రైళ్లను కూడా వచ్చే 10 రోజుల్లో కొన్ని సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. మరోవైపు షిర్డీ సర్వీసులను రద్దు చేసిన ఆర్టీసీ.. మహారాష్ట్రలోని ఉద్గీర్‌కు 4 సర్వీసులు తగ్గించింది.

రద్దయిన రైళ్ల వివరాలివీ..

రైలు	ఎక్కడి నుంచి ఎక్కడికి	రద్దు తేదీలు
02775	కాకినాడటౌన్-లింగంపల్లి	మార్చి 18, 20, 23, 25, 27, 30
02776	లింగంపల్లి-కాకినాడ టౌన్	మార్చి 19, 21, 24, 26, 28, 31
07049	మచిలీపట్నం-సికింద్రాబాద్	మార్చి 22, 29
07050	సికింద్రాబాద్-మచిలీపట్నం	మార్చి 22, 29
07117	హైదరాబాద్-ఎర్నాకులం	మార్చి 25
07118	ఎర్నాకులం-హైదరాబాద్	మార్చి 26
07257	హైదరాబాద్-విజయవాడ	మార్చి 23, 30
07609	తిరుచిరాపల్లి-హైదరాబాద్	మార్చి 25, ఏప్రిల్ 1
07610	హైదరాబాద్-తిరుచిరాపల్లి	మార్చి 23, 30
17620	నాందేడ్-ఔరంగాబాద్	మార్చి 20, 27
17619	ఔరంగాబాద్-నాందేడ్	మార్చి 23, 30
16204	తిరుపతి-చెన్నై సెంట్రల్	మార్చి 18, 31
16203	చెన్నై సెంట్రల్-తిరుపతి	మార్చి 18, 31
04155	కాన్పూర్ సెంట్రల్ -కాచిగూడ	మార్చి 26
04156	కాచిగూడ-కాన్పూర్ సెంట్రల్	మార్చి 27
11201	ముంబై-అజ్ని	మార్చి 23, 30
11202	అజ్ని-ముంబై	మార్చి 20, 27
11205	ముంబై-కరీంనగర్	మార్చి21, 28
11206	కరీంనగర్-ముంబై	మార్చి 22, 29
11307	కలబుర్గి-హైదరాబాద్	మార్చి 18, 31
11308	హైదరాబాద్-కలబుర్గి	మార్చి 18, 31
06059	చెన్నై-సికింద్రాబాద్	మార్చి 20, 22
06060	సికింద్రాబాద్-చెన్నై	మార్చి 21, 23
82841	సంత్రాగచ్చి-చెన్నై	మార్చి 20, 27
82842	చెన్నై-సంత్రాగచ్చి	మార్చి 21, 28

6 నెలల్లో ఔషధం..

▶ మొదటి పేజీ తరువాయి

ఫార్మా కంపెనీ అభివృద్ధి చేసిందని, జపనీస్ కంపెనీ అభివృద్ధి చేసిన ఫెవిపిరవిర్‌పై పేటెంట్ హక్కులు కూడా లేవని ఆయన తెలిపారు. రెమిడెస్‌విర్‌పై చైనా ఇప్పటికే వెయ్యి మంది రోగులతో ప్రయోగాలు నిర్వహించిందని గుర్తుచేశారు. క్లినికల్ ట్రయల్స్ ముగిసిన తరువాత వేర్వేరు కారణాల వల్ల పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయని మందులను నిశితంగా పరిశీలించడం ద్వారా తాము ఈ మూడు మందులను కరోనాతో పాటు ఇతర వైరస్‌లను ఎదుర్కొనేందుకు ఉపయోగించవచ్చన్న అంచనాకు వచ్చామని చెప్పారు. సిప్లా అధినేత డాక్టర్ హమీద్ మంగళవారం ఐఐసీటీకి మెయిల్ పంపుతూ ఈ మందులను ఎలాంటి షరతుల్లేకుండా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారని, ఇందుకు తగ్గట్లుగా తాము వాటిని ఆరు నుంచి ఎనిమిది వారాల్లో రెండు మందులను (రెమిడెస్‌విర్, ఫెవిపిరవిర్) కావాల్సినంత మోతాదులో తయారు చేసి సిప్లాకు అందిస్తామని ఆయన వివరించారు. ఆ తరువాత కొన్ని ప్రభుత్వ అనుమతులతో వీలైనంత వేగంగా వాటిని అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. అన్నీ సవ్యంగా జరిగితే 6 నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కావొచ్చన్నారు. ఈ మందుల తయారీకి కావాల్సిన అన్ని రకాల రసాయనాలు ఐఐసీటీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 1980లలో హెచ్ ఐవీ/ఎయిడ్స్ ప్రపంచాన్ని కబళిస్తున్న సమయంలో ఐఐసీటీ, సిప్లా అత్యంత చౌకగా యాంటీ రెట్రో వైరల్ మందులను అభివృద్ధి చేసిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం.

పిచికారీ మందు తయారీ సులువే...

కరోనా వైరస్‌కు విరుగుడుగా బహరంగ ప్రదేశాల్లో పిచికారీ చేసేందుకు వీలైన మందుపై ఐఐసీటీ మదింపు చేసిందని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ తెలిపారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ (రెండు శాతం గాఢత), పెరాసిటిక్ యాసిడ్ (0.2 శాతం గాఢత)లను నీటితో కలిపి పిచికారీ చేస్తే అన్ని రకాల ఉపరితలాలపై ఉండే వైరస్‌లు ఎనిమిది నుంచి పది నిమిషాల్లో నశించిపోతాయని చెప్పారు. దీంతోపాటు కరోనా వైరస్ ఉనికిని నిర్ధారించే కిట్‌లలో కీలకమైన ఎంజైమ్ (రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేస్) ఉత్పత్తిని ఐఐసీటీ చేపట్టిందని, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ) వద్ద ఉన్న ప్రైమర్‌తో కలిపి దీన్ని వ్యాధి నిర్ధారణ కిట్‌లలో ఉపయోగిస్తారని ఆయన తెలిపారు.

సిప్లా అధినేత డాక్టర్ హమీద్‌తో ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ (ఫైల్)

మనమూ తయారు చేయొచ్చు

ఆరుబయట.. ఉపరితలాలపై ఉండే కరోనా వైరస్‌ను చంపేయాలని అనుకుంటున్నారా? మీకు కావాల్సిందల్లా హైడ్రోజన్ పెరాక్సైడ్, పెరాసిటిక్ యాసిడ్ రసాయనాలే. హైడ్రోజన్ పెరాక్సైడ్ మార్కెట్‌లో రెండు గాఢతల్లో లభిస్తుంది. 4% గాఢత ఉన్న దాన్ని వాడే పక్షంలో ప్రతి లీటర్ నీటికి ఆరు ఎంఎల్ హైడ్రోజన్ పెరాక్సైడ్ వాడాలి. ఇది కాకుండా 30% గాఢత ఉన్న దాన్ని వాడుతున్నట్లయితే ఒక లీటర్ నీటికి 0.82 ఎంఎల్ వాడాలి. ఇక పెరాసిటిక్ యాసిడ్ విషయానికి వస్తే దీన్ని ప్రతి లీటర్‌కు 0.42 ఎంఎల్ చొప్పున వాడాల్సి ఉంటుంది. మొత్తమ్మీద చూస్తే ఒక లీటర్ నీరు తీసుకొని దానికి 6 ఎంఎల్ (4% గాఢత) హైడ్రోజన్ పెరాక్సైడ్, 0.42 ఎంఎల్ పెరాసిటిక్ యాసిడ్ కలిపి కావాల్సిన చోట పిచికారీ చేసుకోవాలి. ఈ మందుతో వైరస్ లేవైనా 10 నిమిషాల్లో నాశన మవుతాయని ఐఐసీటీ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

శానిటైజర్లు వీఐపీలకేనా?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వేలకు వేలు శానిటైజర్లు, మాస్కులు తెప్పిస్తున్నామని చెబుతున్న వైద్యాధికారులు వాటిని నచ్చిన వారికి, వీఐపీలకే తరలిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) నుంచి ఆసుపత్రులు, వైద్య కార్యాలయాలకు శానిటైజర్లు, మాస్కులు సరఫరా కావాల్సి ఉండగా వాటి కోసం ఐఏఎస్, ఐపీఎస్, ఉన్నతాధికారులు, ఇతర వీఐపీలు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అధికారులు శానిటైజర్లు, మాస్కులను వారి ఇళ్లకు తరలిస్తున్నారని సమాచారం. కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూంతోపాటు వైద్య విధాన పరిషత్, వైద్య విద్య సంచాలకుల ఆఫీసుల్లోనూ శానిటైజర్లు అందుబాటులో లేకపోవడం విచిత్రం. కాగా, కొందరు ఉద్యోగులు మాస్కులు, శానిటైజర్లను అమ్ముకుంటున్నారన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

చార్మినార్, గోల్కొండ మూత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటికే జూ పార్కులు, ప్రదర్శనశాలలు, ప్రధాన పార్కులను రాష్ట్ర ప్రభుత్వం మూసేయగా, తాజాగా కేంద్ర పురావస్తు సర్వేక్షణ విభాగం (ఏఎస్ఐ) ప్రధాన పర్యాటక కేంద్రాలను మూసేసింది. మంగళవారం నుంచి గోల్కొండ, చార్మినార్, వరంగల్ కోట తదితర ప్రాంతాలకు పర్యాటకులకు అనుమతి రద్దు చేసింది. ఇదే విభాగం అధీనంలో ఉన్న వేయిస్తంభాల దేవాలయం, రామప్ప గుడి, గద్వాల జోగుళాంబ దేవాలయాలకు మాత్రం స్వల్ప సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. ఇవి దేవాలయాలు కావడంతో వాటిని మూసే పరిస్థితి లేదు. అయితే ఎక్కువ సంఖ్యలో గుమికూడకుండా, క్యూలైన్లలో ఎక్కువ సేపు ఉండకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

రామనవమి ఉత్సవాలపై నియంత్రణ

రాష్ట్ర ప్రభుత్వం కూడా దేవాలయాలపై దృష్టి సారించింది. ప్రస్తుతం శుభకార్యాలు ఎక్కువగా జరిగే రోజులు కావటంతో దేవాలయాలకు వచ్చే వారి సంఖ్య కూడా ఎక్కువే ఉంటుంది. దీంతోపాటు ఆలయాల్లో పరిశుభ్రత చర్యలు ముమ్మరం చేశారు. కోవిడ్ వైరస్ వ్యాపించే విధానం, దాన్ని నియంత్రించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై ప్రచారం ప్రారంభించారు. ఇందులో భాగంగా వచ్చే నెల 2న జరిగే శ్రీరామనవమి ఉత్సవాలపై అధికారులు దృష్టి సారించారు. భద్రాచలంలో ప్రభుత్వ వేడుకగా జరిగే సీతారామ కల్యాణాన్ని పూర్తిగా ఆలయ కార్యక్రమంగా పరిమితం చేశారు. అర్చకులు, ప్రభుత్వ ప్రతినిధులు, ఉద్యోగులు మాత్రమే పాల్గొనేలా చర్యలు చేపట్టారు. సాధారణ భక్తులు ఆలయానికి రాకుండా కట్టడి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆన్‌లైన్ టికెట్లను రద్దు చేశారు. ఇప్పటికే ఆ టికెట్లు కొన్న వారికి డబ్బులు తిరిగి ఇచ్చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని వైష్ణవాలయాల్లోనూ అర్చకులు దేవేరుల కల్యాణం నిర్వహించటానికే పరిమితం చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని అధికారులు దేవాలయ నిర్వాహకుల దృష్టికి తెచ్చారు. బలవంతంగా భక్తులు రాకుండా కట్టడి సాధ్యం కానందున, భక్తులే స్వచ్ఛందంగా ఆలయ సందర్శన విరమించుకుని ఇళ్లలో వేడుకలు చేసుకోవాలని పేర్కొంటున్నారు.

ఉగాది వేడుకలకూ దూరం!

ఉగాది వేడుకలనూ ఆర్భాటాలకు దూరంగా నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ కార్యక్రమంగా ప్రగతిభవన్‌లో నిర్వహించే వేడుకలకు సాధారణ ప్రజలు రాకుండా నిర్వహించేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. టీవీల్లో లైవ్ ద్వారా ప్రజలు చూడాలనే సూచన చేయనున్నట్లు తెలుస్తోంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

బోసిపోయిన భద్రాద్రి రామాలయం పరిసరాలు

- పర్యాటక ప్రాంతాలపై ప్రభుత్వాల దృష్టి
- ఆలయాల వేడుకల్లో ఆర్భాటాలకు స్వస్తి
- భద్రాచలం సీతారామ కల్యాణం అర్చకులకే పరిమితం

... ముందు జాగ్రత్త చర్యగా ఇక్కడే కరోనా టెస్ట్‌లు చేస్తున్నారు!!

నాలుగు విడతల్లో రుణమాఫీ

రూ.25 వేల లోపుంటే ఒకేసారి మాఫీ

చెక్కుల రూపంలో సొమ్ము అందజేత • కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ వర్తింపు

సాక్షి, హైదరాబాద్: వడ్డీతో సహా రూ.లక్ష వరకు ఉన్న వ్యవసాయ పంటల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. గతంలోలాగే ఈసారి కూడా నాలుగు విడతల్లో రుణమాఫీ అమలు చేయనుంది. వ్యవసాయ రుణమాఫీ పథకం-2018 అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రకటిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్వల్పకాలిక పంట రుణాలు, బంగారం తాకట్టుపై గ్రామీణ ప్రాంతాల్లో తీసుకున్న పంట రుణాలకు రుణమాఫీని వర్తింపజేసింది. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేయనున్నారు. దీని ప్రకారం 2014 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 11 వరకు రైతులు తీసుకున్న, రెన్యువల్ చేసుకున్న పంట రుణాలు, వడ్డీలు కలుపుకొని రూ.లక్ష మించకుండా అర్హులైన వారందరికీ రుణ మాఫీ వర్తింపజేయనున్నారు. రైతులు పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకుని కొనుగోలు చేసే విధానానికి స్వస్తి చెప్పేందుకు సీఎం కేసీఆర్ హామీకి అనుగుణంగా సంస్థాగత రుణాలను మాఫీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర తీసుకున్న వారికి ఇది వర్తించదు. రైతు కుటుంబం అంటే భర్త, భార్య వారి మీద ఆధారపడి ఉన్న పిల్లలను పరిగణనలోకి తీసుకుంటారు. రూ.లక్షలో ప్రాసెసింగ్ ఫీజు, లీగల్ చార్జీలు, ఇన్సూరెన్స్ వంటివి ఉండవు. ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రూ.25 వేల వరకు ఉన్న పంట రుణాలు తీసుకున్న రైతులకు ఒకే దశలో మాఫీ చేస్తారు. మిగతా రైతులకు మిగిలిన మొత్తాన్ని 4 దశలుగా మాఫీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రుణమాఫీ సొమ్మును రైతులకు చెక్కుల రూపంలో చెల్లించనున్నారు.

అర్హుల గుర్తింపు ఇలా..

- మొదటి సారి మాఫీ చేసినప్పుడు తీసుకున్న కటాఫ్ తేదీ తర్వాత 2014 ఏప్రిల్ 01 నుంచి 2018 డిసెంబర్ 11 వరకు రైతులు తీసుకున్న, రెన్యువల్ పంట రుణాలు, వడ్డీలు కలుపుకొని రూ.లక్ష మించకుండా మాఫీ చేస్తారు.

వీటికి వర్తించదు..

- భాగస్వామ్య (టై అప్) రుణాలు, మూసేసిన పంట రుణాలు/రైటాఫ్ చేసిన రుణాలు
- జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జేఎల్‌జీ)/రైతు మిత్ర గ్రూప్ (ఆర్ఎంజీ)/లోన్ ఎలిజిబిలిటీ కార్డు (ఎల్ఈసీ)లకు ఇచ్చిన రుణాలు
- రీస్ట్రక్చర్డ్/రీషెడ్యూల్డ్ రుణాలు
- రుణమాఫీ ప్రయోజనం రైతులకు అందించేందుకు ఐటీ వ్యవస్థ లేదా పోర్టల్‌ను వ్యవసాయ శాఖ తయారు చేయాలి. రైతుల సమాచారం కోసం, వారి రుణాల మొత్తం వంటివి ఫైనల్ చేసేందుకు దీన్ని వినియోగించాలి.

రైతుల జాబితాల తయారీ ఇలా..

- 2018 డిసెంబర్ 11 నాటికి స్వల్పకాలిక పంట రుణాలు బకాయిపడిన రైతుల జాబితాల (ఏ-లిస్టు)ను గ్రామాల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో ప్రతి రుణ సంస్థ (బ్యాంకు) బ్రాంచీ తయారు చేయాలి.
- బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న పంట రుణాల మాఫీ గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే వర్తించనుంది. 2018 డిసెంబర్ 11 నాటికి ఇలాంటి రుణ బకాయిలు కలిగిన రైతుల జాబితాల (బీ-లిస్టు)ను ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో గ్రామాల వారీగా ప్రతి బ్యాంకు తయారు చేయాలి.
- బంగారం తాకట్టుపెట్టి అర్బన్, మెట్రోపాలిటన్ బ్యాంకులు/బ్రాంచీల నుంచి తీసుకున్న పంట రుణాలకు మాఫీ వర్తించదు. అర్బన్, మెట్రోపాలిటన్ బ్యాంకులకు సంబంధించిన గ్రామీణ బ్రాంచీల నుంచి బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న పంట రుణాలకు మాఫీ వర్తించనుంది.

- స్వల్పకాలిక పంట రుణాలు, గ్రామీణ ప్రాంతాల్లో బంగారంపై తీసుకున్న పంట రుణాలకు సంబంధించిన రైతుల జాబితాలను బ్యాంకు బ్రాంచీల మేనేజర్లు పోల్చి చూసి రూ.లక్ష వరకు రుణ బకాయిలు కలిగిన రైతు తుది జాబితాల (సి-లిస్టు)ను నిర్దేశిత నమూనాలో రూపొందించాలి. స్వల్ప కాలిక పంట రుణాలు తీసుకున్న రైతుల జాబితాలు, గ్రామీణ ప్రాంతాల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల జాబితాలు, తుది రైతుల జాబితాలను లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో పాటు జిల్లా కలెక్టర్లకు బ్రాంచీ మేనేజర్లు పంపాలి.
- కొందరు ఒకటి కంటే ఎక్కువ బ్రాంచీల నుంచి పంట రుణాలు పొంది ఉంటారు. ఒక బ్యాంకుకు చెందిన వేర్వేరు బ్రాంచీలు లేదా ఇతర బ్యాంకుల బ్రాంచీల నుంచి రుణాలు పొంది ఉండొచ్చు. ఒక కుటుంబానికి గరిష్టంగా రూ.లక్ష వరకు మాత్రమే రుణ మాఫీ వర్తించేలా నియంత్రించడంతో పాటు డూప్లికేషన్/మల్టీపుల్ ఫైనాన్సింగ్‌ను నియంత్రించేందుకు మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ (జేఎంఎల్‌బీసీ) సమావేశాన్ని నిర్వహించాలి. ఇందులో బ్యాంకర్లందరూ తమ బ్యాంకుల ఏ, బీ, సీ జాబితాలను తీసుకొచ్చి ఇతర బ్యాంకుల జాబితాలతో పోల్చి చూడాలి. అన్ని బ్రాంచీల తుది జాబితాలను మండల తహసీల్దార్ సైతం పరిశీలించి చూడాలి. నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్నారా? లేదా రుణ గ్రహీతలందరూ వ్యవసాయ భూములు కలిగి ఉన్నారా? అన్న విషయాన్ని తహశీల్దార్ పరిశీలించి చూడాలి. పరిశీలన అనంతరం ఏవైనా తప్పుడు క్లెయిమ్స్ ఉంటే తొలగించాలి. తర్వాత ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు బ్రాంచీల నుంచి రుణాలు పొందిన రైతు కుటుంబు సభ్యులను జేఎంఎల్‌బీసీ కమిటీ సభ్యులు గుర్తించాలి. వారి జాబితాల (డీ-లిస్టు)ను నిర్దేశిత నమూనాలో తయారు చేయాలి. జిల్లా సహకార ఆడిట్ అధికారి పర్యవేక్షణలో సహకార శాఖ ఆడిటర్లు ప్రాథమిక సహకార సంఘాలు, డీసీసీబీల ఏ, బీ, సీ జాబితాలను డీ జాబితాలతో పోల్చి చూడాలి. జిల్లా సహకార ఆడిట్ అధికారి తన పరిధిలోని మండలాలకు ఆడిటర్లను కేటాయించాలి. జిల్లా స్థాయి ఆడిట్ నివేదికను ఇవ్వాలి. జేఎంఎల్‌బీసీ రూపొందించిన డీ-జాబితాలను మండల స్థాయిలోని అన్ని బ్యాంకుల బ్రాంచీలకు అందుబాటులో ఉంచాలి.
- కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువబ్రాంచీల నుంచి రుణాలు తీసుకుని ఉంటే ఐటీ ఆధారంగా గుర్తించేందుకు బ్యాంకులు సమర్పించే తుది రైతుల జాబితా (సి-లిస్టు)ను విశ్లేషించి తుది డీ-జాబితాలను తయారు చేస్తారు.
- రైతులకు ఎన్ని బ్యాంకుల్లో ఎన్ని అప్పు ఖాతాలున్నా ఒక కుటుంబానికి ఒక లక్ష మేరకే రుణం మాఫీ చేయాలని నిర్ణయించారు.
- కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది పంట రుణానికి అర్హులైతే రూ. లక్ష మొత్తంలో ఉన్నవారందరికీ సమానంగా ఇస్తారు.
- స్వల్పకాలిక పంట రుణాలు 18 నెలల చెల్లింపు కాల వ్యవధి ఉన్న వాటికే మాఫీ వర్తిస్తుంది. ఉద్యాన పంటల కోసం పొందిన స్వల్పకాల రుణాలు ఈ పథకం పరిధిలోకి వస్తాయి.
- రైతు కుటుంబాలను గుర్తించేందుకు ఏఈవో, వీఆర్‌వో, పంచాయతీ సెక్రటరీల సాయం తీసుకుంటారు. వీరికి మండల తహసీల్దార్, ఎంపీడీవో, మండలవ్యవసాయాధికారి పర్యవేక్షకులు..
- తాత్కాలిక తుది జాబితా (జాబితా-ఈ)ను సంబంధిత గ్రామాలలో గ్రామ సభ నిర్వహించి ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా సామాజిక ఆడిట్ నిర్వహిస్తారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే స్వీకరించి వాటిని పరిష్కరిస్తారు. ఆ తర్వాత బ్రాంచ్‌ల వారీగా అర్హులైన రైతుల తుది జాబితాను లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా కలెక్టర్‌కు పంపుతారు.
- రైతుల వారీగా అర్హులైన వారి జాబితాను జిల్లాల్లో బ్యాంకర్ల మీటింగ్‌లో సమీక్షించి, రికార్డు చేసి దాన్ని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపిస్తారు. అదే ఐటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ తిరిగి బ్యాంకుల వారీగా రైతుల వారీగా చెల్లించాల్సిన మొత్తం వివరాలను, ప్రభుత్వం మంజూరు చేయాల్సిన మొత్తాన్ని నిర్ణయిస్తుంది.

రెండు నెలలు వెసులుబాటు ఇవ్వాలి

చిన్న వ్యాపారుల ఈఎంఐలపై మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

హైదరాబాద్: కోవిడ్-19 కారణంగా చిన్న వ్యాపారులు, కూలీలు తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉన్నారని, అందువల్ల వారికి అన్ని ఈఎంఐలపై రెండు నెలలు వెసులుబాటు కల్పించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ కోరారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌కు లేఖ రాశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రధానికి రాసిన లేఖను ఆయన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో కరోనా బాధితులు తక్కువగా ఉన్నారని తెలిపారు. ఇటాలియన్ దేశాల్లో అప్రమత్తత లోపం, మాకు ఏం కాదన్న అహంకార ధోరణి వల్ల ఎక్కువగా ప్రాణనష్టాలు జరుగుతున్నాయన్నారు. 99 శాతం దగ్గు, జలుబు ఉన్న వారికి కరోనా వ్యాధి ఉండదని, కాని దగ్గు, జలుబు ఉన్నవారంతా కరోనా వచ్చిందేమోనని ఆందోళన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా ప్రతీ ఒక్కరూ కరోనా వైద్య పరీక్షలు చేయించుకునే వీలు కల్పించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు గాను కేంద్రం వైద్య పరీక్షలు చేసే కిట్‌లు అన్ని ఆస్పత్రులకు సరఫరా చేయాలన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చిన ప్రయాణికులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ యథేచ్ఛగా తిరుగుతున్నారని ఇతర దేశాల నుండి వచ్చిన ప్రతీ ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రధాన హోటల్స్ ఎంచుకుని అక్కడ కూడా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని నర్సయ్య గౌడ్ సూచించారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR)
మాంసాహారం (చికెన్ & గుడ్లు) తినడానికి
కోవిడ్-19 (కరోనా వైరస్) కు ఎటువంటి
సంబంధం లేదని సుస్పష్టంగా తెలియజేసింది

- చైనా, అమెరికా మరియు ఆస్ట్రేలియా వంటి దేశాల్లో కరోనా వైరస్ వ్యాప్తి చెందిన తర్వాత, వినియోగదారులు తమ వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకోడానికి చికెన్ మరియు గుడ్లను విరివిగా తింటున్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా మాంసాహార వినియోగంలో చికెన్ వాటా 50 శాతానికి మించి ఉన్నదనేది వాస్తవం.

- (మూలం: మీడియా రిపోర్ట్స్ &
https://www.icmr.nic.in/sites/default/files/press_realease_files/Press_Release_ICMR_13March2020.pdf)

భారతదేశ వైద్య రంగంలో ఫార్ములేషన్, కోర్డినేషన్ మరియు బయో మెడికల్ పరిశోధనలో అత్యున్నత ప్రాధికార సంస్థ 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ICMR), న్యూఢిల్లీ', ఇది ప్రపంచంలోనే పేరుగాంచిన అత్యంత పురాతన సంస్థ.

ప్రజా ప్రయోజనార్థం జారీ చేసినవారు :
Vencobb FRESH CHICKEN
ఆనిండియా పౌల్ట్రీ డెవలప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్
NECC
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ

ఏపీ విద్యుత్ ఉద్యోగుల అడ్డగింత

- రిపోర్టు చేయకుండా అడ్డుకున్న తెలంగాణ ఉద్యోగులు
- విధుల్లోకి చేర్చుకోవద్దని ట్రాన్స్‌కో సీఎండీకి విన్నపం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రిలీవ్ చేసిన 71 మంది విద్యుత్ ఉద్యోగులు తెలంగాణ విద్యుత్ సంస్థల్లో రిపోర్టు చేయడానికి మంగళవారం విద్యుత్ సౌధకు రాగా, తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘాలు వారిని అడ్డుకున్నాయి. దీంతో ఏపీ ఉద్యోగులు రిపోర్టు చేయకుండానే వెనుదిరిగారు. తెలంగాణకు అన్యాయం చేసే విధంగా ఏపీ విద్యుత్ సంస్థలు ఏకపక్షంగా రిలీవ్ చేసిన విద్యుత్ ఉద్యోగులను ఎట్టి పరిస్థితిలో ఇక్కడ చేర్చుకోవడానికి వీల్లేదని తెలంగాణ విద్యుత్ ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. విద్యుత్ ఉద్యోగుల విభజన వివాద పరిష్కారం కోసం సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ కేఎం ధర్మాధికారి కమిటీ తుది నివేదికకు అనుబంధంగా జారీ చేసిన మరో నివేదిక తెలంగాణకు వ్యతిరేకంగా ఉందని తప్పుబట్టాయి. ధర్మాధికారి కమిటీ విద్యుత్ ఉద్యోగుల తుది కేటాయింపుల్లో న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా వ్యవహరించలేదని పేర్కొన్నాయి. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ జేఏసీ, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంపాయీస్ జేఏసీల ఆధ్వర్యంలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ సౌధలో వేర్వేరుగా నిరసన దీక్షలు ప్రారంభించాయి. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల యాజమాన్యాల వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏపీ రిలీవ్ చేసిన విద్యుత్ ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థలు చేర్చుకుంటే తీవ్ర ఆర్థిక భారం పడటంతో పాటు తెలంగాణ విద్యుత్ సంస్థల పనితీరుపై ప్రభావం పడనుందని జేఏసీ నేతలు శివాజీ, రత్నాకర్‌రావులు పేర్కొన్నారు. ఏపీ రిలీవ్ చేసిన 655 మంది ఉద్యోగుల్లో 71 మంది మినహా మిగిలిన 584 మంది ఉద్యోగులను ఎట్టి పరిస్థితిలో తెలంగాణలో చేర్చుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావును కలసి వినతి పత్రం అందజేశారు.

గ్రూపు-4 అభ్యర్థులకు మెడికల్ టెస్టులు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ (గ్రూపు-4) పోస్టుల భర్తీలో భాగంగా ఇటీవల నిర్వహించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన వారికి ఈ నెల 18, 19 తేదీల్లో మెడికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టెస్టులు అంగవైకల్యం కలిగిన వారికి మాత్రమే నిర్వహించనున్నట్లు పేర్కొంది. నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మెడికల్ టెస్టులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. అభ్యర్థులు తమ హాల్‌టికెట్, ఐడీ ప్రూఫ్, లేటెస్ట్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలని, రూ.400 ఫీజుగా మెడికల్ బోర్డు వారికి చెల్లించాల్సి ఉంటుందని వివరించింది. మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని పేర్కొంది.

'లాంగ్వేజ్ పండిట్'లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యలో ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా లాంగ్వేజ్ పండిట్ (తెలుగు) అభ్యర్థులు ఈ నెల 21, 23 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఆ రెండు రోజుల్లో ఉదయం 10:30 గంటలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభమవుతుందని పేర్కొంది. వెరిఫికేషన్‌కు 153 మందిని ఎంపిక చేశామని, మరిన్ని వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని వెల్లడించింది.

రంజన్ గొగోయ్‌ను రాజ్యసభకు పంపడం అనైతికం: సురవరం సుధాకర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగోయ్‌ను రాజ్యసభకు నామినేట్ చేయడం అనైతికమే కాకుండా తప్పుడు సంప్రదాయానికి తెరతీస్తుందని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఈ నియామకం క్విడ్‌ప్రోకోగా కనిపిస్తోందని, అందువల్ల అయోధ్యలో రామమందిర నిర్మాణం, రఫేల్ ఒప్పందాలపై గొగోయ్ ఇచ్చిన తీర్పు సునిశితంగా పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక రిటైర్డ్ జడ్జికి ఇలాంటి ఆకర్షణీయమైన బహుమతి అందించడమంటే ఇప్పుడు పనిచేస్తున్న జడ్జిలకు ఒక సందేశాన్ని ఇచ్చినట్లు అయిందని తెలిపారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ఇదో దిగ్భ్రాంతికరమైన కుదుపు అని అభిప్రాయపడ్డారు.

సెక్యులరిజానికి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్: కర్నె

సాక్షి, హైదరాబాద్: మత రాజకీయాలతో దేశాన్ని బీజేపీ రావణ కాష్ఠంగా మారుస్తోందని, విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తున్న ప్రధాని మోదీయే దేశ ద్రోహి అని మండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. దేశంలో సెక్యులరిజానికి సీఎం కేసీఆర్ నిజమైన బ్రాండ్ అంబాసిడర్ అని, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే దేశవ్యాప్త ఉద్యమానికి కేసీఆర్ నాయకత్వం వహిస్తారని హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలోని టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ పెద్దలు దేశ ద్రోహానికి పాల్పడుతున్నందునే సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. సీఏఏ, ఎన్పీఆర్, ఎన్ఆర్సీలకు వ్యతిరేకంగా శాసనసభ, శాసన మండలి తీర్మానాలతో బీజేపీ బెంబేలెత్తుతోందని విమర్శించారు. సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన కేసీఆర్‌ను దేశద్రోహిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ పేర్కొనడాన్ని ఖండించారు. కేసీఆర్‌ను దేశద్రోహిగా ముద్రవేసే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు సహించబోరని, కేసీఆర్ దేశభక్తిపై బీజేపీ నేతల సర్టిఫికెట్లు అవసరం లేదని వ్యాఖ్యానించారు.

సీఏఏ కోసం 10 పేజీలు చదవండి

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: సీఏఏ వల్ల ఎవరికీ ఇబ్బందులు లేవని, 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ సీఏఏ గురించి తెలుసుకునేందుకు 10 పేజీలు చదివితే బాగుండేదని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. అసెంబ్లీలో సమస్యలు చర్చించకుండా అన్ని డ్రామాలే ఆడారని విమర్శించారు. సభలో ఏ సమస్య గురించి అడిగినా సమాధానమివ్వకుండా, కోవిడ్ పేరు చెప్పి సమస్యలపై చర్చించకుండా అసెంబ్లీ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కారు కేసీఆర్‌దే అయినా, స్టీరింగ్ ఎంఐఎం చేతుల్లో ఉందన్నారు. అసలు ఎంఐఎం అంటే కేసీఆర్‌కు ఎందుకంత భయమని ప్రశ్నించారు. సీఏఏ వల్ల కేసీఆర్‌కు భయమెందుకు అని, ఆయనది తెలంగాణ కాదా? అని ప్రశ్నించారు.

తెలంగాణ బీజేపీ ఎంపీల మౌన దీక్ష

సీఏఏపై రాష్ట్ర అసెంబ్లీ తీర్మానానికి నిరసన

మౌన దీక్ష చేస్తున్న ఎంపీలు అరవింద్, సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా తెలంగాణ శాసన సభ తీర్మానించడాన్ని నిరసిస్తూ తెలంగాణ బీజేపీ ఎంపీలు, పలువురు నేతలు మంగళవారం ఇక్కడి తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మౌన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావు, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి కామర్సు బాలసుబ్రమణ్యం, బీజేపీ తెలంగాణ అధికార ప్రతినిధి రాకేశ్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాల సమన్వయకర్త నూనె బాలరాజు, పలువురు నేతలు పాల్గొన్నారు. దీక్ష అనంతరం సంజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. 'నిన్న శాసనసభలో సీఎం దేశద్రోహ వైఖరి చూసి తెలంగాణ సభ్య సమాజం తలదించుకుంది. రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తిని సీఎంగా ఎన్నుకోవడం దురదృష్టకరమని తెలంగాణ సమాజం భావిస్తోంది. సీఏఏ ముస్లింలకు వ్యతిరేకం కాదు. పౌరసత్వం ఇచ్చేది తప్ప తొలగించేది కాదు. ఇతర దేశాల నుంచి ముస్లింలు రావాలని కేసీఆర్ ఎందుకు కోరుకుంటున్నారు? వారిని రప్పించి ఇక్కడి ముస్లింల పొట్టకొట్టాలని చూస్తున్నారు. దేశం చట్టం చేసిన తర్వాత దానిని అమలు చేసే బాధ్యత రాష్ట్రాలపై ఉంది. తీర్మానంతో ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించడమే తప్ప దానివల్ల ఒరిగేదేమీ ఉండదు. 'ఎన్పీఆర్‌లో ముఖ్యమంత్రి కుటుంబంగానీ, ఒవైసీ కుటుంబంగానీ నమోదు చేసుకోని పక్షంలో పాకిస్తాన్‌కో, బంగ్లాదేశ్‌కో, అఫ్గానిస్తాన్‌కో వారు శరణార్థులుగా పోయే పరిస్థితి వస్తుంది'అని పేర్కొన్నారు.

సర్కార్‌కు చిత్తశుద్ధి లేదు

టీపీసీసీ ప్రతినిధులు అద్దంకి, బెల్లయ్య

అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: సీఏఏ, ఎన్పీఆర్, ఎన్ఆర్‌సీలపై టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తీర్మానం కేవలం ఎంఐఎం కోసం, ముస్లిం ఓట్ల కోసమేనని టీపీసీసీ అధికార ప్రతినిధులు అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్‌లు ఆరోపించారు. సీఏఏ, ఎన్పీఆర్‌లను వ్యతిరేకించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. మంగళవారం గాంధీభవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రభుత్వ తీర్మానం వ్యతిరేకించడానికి తప్ప ఆపేందుకు ఏమాత్రం ఉపయోగపడదని స్పష్టం చేశారు. ఎన్పీఆర్‌లో ఇచ్చేది డిజిటల్ డేటా అని, దాని ప్రకారమే ఎన్ఆర్‌సీని చేపడతారని, దీంట్లో ఎలాంటి అనుమానం ఉన్న 'సందేహాత్మకం'కింద నమోదు చేస్తారన్నారు. ఈ డేటా ఎంట్రీ చేసే ఎన్యుమరేటర్లు ఆర్ఎస్ఎస్‌కు అనుకూలమైన వారే ఉంటారని ఆరోపించారు.

అప్పులు, మద్యం అమ్మకాల్లోనే ప్రగతి

జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడంతో పాటు మద్యం అమ్మకాల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రగతి సాధించిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవాచేశారు. బడ్జెట్ సమావేశాల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం సమాధానాలు దాటవేసే ధోరణిలో వ్యవహరించిందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.42,300 కోట్ల అప్పు చేయబోతోంద ని, దీంతో రాష్ట్రం అప్పు రూ.3,18,805 కోట్లకు చేరుతుందన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం వారిని జులాయిలుగా, నిరుద్యోగులు గా తయారు చేస్తోందని మండిపడ్డారు. మద్యం అమ్మకాల్లో దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ చేసింది టీఆర్ఎస్ సర్కారేనని ధ్వజమెత్తారు. మ ద్యం మహమ్మారి కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందని ఆరోపించారు. ఐటీ రంగంలో తెలంగాణ యువత ఉద్యోగాల గురించి తాను ప్రశ్నిస్తే కేటరింగ్ అవకాశాలు వచ్చాయని మంత్రి హరీశ్‌రావు జవాబిచ్చారని చెప్పారు.

సమస్యలను పరిష్కరించండి: తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమ్మె, ఉద్యోగుల తొలగింపు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ సక్రమంగా అమలు జరగాలంటే సీఎం జోక్యం చేసుకుని, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

గొగోయ్‌ను రాజ్యసభకు పంపడం రాజ్యాంగ విరుద్ధం: బీసీ సంక్షేమ సంఘం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి కోటా కింద సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్‌ను రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయడం పట్ల బీసీ సంక్షేమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించింది. ఆశ్రిత పక్షపాతం, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని వాపోయింది. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బహిరంగ ప్రకటన విడుదల చేశారు.

ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్ పేపర్లలో తప్పులు

- అక్షర దోషాలు, అన్వయ దోషాలు, తప్పుడు పదాలు
- తీవ్ర ఇబ్బందులు పడిన విద్యార్థులు
- ఆ 3 ప్రశ్నలు రాసిన వారందరికీ మార్కులు: సయ్యద్ ఉమర్ జలీల్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రథమ సంవత్సర కెమిస్ట్రీ, కామర్స్ ప్రశ్నపత్రాల్లో పొరపాట్లు దొర్లాయి. అక్షర దోషాలు, అన్వయ దోషాలు, తప్పుడు పదాలతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. ప్రశ్నలు అర్థం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆ తర్వాత అక్షర దోషాలు, అన్వయ దోషాలు ఏయే ప్రశ్నల్లో ఉన్నాయో పరీక్ష కేంద్రాలకు సమాచారం ఇచ్చి, విద్యార్థులకు తెలియజేశారు. కామర్స్ తెలుగు మీడియం ఓల్డ్ సిలబస్‌లో మాత్రం 3 ప్రశ్నలు తప్పుగా ఉన్నాయని గుర్తించినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ వెల్లడించారు. ఆ మూడు ప్రశ్నలకు జవాబులు రాసిన (తప్పైనా, ఒప్పైనా) వారందరికీ మార్కులు ఇస్తామని తెలిపారు. మరోవైపు ఈ పరీక్షలు రాసేందుకు 5,03,429 మంది రిజిస్టర్ చేసుకోగా.. 4,78,987 మంది హాజరయ్యారు. 24,442 మంది (4.85%) గైర్హాజరయ్యారు. ఇక 26 మంది విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులను బుక్ చేసినట్లు ఉమర్ జలీల్ వెల్లడించారు.

ఇవీ ప్రశ్నపత్రాల్లో దొర్లిన తప్పులు..

- కామర్స్-1 తెలుగు మీడియం (ఓల్డ్ సిలబస్) సెక్షన్-డి 18వ ప్రశ్నలో డెబిట్ వైపు అప్పులకు బదులుగా క్రెడిట్ నిలువలు అని ఉండాలి.
- తెలుగు మీడియం (న్యూ సిలబస్) కామర్స్-1లో 16వ ప్రశ్నలో నిలి అని ఉంది. అక్కడ నిలిపి అని ఉండాలి.
- సెక్షన్-ఈ 19వ ప్రశ్నలో తేదీ 8లో చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేశారు అని ఉండాలి.
- సెక్షన్-ఎఫ్‌లో 22వ ప్రశ్నలో తేదీ 5న వంశీకి అమ్మిన సరుకుకు బదులుగా వంశీ నుంచి కొన్న సరుకు అని ఉండాలి. అలాగే తేదీ 10లో వంశీకి అమ్మిన సరుకు రూ.1,200 అని ఉండాలి. ఇదీ ప్రింట్ కాలేదు.
- సెక్షన్-ఎఫ్‌లో 23వ ప్రశ్నలో 2018 అని పొరపాటుగా వచ్చింది. అది ఉండకూడదు.
- సెక్షన్-జీలో 31వ ప్రశ్నలో రుణగ్రస్తులు రూ.28,000 అని ఉండడానికి బదులుగా రూ.22,000 అని వచ్చింది.
- కెమిస్ట్రీ-1లో (ఇంగ్లిష్ మీడియం) సెక్షన్-బి 14వ ప్రశ్నలో ప్రశ్న చివరలో with an example అని ఉండాలి.
- సెక్షన్-జీలో 27వ ప్రశ్నలో PAID CHEQUES బదులుగా PAID SALARIES అని ఉండాలి.
- కెమిస్ట్రీ-1లో (తెలుగు మీడియం) సెక్షన్-బీలో 15వ ప్రశ్నలో 10.6 శాతానికి బదులుగా 10.06 శాతం అని ఉండాలి.
- సెక్షన్-బీలో 16వ ప్రశ్నలో HYDIDE కు బదులుగా HYDRIDE అని ఉండాలి.

పూర్తయిన ప్రథమ సంవత్సర ప్రధాన పరీక్షలు

ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు మంగళవారంతో పూర్తయ్యాయి. ఈ నెల 19, 21 తేదీల్లో మరికొన్ని సబ్జెక్టుల పరీక్షలు ఉన్నాయి. ప్రధాన పరీక్షలు పూర్తికావడంతో సయ్యద్ ఉమర్ జలీల్ ఇంటర్ విద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాన గ్రూపులకు చెందిన విద్యార్థులు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు అంతా తమ ఇళ్లకు వెళ్లినట్లు అధికారులు వివరించారు. మరోవైపు ద్వితీయ సంవత్సర ప్రధాన పరీక్షలు ఈ నెల 18తో పూర్తికానున్నాయి. 20, 23 తేదీల్లో మరికొన్ని సబ్జెక్టుల పరీక్షలు ఉన్నాయి.

రేపటి నుంచే టెన్త్ పరీక్షలు

- రాష్ట్రవ్యాప్తంగా రాయనున్న 5,34,903 మంది విద్యార్థులు
- గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోండి: పరీక్షల విభాగం డైరెక్టర్
- పరీక్ష ప్రారంభమయ్యాక నో ఎంట్రీ.. ఆలస్యం చేసి నష్టపోవద్దు
- కోవిడ్ నేపథ్యంలో ఎంత ముందుగా వచ్చినా హాల్లోకి అనుమతి
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు: మంత్రి సబిత
- అనారోగ్యంతో ఉన్న వారు పరీక్షలు రాసేందుకు ప్రత్యేక గదులు
- ప్రతి పరీక్ష కేంద్రంలో సానిటైజర్లు, లిక్విడ్ సోప్‌లు..
- మాస్కులు, వాటర్ బాటిళ్లతో పరీక్షలకు వచ్చేందుకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,530 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి వెల్లడించారు. కోవిడ్ నేపథ్యంలో విద్యార్థులు అంతా ఒకేసారి రాకుండా, ఒకేచోట గుంపులుగా ఉండకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎంత మందుగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించడమే కాకుండా పరీక్ష హాల్లోకి పంపించేలా చర్యలు చేపట్టాలని డీఈవోలను ఆదేశించినట్లు చెప్పారు.

గ్రేస్ పీరియడ్ ఉండదు..

గతంలో మాదిరిగా గ్రేస్ పీరియడ్ అంటూ ఏమీ ఉండదని, ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమయ్యాక విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించేది లేదని సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. అందుకే విద్యార్థులు వీలైనంత ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చి నష్టపోవద్దని చెప్పారు. కనీసం గంట ముందుగానే (ఉదయం 8:30 గంటల కల్లా) వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని.. ముందు రోజే ఓ సారి పరీక్ష కేంద్రాన్ని చూసుకుంటే మంచిదని సూచించారు. ఇప్పటికే హాల్‌టికెట్లను పంపిణీ చేశామని, అందని వారు తమ వెబ్‌సైట్ నుంచి (www.bse.telangana.gov.in) డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్షలకు హాజరు కావచ్చని వెల్లడించారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ఎవరి సంతకం అక్కర్లేదని స్పష్టంచేశారు.

బాలురే అధికం..

రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు 11,045 పాఠశాలలకు చెందిన 5,34,903 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అందులో 2,73,971 మంది బాలురు కాగా, 2,60,932 మంది బాలికలున్నారు. మొత్తం విద్యార్థులు 5,09,079 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 25,824 మంది ప్రైవేటు విద్యార్థులున్నారు. పరీక్షల నిర్వహణలో 30,500 మంది టీచర్లు ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. మాల్ ప్రాక్టీస్‌ను నిరోధించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం నుంచి 144 సిట్టింగ్ స్క్వాడ్స్, 4 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటుచేశారు.

అధికారులతో మంత్రి సబిత సమీక్ష

విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షలు బాగా రాయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరేందుకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం ఆమె అధికారులతో సమీక్షించారు. కోవిడ్ నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎవరైనా విద్యార్థులు జలుబు, దగ్గుతో బాధపడుతూ అనారోగ్యంగా ఉంటే వారి కోసం ప్రత్యేక గదుల్లో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు చేతులను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సానిటైజర్లు, లిక్విడ్ సోప్‌లను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. విద్యార్థులు మాస్కులు ధరించినా, వాటర్ బాటిళ్లు తెచ్చినా అనుమతిస్తామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లను రిజర్వులో ఉంచుతున్నామని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే వారి స్థానంలో ఇతరులను నియమిస్తామని చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

పరీక్ష కేంద్రాల్లో వైద్య సిబ్బంది..

ఇప్పటివరకు వెబ్‌సైట్ నుంచి 4.05 లక్షల మంది విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సబిత వెల్లడించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో ఇద్దరు చొప్పున వైద్య సిబ్బందిని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలోనూ (040-23230942), జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, అదనపు డైరెక్టర్లు రమణ కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మండలి 'స్థానిక' అభ్యర్థిగా కవిత

▶ మొదటి పేజీ తరువాయి

హాజరుకానున్నారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కవిత ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత పార్టీ కార్యకలాపాల్లో అంతగా కనిపించని కవిత ఈ నెల 13న జరిగిన పార్టీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే రోజు కవిత జన్మదినం కూడా కావడంతో అసెంబ్లీ ఆవరణలో మంత్రులు, ఎమ్మెల్యేలు కవితకు శుభాకాంక్షలు తెలిపారు. నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న లోయపల్లి నర్సింగారావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులు రెండు రోజుల క్రితం ముగిసిన శాసనసభ సమావేశాల సందర్భంగా సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. అయితే పార్టీ నుంచి అధికారిక ప్రకటన వెలువడకముందే లోయపల్లి నర్సింగారావు టీఆర్ఎస్ అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేయడం చర్చనీయాంశమైంది. కాగా, గవర్నర్ కోటా స్థానానికి సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్ రావు, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. గవర్నర్ కోటా అభ్యర్థిని కూడా బుధవారం ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సీఏఏపై కేరళ తరహాలో జీవో ఇవ్వాలి

వివిధ పార్టీలు, సంఘాల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్పీఆర్, ఎన్నార్సీలను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానంతోనే సరిపెట్టకుండా కేరళ ప్రభుత్వం తరహాలో జీవో జారీచేయాలని, అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వివిధ రాజకీయపార్టీలు, సంఘాలు డిమాండ్ చేశాయి. దేశంలో గత 73 ఏళ్లుగా కొనసాగుతున్న లౌకికవ్యవస్థను బీజేపీ దెబ్బతీసి మత చిచ్చును రగిలిస్తోందని, దేశంలో మతరాజ్యం తెచ్చేందుకు భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తాయి. ఏప్రిల్‌లో చేపట్టే జనగణనలో ఎన్పీఆర్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వొద్దని ప్రజలను కోరుతూ ఇంటింటి ప్రచారాన్ని చేపట్టనున్నట్లు ప్రకటించాయి. మంగళవారం మఖ్దూంభవన్‌లో మీడియా సమావేశంలో చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, సుధాకర్ (సీపీఐ), తమ్మినేని, డీజీనరసింహారావు (సీపీఎం), పీఎల్ విశ్వేశ్వరరావు (టీజేఎస్), గోవర్ధన్, రమాదేవి (న్యూడెమోక్రసీ రెండు గ్రూపులు), రాజ్యాంగహక్కుల పరిరక్షణ వేదిక, అలయెన్స్ అగెన్స్ సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ ప్రతినిధులు అబ్దుల్ జబ్బార్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23న షహీద్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రధానిని కలిసిన ఎంపీ కోమటిరెడ్డి

నాలుగు అంశాలపై వినతి పత్రాలు • ప్రాజెక్టుల్లో అవినీతిపై ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మంగళవారం ఇక్కడ కలిశారు. నాలుగు అంశాలపై ఆయన ప్రధాన మంత్రికి విజ్ఞాపన పత్రాలు అందజేయడంతో పాటు, తెలంగాణలోని పలు ప్రాజెక్టుల్లో వందల కోట్ల మేర అవినీతి జరుగుతోందని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ. 64 వేల కోట్ల రుణం తీసుకుని, ఆ నిధులను యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రాజెక్టు నిర్మాణంలో నామినేషన్ల ద్వారా కొన్ని కంపెనీలకు కట్టబెట్టారని ఫిర్యాదు చేసినట్టు సమాచారం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భారీఎత్తున అవినీతి జరిగిందని, దీనిపై విచారణ జరిపించాలని కోరినట్టు సమాచారం.

ఫార్మా సిటీకి అనుమతులు నిరాకరించండి

హైదరాబాద్‌లో ఫార్మా సిటీకి పర్యావరణ అనుమతులను నిలిపివేయాలని కోమటిరెడ్డి ప్రధాన మంత్రిని కోరారు. పర్యావరణానికి హాని కలిగించకుండా హైదరాబాద్ సమీపంలో కాకుండా మరోచోట ఫార్మాసిటీ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొత్త గూడెం వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ప్రధాన మంత్రి సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. మూసీ నది అనేక రసాయనాలతో కలుషితమైందని, నమామీ గంగే తరహాలో మూసీ నది ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. రూ.3 వేల కోట్లతో మూసీ నదిని సమూలంగా శుభ్రం చేయాలని కోరారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద బ్లాక్ లెవెల్ క్లస్టర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఇంటింటికీ నల్లా నీరు ఇంకా అందడం లేదని, జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. హౌసింగ్ పథకాన్ని కూడా కేంద్రమే చేపట్టాలని కోరినట్టు వివరించారు.

హతమార్చి.. ముఖం ఛిద్రం చేసి..

▶ మొదటి పేజీ తరువాయి

ఓ నైలాన్ తాడు తప్ప మరే ఆధారాలు లభ్యం కాలేదు. మహిళ వివస్త్రగా పడి ఉండగా, ఆమె దుస్తులు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలు పరిసరాల్లో ఎక్కడా కనిపించలేదు. మృతదేహాన్ని వంతెన పైనుంచి తాడుతో కిందికి దించిన తరువాత ముఖంపై బండరాళ్లతో మోదినట్టుగా ఉంది. పక్కనున్న రాళ్లపై రక్తం అంటుకుని ఉండటంతో పోలీసులు ఈ అంచనాకు వచ్చారు. మహిళ ఒంటిపై రెండు బంగారు గాజులు, వేలికి బంగారు ఉంగరం, మెడలో బంగారు లాకెట్ ఉన్నాయి. ఘటన స్థలంలో పెనుగులాట జరిగిన ఆనవాళ్లు లేవని, అంటే వేరే ప్రాంతంలో లైంగికదాడికి పాల్పడి, హతమార్చి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని కోణాల్లో దర్యాప్తు: డీసీపీ

ఘటన జరిగిన తీరు.. మరో 'దిశ'ఉదంతంలా ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. ఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం శంషాబాద్ డీసీపీ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే కేసును ఛేదిస్తామన్నారు. మృతదేహాన్ని ఎక్కడి నుంచో తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లు తెలుస్తోందని, లభ్యమైన బంగారు నగలను ల్యాబ్‌కు తరలిస్తామని చెప్పారు. ఘటనపై సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లను అప్రమత్తం చేశామన్నారు. సోమవా రం రాత్రి నుంచి మంగళవారం ఉద యం వరకు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించిన వాహనాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నామన్నారు. 4 బృందా

భారత్‌లో మూడో మరణం

ముంబైలో కోవిడ్-19తో మృతి చెందిన 63 ఏళ్ల వ్యక్తి

భారత్‌లో ఇప్పటివరకు 137 కేసులు

న్యూఢిల్లీ: భారత్‌లో మంగళవారం మూడో కరోనా మరణం నమోదైంది. ముంబైలో 63 ఏళ్ల వ్యక్తి ఈ వైరస్ బారిన పడి మరణించారు. ఇటీవల దుబాయ్ వెళ్లి వచ్చిన ఆ వ్యక్తికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలో 39 కరోనా నిర్ధారిత కేసులు నమోదయ్యాయి. తర్వాతి స్థానంలో కేరళ(26 కేసులు) ఉంది. హరియాణా, యూపీలో చెరో 15, ఢిల్లీలో 8, లద్దాఖ్‌లో 6, కశ్మీర్‌లో 3 కేసులు కరోనా పాజిటివ్‌గా తేలాయి. దేశవ్యాప్తంగా మంగళవారం నాటికి కోవిడ్ బాధితుల సంఖ్య 137కి పెరిగింది. వాటిలో సోమవారం రాత్రి నుంచి 12 కేసులు నమోదవడం గమనార్హం. ఈ 137 మందిలో 24 మంది విదేశీయులున్నారు. కర్ణాటకలోని కల్బుర్గికి చెందిన 76 ఏళ్ల వృద్ధుడు, ఢిల్లీకి చెందిన 68 ఏళ్ల మహిళ కోవిడ్‌తో మరణించడం తెల్సిందే. ముంబైలో మంగళవారం మరణించిన వ్యక్తి భార్యకు వైరస్ సోకింది. ఆమె కస్తూర్బా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కొత్త కేసుల్లో రెండు నోయిడాలో, రెండు బెంగళూరులో నమోదయ్యాయి. కొత్తగా నమోదైన రెండు కేసులతో కలిపి కర్ణాటకలో నమోదైన కేసుల సంఖ్య 11కి పెరిగింది. అలాగే, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కరోనా సోకి, చికిత్స అనంతరం కోలుకుని డిశ్చార్జ్ అయినవారి సంఖ్య 14 అని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. కరోనా సోకిన 137 మందితో సన్నిహితంగా ఉన్న దాదాపు 52 వేల మందిని గుర్తించామని, వారిని ఐసోలేట్ చేసి, వైద్య పరీక్షలు జరుపుతున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. సామాజిక పరిశీలన, ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చడం సహా కరోనాను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో థర్మల్ స్క్రీనింగ్‌ను ఏర్పాటు చేయాలని, సందర్శకుల పాస్‌లను రద్దు చేయాలని కేంద్రం అన్ని మంత్రిత్వ శాఖలను ఆదేశించింది. ఫ్లూ లక్షణాలున్న వారిని తక్షణమే వేరుగా ఉంచి, నిర్ధారణ పరీక్షలు జరపాలని సూచించింది. అనవసర పర్యటనలను రద్దు చేసుకోవాలని, వీలైన ప్రతీసారి వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా సమావేశాలు నిర్వహించాలని అధికారులను కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ ఆదేశించింది. ఫ్లూ లక్షణాలున్నవారికి సెలవుల మంజూరులో అలసత్వం చూపొద్దంది.

ఎయిడ్స్‌కు వాడే మందులు

కోవిడ్ సోకినవారికి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు వాడే యాంటీవైరల్ ఔషధాలైన లోపినవైర్, రొటినవైర్ కాంబినేషన్‌ను ఇవ్వాలని కేంద్ర ఆరోగ్య శాఖ వైద్యులకు సూచించింది. ఒక్కోకేసు తీవ్రత, లక్షణాలను బట్టి నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. 60 ఏళ్ల వయసు దాటిన, మధుమేహం, ఊపిరితిత్తులు, కిడ్నీ సమస్యలు ఉన్న హై రిస్క్ గ్రూప్‌లో ఉన్నవారికి లోపినవైర్, రొటినవైర్ కాంబినేషన్ ఇవ్వాలని సూచించింది. 'క్లినికల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కోవిడ్-19' పేరుతో మంగళవారం ఒక మార్గదర్శక ప్రకటన విడుదల చేసింది. ఎయిమ్స్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపుణులు ఈ మార్గదర్శకాలను రూపొందించారు. లోపినవైర్, రొటినవైర్ కాంబినేషన్‌ను హెచ్ఐవీ చికిత్సకు వాడతారు.



రైల్వే ప్లాట్‌ఫాం టికెట్ ధర రూ.50

- పశ్చిమ రైల్వే, సెంట్రల్ రైల్వే అన్ని పెద్ద స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ ధరను రూ. 10 నుంచి రూ. 50కి పెంచాయి. కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు ఆ నిర్ణయం తీసుకున్నాయి. ప్రయాణికులు లేని కారణంగా మార్చి 18 నుంచి ఏప్రిల్ 1 మధ్య ప్రయాణించాల్సిన 23 రైళ్లను సెంట్రల్ రైల్వే రద్దు చేసింది. చెన్నైలోనూ ప్లాట్ ఫాం టికెట్ ధరను దక్షిణ రైల్వే రూ. 50 చేసింది.
- అఫ్గానిస్తాన్, ఫిలిప్పైన్స్, మలేసియాల నుంచి మార్చి 31 వరకు భారత్‌కు ఎవరూ రాకూడదని నిషేధం విధించింది. యూరోపియన్ యూనియన్ దేశాలు, టర్కీ, బ్రిటన్‌ల నుంచి ప్రయాణికులను భారత్ ఇప్పటికే నిషేధించిన విషయం తెలిసిందే.
- రాష్ట్రంలో ఏ నగరాన్నీ లాక్ డౌన్ చేయాలని అనుకోవడం లేదని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే చెప్పారు. అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని, లేదంటే, అన్ని రైలు, బస్సు ప్రయాణాలను నిషేధిస్తామని హెచ్చరించారు. కరోనా ముప్పు నేపథ్యంలో అన్ని పరీక్షలను వాయిదా వేశామన్నారు.
- కరోనా కట్టడికి రూ. 200 కోట్లతో ఒక అత్యవసర నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు పశ్చిమబెంగాల్ సీఎం మమత ప్రకటించారు. మార్చి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని సినిమా హాల్స్, స్టేడియంలు, ఆడిటోరియంలను, ఏప్రిల్ 15 వరకు అన్ని విద్యా సంస్థలను మూసేయాలని ఆదేశించారు.
- విదేశాంగ శాఖ సహాయ మంత్రి మురళీధరన్ ముందుజాగ్రత్తగా తన ఇంట్లో ఏకాంతవాసంలోకి వెళ్లారు. ఆయన మార్చి 14న కేరళలో ఒక ఆసుపత్రి(ఎస్‌సీటీఐఎంఎస్‌టీ)ని సందర్శించారు. ఇటీవల స్పెయిన్ వెళ్లివచ్చిన ఆ ఆసుపత్రి వైద్యుడికి వైరస్ సోకినట్లు తాజాగా నిర్ధారణ అయింది. ఆ నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.
- ఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయాలు, ఇతర ప్రైవేటు పాఠశాలలు పరీక్షల ఫలితాలు ఆన్ లైన్‌లోనే ప్రకటించాలని, పేరెంట్-టీచర్ మీటింగ్స్‌ను జరపకూడదని నిర్ణయించాయి.
- ప్రస్తుతం కరోనా వైరస్‌ను నిర్ధారించేందుకు 72 ఐసీఎంఆర్ ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయని, త్వరలో ఎన్‌ఏబీఎల్ అక్రెడిటేషన్ పొందిన ప్రైవేటు ల్యాబ్స్ అందుబాటులోకి వస్తాయని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ తెలిపారు.
- మార్చి 31 వరకు ముఖ్యమైన కేసులను మాత్రమే, అదీ ఆడియో- వీడియో కాన్ఫెరెన్స్ ద్వారానే విచారించాలని కేంద్ర సమాచార కమిషన్ నిర్ణయించింది.
- కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మంగళవారం తొలి కేసు నమోదైంది. దాంతో ఈ నెలాఖరు వరకు విద్యాసంస్థలు, సినిమా హాల్స్ మొదలైన వాటిని మూసేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ముంబైలో కరోనా సోకిన వారికి చేతి మీద వేసిన ముద్ర

మైసూరులో బర్డ్ ఫ్లూ

మైసూరు: కర్ణాటకలో బర్డ్ ఫ్లూ వెలుగుచూసింది. మంగళవారం మైసూరు పరిసరాల్లో పలు కోళ్ల ఫారాలపై మున్సిపల్, వైద్యారోగ్య అధికారులు దాడులు నిర్వహించి, సుమారు 3-4 వేల కోళ్లను సజీవంగా పాతిపెట్టారు. ఇటీవల మైసూరు చెరువు వద్ద పక్షులు ఆకస్మికంగా మృత్యువాత పడ్డాయి. దీనికి బర్డ్ ఫ్లూ వైరస్ కారణమని ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైంది. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేలాది కోళ్లను పాతిపెట్టారు. కోళ్ల ఫారాల యజమానులు లబోదిబోమన్నా పట్టించుకోలేదు. నగరం చుట్టుపక్కల చికెన్‌ను, కోళ్లను అమ్మరాదని, హోటళ్లలో చికెన్ వంటకాలను విక్రయించరాదని మైకుల్లో ప్రచారం చేశారు.

జాగ్రత్త పడకపోతే.. వినాశనమే

- పౌరులకు ఇరాన్ హెచ్చరిక
- ఆగస్ట్ దాకా ప్రభావం ఉండొచ్చు: ట్రంప్

టెహ్రాన్/వాషింగ్టన్: ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే కోవిడ్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది చనిపోయే ప్రమాదముందని ఇరాన్ హెచ్చరించింది. అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని, ఆరోగ్య సూచనలను విధిగా పాటించాలని, లేదంటే, కనీవినీ ఎరగని ప్రాణ నష్టం జరిగే ప్రమాదముందని దేశ పౌరులకు సూచించింది. మధ్య ప్రాచ్యంలో కొత్తగా నమోదవుతున్న కేసుల్లో 90% ఇరాన్‌లోనే నమోదవుతున్నాయి. ఇరాన్‌లో 988 మంది చనిపోగా, 16 వేల కేసులు నమోదయ్యాయి. కరోనా మరణాలపై టెహ్రాన్‌కు చెందిన ప్రతిష్టాత్మక షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ చేపట్టిన అధ్యయన వివరాలను ఇరాన్ అధికార టీవీ జర్నలిస్ట్ డాక్టర్ అప్రుజ్ ఎస్లామి మంగళవారం వెల్లడించారు. ఆ అధ్యయనం మూడు పరిస్థితులను అంచనా వేసింది. అవి..

1. దేశ పౌరులు పూర్తిగా సహకరిస్తే.. ఈ వైరస్ బారిన 1.2 లక్షల మంది పడతారు. 12 వేల మంది చనిపోతారు.
2. పౌరులు సాధారణ స్థాయిలో సహకరిస్తే.. 3 లక్షల కేసులు నమోదవుతాయి. 1.1 లక్షల మంది చనిపోతారు.
3. ఒకవేళ, పౌరులు సహకరించకుండా, జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే 40 లక్షల మందికి ఈ వైరస్ సోకుతుంది. 35 లక్షల మంది ప్రాణాలు కోల్పోతారు'.

ఇరాన్‌లో 250 మంది భారతీయులకు వైరస్ సోకిందన్న వార్తను నిర్ధారించలేమని భారత్ తెలిపింది.

ఆగస్ట్ వరకు ఈ సంక్షోభం

కరోనా వైరస్ సంక్షోభం ఆగస్ట్ వరకు కొనసాగే ప్రమాదముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో సోమవారం సాయంత్రానికి కరోనా కారణంగా 85 మంది చనిపోగా, 4500 నిర్ధారిత కేసులు నమోదయ్యాయి. శాన్‌ఫ్రాన్సిస్కో, కాలిఫోర్నియాల్లో దాదాపు 60 లక్షల మంది ప్రజలను ఇళ్లలోనే ఉండాలని సూచించింది. ప్రపంచవ్యాప్తంగా 1.82 లక్షల కోవిడ్ కేసులు నమోదవగా, 7,100 మరణాలు సంభవించాయి. కరోనా భయంతో ఐక్యరాజ్య సమితి కూడా పలు సమావేశాలను రద్దు చేసుకుంది. ఐరాస న్యూయార్క్ కార్యాలయంలోని ఒక ఉద్యోగికి కూడా కోవిడ్ నిర్ధారణ అయింది.

జర్మనీలోని ఎర్‌ఫర్ట్ పట్టణంలో కరోనా వైరస్ ఆకృతిలో తయారుచేసిన కేక్‌లు

వుహాన్‌లో ఒకే కేసు

కరోనా వైరస్ తొలి కేంద్రమైన చైనాలోని వుహాన్ నగరంలో సోమవారం ఒక్క కేసు మాత్రమే కొత్తగా నమోదైంది. అయితే, చైనా వ్యాప్తంగా కరోనా కారణంగా సోమవారం చనిపోయిన 13 మందిలో వుహాన్‌కు చెందిన వారే 12 మంది ఉన్నారు. చైనాలో మొత్తం మృతుల సంఖ్య 3226కి చేరింది.

పాక్‌లో తొలి మరణం

కరోనా కారణంగా పాకిస్తాన్‌లో మంగళవారం తొలి మరణం నమోదైంది. లాహోర్‌కు 150 కి.మీ.ల దూరంలోని హఫీజాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి కోవిడ్‌తో మరణించారు. పాకిస్తాన్‌లో మంగళవారం వరకు 193 కేసులు నమోదయ్యాయి. వీటిలో సింధ్ ప్రాంతంలోనే 155 కేసులు నిర్ధారణ అయ్యాయి.

కరోనా మృతదేహాల నిర్వహణ ఇలా..!

న్యూఢిల్లీ: కోవిడ్-19తో మరణించిన వారి మృతదేహాల ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం అంతగా లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే, మృతదేహం వద్ద పనిచేసే వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. కరోనాతో చనిపోయినవారి మృతదేహాల నిర్వహణకు సంబంధించి పలు మార్గదర్శకాలను మంగళవారం కేంద్రం విడుదల చేసింది. వాటిలో ముందు జాగ్రత్తలు, ఇన్ఫెక్షన్ నివారణ, వాతావరణం వైరస్‌తో కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. మొదలైనవి ఉన్నాయి. 'దగ్గు, తుమ్ము సమయంలో వెలువడే డ్రాప్‌లెట్స్ కారణంగానే కరోనా వైరస్ ప్రధానంగా వ్యాపిస్తుంది. మృతదేహం ద్వారా వ్యాప్తి చెందే అవకాశాలు చాలా తక్కువ. అయితే, వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. పోస్ట్‌మార్టం సమయంలో మృతదేహంలోని ఊపిరితిత్తుల ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది' అని అందులో వివరించారు. శ్మశానాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, మాస్క్‌లు, గ్లవ్స్‌ను వినియోగించడం వంటి నిర్ధారిత జాగ్రత్తలు తీసుకోవాలని శ్మశానంలోని సిబ్బందికి వివరించాలన్నారు. మృతదేహాన్ని ముట్టుకోకుండా చివరి చూపు చూడొచ్చని, ఇతర మతపరమైన ప్రక్రియలు కూడా నిర్వహించవచ్చని వివరించారు. మృతదేహానికి స్నానం చేయించడం, హత్తుకోవడం, ముట్టుకోవడం మాత్రం చేయవద్దని హెచ్చరించారు. అంత్యక్రియల అనంతరం ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా శుభ్రంగా స్నానం చేయాలని సూచించారు. అయితే, అంత్యక్రియలకు పెద్ద ఎత్తున హాజరుకావడం మంచిది కాదని పేర్కొన్నారు. మత సంప్రదాయాల ప్రకారం నదీజలాల్లో కలిపేందుకు మృతదేహానికి సంబంధించిన బూడిదను సేకరించవచ్చని, దాని వల్ల వైరస్ వ్యాప్తి చెందదని స్పష్టం చేశారు.

నేవీలో మహిళలకు శాశ్వత కమిషన్

3 నెలల్లో విధివిధానాలు ఖరారు చేయాలన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: భారత నావికా దళంలోని మహిళా ఉద్యోగుల కోసం శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. 'పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పించాలి. వివక్షను అధిగమించేందుకు మహిళలకు అవకాశం కల్పించిన సందర్భాలు చరిత్రలో అనేకం ఉన్నాయి'అని వ్యాఖ్యానించింది. నేవీలో మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ ఏర్పాటు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం.. 'సాయుధ దళాల్లో లింగ సమానత్వ విధానం అమలుకు 101 సాకులు చూపడం సమాధానం కాదు. సామర్థ్యం, పోటీతత్వం ఆధారంగా బాధ్యతలను అప్పగిస్తే వారికి వివక్షను అధిగమించే అవకాశం ఇచ్చినట్లవుతుంది. మహిళా అధికారుల కోసం శాశ్వత కమిషన్ ఏర్పాటు చేయకపోవడం అన్యాయమే అవుతుంది'అని వ్యాఖ్యానించింది. నేవీలో మహిళా అధికారులు చూపిన ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు మరువలేనివన్న కోర్టు..'1991, 1998ల్లో కేంద్రం ప్రకటించిన విధానాల ప్రకారం నేవీలో మహిళలను నియమించుకోవచ్చు. వారిని పురుష అధికారులతో సమానంగా పరిగణించాల్సిందే'అని తెలిపింది. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సంజయ్ వాదనలు వినిపించారు. సముద్రంలో కొన్ని విధులు నిర్వహించేందుకు అవసరమైన శారీరక సామర్థ్యం పురుషులతో పోలిస్తే మహిళల్లో తక్కువన్నారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ మాదిరిగా కాకుండా నేవీ సిబ్బంది నెలలపాటు సముద్రంలోనే విధుల్లో ఉంటారని, అందుకే మహిళలను తీసుకోవడం లేదన్నారు. రష్యా నుంచి కొనుగోలు చేసే నౌకల్లో మహిళల కోసం టాయిలెట్ల వంటి సదుపాయాలు లేనందునే వారికి విధులు అప్పగించడం లేదని వివరించారు. ఈ వాదనలను ధర్మాసనం తప్పుబట్టింది. మహిళల కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించిన విధివిధానాలను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. నేవీలోని కొన్ని విభాగాల్లో మహిళలను నియమించరాదంటూ 2008లో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయరాదని ధర్మాసనం ఆదేశించింది. షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ)లోని విద్య, న్యాయం, రవాణా విభాగాల్లో ప్రస్తుతం విధులు నిర్వర్తించే వారందరికీ శాశ్వత కమిషన్ వర్తిస్తుందని స్పష్టంచేసింది. 2008కి ముందు విధుల్లో చేరి శాశ్వత కమిషన్ లేకపోవడంతో నష్టపోయిన మహిళా అధికారులు.. రిటైరైన తర్వాత అందే పింఛను ప్రయోజనాలను పొందవచ్చని తెలిపింది.

నా ప్రమాణం తర్వాత మాట్లాడతా

మాజీ సీజేఐ రంజన్ గొగోయ్ • రాజ్యసభకు నామినేట్ చేయడంపై దుమారం

న్యూఢిల్లీ/గువాహటి: రాజ్యసభ సభ్యుడిగా తాను ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాజ్యసభ నామినేషన్ గురించి మాట్లాడతానని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అన్నారు. ఆయన రాజ్యసభకు నామినేట్ అవడంపై పలు పార్టీలు ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో ఈమేరకు స్పందించారు. మంగళవారం గువాహటిలోని తన నివాసంలో గొగోయ్ విలేకరులతో మాట్లాడుతూ తాను బుధవారం ఢిల్లీకి వెళ్తానని చెప్పారు. 'ముందు నన్ను రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేయనివ్వండి. తర్వాత ఈ నామినేషన్‌ను ఎందుకు అంగీకరించానో వివరంగా చెప్తాను' అని అన్నారు. రాజ్యసభ నామినేటెడ్ సభ్యుల్లో ఒకరు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో రంజన్‌గొగోయ్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నామినేట్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో పలు రాజకీయ పార్టీలు గొగోయ్ నామినేషన్‌పై దుమారం రేపాయి. కాగా, రంజన్ గొగోయ్ 13 నెలల పాటు సీజేఐగా తన సేవలందించిన అనంతరం గతేడాది నవంబర్‌లో పదవీ విరమణ పొందారు. తన నామినేషన్‌పై వచ్చిన విమర్శలపై గొగోయ్ స్పందిస్తూ 'దేశ అభివృద్ధి కోసం శాసన, న్యాయ వ్యవస్థలు ఏదో ఒక సమయంలో కలిసి పనిచేయాల్సిన అవసరముందనే నమ్మకంతోనే నేను రాజ్యసభ నామినేషన్‌ను అంగీకరించాను'అని తెలిపారు. కాగా, గొగోయ్‌ను కేంద్ర ప్రభుత్వం రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. 'గొగోయ్‌ను రాజ్యసభకు నామినేట్ చేసే ముందు ప్రధాని మోదీ.. దివంగత, మాజీ న్యాయ మంత్రి అరుణ్ జైట్లీ సలహాను పరిగణలోకి తీసుకున్నారా?'అని కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా ట్విట్టర్‌లో ప్రశ్నించారు.

న్యాయ స్వతంత్రతను అణగదొక్కడమే

రంజన్ గొగోయ్‌ను రాజ్యసభకు నామినేట్ చేయడం ఒక పనికి మాలిన చర్య అని, ఇది న్యాయ స్వతంత్రతను అణగదొక్కేలా ఉందని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. న్యాయ అధికారులు, ఉన్నత ప్రభుత్వ పదవుల్లో పనిచేసిన వారు పదవీ విరమణ పొందిన తర్వాత లాభం పొందే ఎలాంటి పోస్టులోకి వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించాలని సీపీఐ డిమాండ్‌చేసింది.

న్యాయవ్యవస్థ, స్వతంత్రతను తుంగలో తొక్కారు

నిష్పక్షపాత న్యాయ వ్యవస్థ, స్వతంత్రత వంటి ఉన్నత విలువలను రంజన్ గొగోయ్ తుంగలో తొక్కారని మాజీ సుప్రీంకోర్టు జడ్జి కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై ఒక సాధారణ పౌరుడికి ఉన్న నమ్మకాన్ని రాజ్యసభ నామినేషన్‌ను అంగీకరించడం ద్వారా గొగోయ్ వమ్ము చేశారని ఆరోపించారు.

పార్లమెంటులో బీజేపీ ఎంపీ మహేశ్ శర్మకు థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్న దృశ్యం

నిర్భయ దోషుల ఉరికి ఏర్పాట్లు షురూ

న్యూఢిల్లీ: నిర్భయ కేసులో దోషుల ఉరిశిక్ష అమలుకు తీహార్ జైలు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు నలుగురు దోషులు ముకేశ్ సింగ్, పవన్ గుప్తా, వినయ్ శర్మ, అక్షయ్ సింగ్‌లను ఈ నెల 20వ తేదీన ఉదయం 5.30 గంటలకు ఉరిశిక్ష అమలు కానున్న విషయం తెలిసిందే. ఇందుకోసం అధికారులు మూడు రోజులు ముందుగానే ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జైలుకు చెందిన తలారి పవన్ జల్లాడ్‌ను రప్పించారు. బిహార్‌లోని బక్సార్ జైలు నుంచి ప్రత్యేకంగా 'మనీలా' తాళ్లను తెప్పించారు. ఇసుక బస్తీలతో డమ్మీ ఉరి ప్రాక్టీస్ చేయించారు. ఇదిలాఉండగా, నేరం జరిగిన రోజున తాను ఢిల్లీలో లేనని, ఉరిశిక్షను రద్దు చేయాలంటూ దోషి ముకేశ్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ అడిషనల్ సెషన్స్ కోర్టు కొట్టేసింది. మరో దోషి అక్షయ్ మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి కోవింద్‌కు రెండోసారి క్షమాభిక్ష పిటిషన్ పంపాడు. దీనిని హోం శాఖకు పంపుతామని అధికారులు తెలిపారు. కాగా, తమకు అన్యాయం జరిగిందనీ, అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) జోక్యం చేసుకుని ఉరిని ఆపాలంటూ దోషులు వేసిన పిటిషన్‌తో ఎలాంటి ప్రభావం ఉండదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ అభిప్రాయపడ్డారు.

ఆ నిర్ణయాలపై బయట ప్రశ్నించరాదు: స్పీకర్

న్యూఢిల్లీ: లోక్‌సభలో స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై సభ బయట ప్రశ్నలు లేవనెత్తరాదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. చేపల శీతలీకరణ కేంద్రాల వ్యవహారంపై లోక్‌సభలో తనను ప్రశ్నించనివ్వలేదంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు స్పీకర్ మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఒకే అంశంపై 15-20 నిమిషాలు కేటాయించడం వల్ల తర్వాతి ప్రశ్నలకు సమయం ఉండదంటూ స్పీకర్ ఓం బిర్లా చేపల శీతలీకరణ కేంద్రాల వ్యవహారాన్ని ముగించారు.

నింగిలోకి తేజస్ యుద్ధ విమానం

బెంగళూరు: ప్రస్తుతం చివరి ఆపరేషనల్ క్లియరెన్స్ దశలో ఉన్న మొట్టమొదటి తేలికపాటి యుద్ధ విమానం తేజస్ నింగిలోకి ఎగిరింది. దాదాపు 40 నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొట్టిందని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) సంస్థ తెలిపింది. ఈ విమానాన్ని ఎయిర్ కమాండర్ కేపీ ముథన (రిటైర్డ్) నడిపారు. ఈ విమానం గాల్లోనే ఉండి ఇంధనాన్ని నింపుకోగలదు. బియాండ్ విజువల్ రేంజ్ మిసైల్ సిస్టం దీని ప్రత్యేకత. ఈ ప్రయోగాన్ని హాల్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఏరోనాటికల్ క్వాలిటీ అస్యూరెన్స్ తదితర సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి మరో 15 తేజస్ యుద్ధ విమానాలు సిద్ధం కానున్నాయి.

గవర్నర్ టాండన్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు

బలపరీక్షపై వైఖరేంటి?

కమల్‌నాథ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు • మధ్యప్రదేశ్ సంక్షోభంపై నేడు విచారణ

న్యూఢిల్లీ/భోపాల్/బెంగళూరు/ముంబై: మధ్యప్రదేశ్ అసెంబ్లీలో తక్షణమే విశ్వాస పరీక్ష జరపాలన్న విషయంలో వైఖరి తెలపాల్సిందిగా కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు అత్యవసర విచారణ చేపట్టింది. ఈ విషయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకల్లా సమాధానం ఇవ్వాలంటూ సీఎం కమల్‌నాథ్‌కు, స్పీకర్ ప్రజాపతి, అసెంబ్లీ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు పంపింది. గవర్నర్ టాండన్ సూచనలను పట్టించుకోకుండా కరోనా వైరస్ నేపథ్యంలో స్పీకర్ సభను 26వ తేదీ వరకు వాయిదా వేయడంతో మాజీ సీఎం శివరాజ్ సుప్రీం తలుపుతట్టారు. పిటిషనర్ల తరఫున ముకుల్ రోహత్గీ, మిశ్రా సౌరభ్‌ల వాదనలు విన్న ధర్మాసనం.. 'అత్యవసర పరిస్థితుల దృష్ట్యా నోటీసులు ఇచ్చాం. వీటికి ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30లోగా సమాధానం అందాలి' అని ఆదేశించింది. రోహత్గీ తన వాదన వినిపిస్తూ..'ఇలాంటి సందర్భాల్లో బలనిరూపణ జరపడం సమంజసం. కానీ, అవతలి పక్షం(కమల్‌నాథ్ ప్రభుత్వం) అందుకు సిద్ధంగా లేదు. వారు కావాలనే కోర్టును ఆశ్రయించలేదు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే'అని అన్నారు. సభ విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం ఇంకా కొనసాగడం అనైతికం, అప్రజాస్వామికం, అన్యాయం అని ఆయన పేర్కొన్నారు. 'గతంలో ఇలాంటి కేసులపై అర్ధరాత్రి కూడా విచారణ చేపట్టిన కోర్టు..బల నిరూపణకు ఆదేశాలు జారీ చేసింది' అని అన్నారు. స్పందించిన ధర్మాసనం.. 'రేపు ఉదయమే విచారణ చేపడతాం'అని తెలిపింది. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు తమకూ అవకాశం కల్ప

సాక్షి
బుధవారం, మార్చి, 18

గొగోయ్ నిర్ణయం సబబేనా?

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నాలుగు నెలలక్రితం పదవీ విరమణ చేసిన జస్టిస్ రంజన్ గొగోయ్‌ను రాజ్యసభకు నామినేట్ చేస్తూ సోమవారం రాష్ట్రపతి నోటిఫికేషన్ వెలువడ్డాక నలు మూలలనుంచీ విమర్శలు మొదలయ్యాయి. జాతి నిర్మాణంలో శాసన, న్యాయవ్యవస్థలు రెండూ కలసికట్టుగా పనిచేయాలన్న తన దృఢ నిశ్చయానికి అనుగుణంగానే దీన్ని అంగీకరించానంటున్నారు జస్టిస్ గొగోయ్. పెద్దల సభలో ప్రమాణస్వీకారం చేశాక దీనిపై మరింత వివరణ ఇవ్వదల్చుకున్నట్టు ప్రకటించారు. న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన గురించి అందరికీ తెలిసింది చాలా తక్కువ. 2018 జనవరిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా ఉండగా ఆయన పనితీరుపై బాహాటంగా విమర్శలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తుల్లో జస్టిస్ గొగోయ్ ఒకరు కావడంవల్లా, జస్టిస్ మిశ్రా అనంతరం ఆయనే బాధ్యతలు చేపట్టవలసివుంది గనుక, ఇతరులకన్నా ఆయనపై అందరి దృష్టి పడింది. ఆ తర్వాత జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ), రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు, రామజన్మభూమి వివాదం తదితర కేసుల్లో తీర్పులు వెలువరించిన రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించడం వల్ల జస్టిస్ గొగోయ్ వార్తల్లో నిలిచారు. సుప్రీంకోర్టు మహిళా ఉద్యోగిని ఆయన లైంగికంగా వేధించారన్న ఆరోపణలు, ఆ విషయంలో బాధితురాలికి ఎదురైన సమస్యలు వగైరాల వల్లకూడా జస్టిస్ గొగోయ్ గురించి విస్తృతంగా చర్చ జరిగింది.

ఇప్పుడు జస్టిస్ గొగోయ్‌కి పదవి ఇవ్వడంపై స్వరం పెంచి విమర్శిస్తున్నవారిలో కాంగ్రెస్ నేతలు అందరికన్నా ముందున్నారు. ఈ నిర్ణయం న్యాయవ్యవస్థ స్వతంత్రతపై అనుమానాలు రేకెత్తిస్తుందని... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికుండే గౌరవప్రపత్తులకు భంగం కలిగిస్తుందని ఆ విమర్శల సారాంశం. సహజంగానే బీజేపీ ఈ నిర్ణయాన్ని సమర్థించుకుంటోంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతపై అనుమానాలు రేకెత్తించడం మాటేమోగానీ, తన పాలనాకాలంలో ఇలాంటి పనులే చేసిన కాంగ్రెస్ విమర్శలకు దిగడం... ఇతరులకన్నా రెచ్చిపోయి మాట్లాడటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇలాంటి అంశాల్లో విమర్శించే నైతికార్హత ఆ పార్టీకి ఎక్కడదన్న అనుమానం కలుగుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేస్తూ మరణించిన స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన కుటుంబాన్ని ఇబ్బందులపాలు చేయడానికి, ప్రత్యేకించి ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడానికి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కుమ్మక్కై ఏం చేశాయో ఎవరూ మర్చిపోలేదు. జగన్‌మోహన్ రెడ్డిపై అక్రమార్జన ఆరోపణలు చేస్తూ ఆ పార్టీలు రెండూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఆ పార్టీలు కోరినట్టే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిసార్ అహ్మద్ కక్రూకు పదవీ విరమణానంతరం నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్ పదవి కట్టబెట్టిన ఘనత కాంగ్రెస్‌ది. ఇంకా వెనక్కుపోతే జస్టిస్ బహరుల్ ఇస్లాం మొదలుకొని రంగనాథ్ మిశ్రా, ఫాతిమా బీవీ వంటివారెందరికో ఆ పార్టీ ఇదే మాదిరిగా పదవులిచ్చింది. అందరికన్నా జస్టిస్ బహరుల్ ఇస్లాం గురించి చెప్పుకోవాలి. ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికై 1972లో ఆ పదవికి రాజీనామా చేసి గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి 1979లో రిటైరయ్యాక ఆ మరుసటి సంవత్సరమే ఆయన్ను మళ్లీ పిలిచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించారు. 1983లో ఆయనకు మరోసారి రాజకీయాలపై మోజు ఏర్పడి పదవిని వదులుకుని అసోం నుంచి లోక్‌సభకు కాంగ్రెస్ తరఫున పోటీచేశారు. అప్పట్లో ఉద్రిక్త పరిస్థితులు ఉండటంతో ఆ ఎన్నిక వాయిదా పడింది. దాంతో కాంగ్రెస్ ఆయన్ను రాజ్యసభకు పంపింది. ఇందిరాగాంధీ తిరుగులేని అధికారం చలాయిస్తున్న కాలంలో ఇలా ఇష్టానుసారం అటునుంచి ఇటూ... ఇటునుంచి అటూ ఒక వ్యక్తిని మార్చుతూ పోయినప్పుడు న్యాయవ్యవస్థ ఉన్నత ప్రమాణాలు ఆ పార్టీకి పట్ట లేదు. అనంతరకాలంలో రంగనాథ్ మిశ్రా, ఫాతిమా బీవీ, కక్రూ వగైరాలకు పదవులిచ్చినప్పుడు కూడా అవి గుర్తుకు రాలేదు.

న్యాయవ్యవస్థలో ఉంటూ తమ నిర్ణయాల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసినవారు పదవీ విరమణ అనంతరం ప్రభుత్వాలిచ్చే రాజకీయ పదవులు చేపట్టడం సరికాదని వాదిస్తున్నవారు అనేకులున్నారు. ఎవరిదారికానో ఎందుకు... బీజేపీ నాయకులు స్వర్గీయ అరుణ్ జైట్లీ, ప్రస్తుత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వంటివారు న్యాయమూర్తులు రిటైరయ్యాక ప్రభుత్వాలిచ్చే పదవుల్ని అంగీకరించరాదని అభిప్రాయపడ్డారు. ఈ పదవుల్ని ఆశించి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు రాస్తున్నారని జైట్లీ ఆరోపించారు కూడా. సీవీసీ పదవిలో పనిచేసి పదవీ విరమణ చేసినవారు మరే పదవి చేపట్టరాదన్న నిబంధన వుంది. దురదృష్టవశాత్తూ న్యాయమూర్తుల విషయంలో అటువంటిది లేదు. మన రాజ్యాంగ నిర్మాతలే దీన్ని ఊహించి తగిన నిబంధనలు పొందుపరిచివుంటే బాగుండేది. కానీ భవిష్యత్తులో ఇలాంటి దుస్థితి ఏర్పడుతుందని వారి ఊహకు అందకపోయి ఉండొచ్చు. పదవీ విరమణ తర్వాత న్యాయమూర్తులు కొన్నేళ్లపాటు ఏ పదవీ చేపట్టరాదని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ కేటీ థామస్, జస్టిస్ లోధాలు హితవు పలికారు. అయితే ఇలాంటి హితవచనాలు పట్టించుకునేవారెవరు? జస్టిస్ గొగోయ్ మాదిరే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రిటైరైన నాలుగు నెలలకే జస్టిస్ సదాశివం 2014లో కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇలా పదవులు చేపట్టడం న్యాయవ్యవస్థ స్వతంత్రతకు మాయని మచ్చని సీజేగా పనిచేసినప్పుడు చెప్పిన జస్టిస్ గొగోయ్... ఇప్పటి తన నిర్ణయంపై ఏం చెబుతారో దేశమంతా ఎదురుచూస్తోంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి బ.నవమి ఉ.7.29 వరకు తదుపరి దశమి, నక్షత్రం పూర్వాషాఢ సా.4.41 వరకు తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం రా.12.54 నుంచి 2.32 వరకు, దుర్ముహూర్తం ప.11.45 నుంచి 12.31 వరకు అమృతఘడియలు... ప.11.44 నుంచి 1.22 వరకు.

సూర్యోదయం : 6.11
సూర్యాస్తమయం: 6.06
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

మానవ స్పర్శకు కరోనాతో గండి

వ్యక్తులతో ముఖాముఖిగా కాకుండా వర్చువల్‌గానే ఎక్కువగా సంభాషిస్తున్న, టెక్నాలజీ ప్రాధాన్యం–సామాజిక అనుసంధానం తెగిపోవడం ప్రాతిపదికన నడుస్తున్న ప్రపంచంలో జీవిస్తున్నాం కనుకే మానవ స్పర్శ అనేది మనిషి జీవితంలో తగ్గుముఖం పడుతోంది. ఒకసారి కరోనా వైరస్ పరిసమాప్తి అయ్యాక, మనకు ఎదురయ్యే పెను సవాల్ మానవ స్పర్శ పట్ల మన ఆలోచనలను పునర్నిర్మించుకోవడం ఎలా అన్నదే. కరోనా వైరస్‌కి చెందిన భయానకమైన అనుభవం నుంచి వైదొలగడానికి కూడా మనకు ఒక స్పర్శ, ఒక వెచ్చని కౌగిలింత అవసరం కావచ్చేమో మరి.

విశ్లేషణ

కేథరీన్ జాన్సన్

మానవులకు స్పర్శ అనేది విస్తారమైన ప్రయోజనాలను కలిగిస్తుందనడంలో సందేహమే లేదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా, ప్రజలు అనేక కారణాలతో సామాజికంగా ఇతరులను స్పర్శించడం పట్ల జాగరూకంగా ఉంటూండటం పెరుగుతూ వస్తోంది. తాజాగా ప్రపంచాన్ని కరోనా వైరస్ ముట్టడిస్తుండంతో పరిస్థితి మరింత దిగజారిపోయింది. ప్రజలు ఇప్పటికే పరస్పరం చేతులు కలపటాన్ని మానేస్తున్నారు. బ్రిటిష్ రాణి సైతం వైరస్ బారిన పడకుండా ఉండటానికి ముందుజాగ్రత్తగా చేతులకు గ్లోవ్స్ ధరించి కనిపించారు. ఇప్పటికే పరస్పరం చేతులు కలపడాన్ని వీలైనంతవరకు మానేయాలి అనే భావన ప్రపంచంలో ఉనికిలో ఉంది. కరోనా వైరస్ ఈ కరస్పర్శకు సంబంధించి దీర్ఘకాలిక దుష్ప్రభావాలను కలిగించనుంది.

మానవ స్పర్శకు అంత ప్రాధాన్యత ఎందుకు? మనం ఇతరుల పట్ల ఎలా అనుభూతి చెందుతున్నామో స్పర్శ చాటుతుంది. మన మాటల వ్యక్తీకరణను స్పర్శ పెంచుతుంది. ఉదాహరణకు ఇతరులను ఓదార్చుతున్నప్పుడు వారి చేతిని స్పర్శించడం అనేది మనం వారి పట్ల నిజంగా కేర్ తీసుకుంటున్నామని తెలుపుతుంది. తమ జీవితకాలం పొడవునా ప్రజలు భౌతిక స్పర్శ ద్వారా ప్రయోజనం పొందుతూనే ఉంటారు. మనిషికి స్వల్పకాలంలో, దీర్ఘకాలంలో సంభవించే క్షేమం, సుఖసంతోషాలపై ప్రభావం చూపే స్పర్శ సామర్థ్యానికి సంబంధించి అనేక సాక్ష్యాధారాలు ఉన్నాయి కూడా. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన మెదడు అభివృద్ధికి మానవ స్పర్శ అనేది ఎంతో కీలకమైంది.

ఒత్తిడిని తగ్గించే సంజీవని స్పర్శ

సామాజిక స్పర్శకు చెందిన భావోద్వేగ ప్రభావం మన జీవశాస్త్రంలో అంతర్నిహితంగా ఎప్పట్నుంచో కొనసాగుతోంది. స్పర్శ అనేది ఒత్తిడిని తగ్గించే హార్మోన్ అయిన అక్సిటోసిన్ విడుదలను వేగవంతం చేస్తుంది. నిజానికి, మానవులలో ఒత్తిడి స్థాయిలను తగ్గించే శక్తి ఒక్క స్పర్శకు మాత్రమే ఉంది. శస్త్రచికిత్సకు ముందు రోగిని నర్సు ఊరకే అలా స్పర్శిస్తే చాలు.. రోగుల్లో ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుందని మనం దరికీ తెలుసు. తాము సమాజం నుంచి వేరుపడ్డామనే అనుభూతిని స్పర్శ తగ్గిస్తుంది. అంతేకాకుండా నర్సింగ్ హోమ్‌లో గడుపుతున్న వృద్ధులు తీసుకునే ఆహార పరిమాణాన్ని కూడా స్పర్శ పెంచుతుంది. ప్రజల క్షేమానికి, సుఖసంతోషాలకు సామాజిక స్పర్శ ఎంత అవసరమైనదో తెలుస్తోంది కనుక, ప్రతి ఒక్కరి జీవితంలోనూ స్పర్శకు అత్యంత ప్రధానమైన పాత్ర ఉందని అర్థం చేసుకోవాలి.

సామాజిక స్పర్శ తగ్గుముఖం

గత కొన్ని దశాబ్దాల్లో సామాజిక స్పర్శ అనేది తగ్గుముఖం పడుతోంది. వ్యక్తులతో ముఖాముఖిగా కాకుండా వర్చువల్‌గానే ఎక్కువగా సంభాషిస్తున్న టెక్నాలజీ ప్రాధాన్యం, సామాజిక అనుసంధానం తెగిపోవడం ప్రాతిపదికన నడుస్తున్న ప్రపంచంలో జీవిస్తున్నాం కనుకే మానవ స్పర్శ మనిషి జీవితంలో తగ్గుముఖం పడుతోంది. అంటే గతంలోకంటే ఇప్పుడు మనం చాలా తక్కువగా మాత్రమే పరస్పరం స్పర్శించుకుంటున్నామని దీనర్థం. అయితే మనుషుల మధ్య స్పర్శ తగ్గుముఖం పట్టడానికి ప్రధానంగా అసభ్య స్పర్శ ప్రభావానికి గురికావలసి వస్తుందన్న భయమే కారణం.

కరోనా వైరస్ ప్రభావం

ఇప్పుడు కరోనా వైరస్ విస్తరణతో ఎదుటివారిని స్పర్శించాలంటేనే ప్రజలు భీతిల్లుతున్నారు. అలా తాకడం ద్వారా అప్పటికే వైరస్ సోకిన వ్యక్తులనుంచి తమకూ వైరస్ సోకుతుందన్న భయం ఎక్కువవుతోంది. అంటే ఎదుటివారందరూ వైరస్ వాహకాలే అని భావించడం మరింత భయపెడుతోంది. కరోనా వైరస్ తారస్థాయిలో చెలరేగుతున్నందున ఇతరులను స్పర్శించడం పట్ల జాగ్రత్తగా ఉంటూనే వైరస్ మితిమీరిపోకుండా తగిన చర్యలన్నీ తీసుకోవాల్సి ఉంది. ఎందుకంటే చాలామంది ప్రజలు వైరస్ గురించి తీవ్రమైన ఆందోళనలతో గడుపుతున్నందువల్ల అలాంటివారిని స్పర్శద్వారా పరామర్శిస్తే ఆ ఆందోళనలు తగ్గుముఖం పట్టే అవకాశం కూడా ఉంటుంది.

ఇలా మనుషులు తోటి మనుషులకు దూరంగా మెలగడం దీర్ఘకాలంపాటు కొనసాగితే సామాజిక స్పర్శకు, దానిపట్ల ప్రతికూల వైఖరికి మధ్య ఒకరకమైన సహసంబంధం నెలకొనే ప్రమాదం కూడా ఉంటుంది. కొంతకాలానికి ప్రజలు వైరస్ గురించి మర్చిపోవచ్చు కానీ సామాజిక స్పర్శ పట్ల వారి భయం అలాగే కొనసాగవచ్చు. తామెందుకు అలా దూరదూరంగా ఉంటున్నామో వారికి బహుశా తెలీకపోవచ్చు కూడా. ఎందుకంటే ప్రజల మధ్య సానుకూల సంబంధాల కంటే ప్రతికూల సంబంధాలే ఎక్కువగా మనుషుల జ్ఞాపకాలను ప్రభావితం చేయవచ్చు.

ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పర్శ అవసరం

అయితే వైరస్ ప్రబలిపోయిన సమయంలో ప్రజలు పరస్పరం స్పర్శించుకోవడం మంచిది కాదు. ప్రత్యేకించి వృద్ధులు, ఆరోగ్య పరిస్థితులు సరిగా లేని వారితో స్పర్శకు దూరంగానే ఉండాలి. అయితే మన చేతులను మనం పదే పదే శుభ్రపర్చుకుంటున్నంతకాలం మనకు ప్రియమైన వారితో భౌతిక స్పర్శను కొనసాగిస్తూనే ఉండవచ్చు. కరోనా వైరస్ వంటి ప్రతికూల జీవన ఘటనలు దీర్ఘకాలంలో అవాంఛనీయమైన రీతిలో సామాజిక స్పర్శపై, వ్యక్తుల మధ్య పరామర్శలపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. ప్రధానమైన విషయం ఏమిటంటే ఈ ప్రతికూల ఘటనల పట్ల జాగ్రత్తగా ఉండటమే. ప్రతికూల పరిస్థితుల్లోనూ మనుషుల మధ్య స్పర్శ ప్రాధాన్యతను గుర్తించకపోయినట్లయితే అది మానవ స్పర్శపట్లే ప్రతికూల జ్ఞాపకాలను పెంచే ప్రమాదం ఎంతైనా ఉంది. ఒకసారి కరోనా వైరస్ పరిసమాప్తి అయ్యాక, మనకు ఎదురయ్యే పెనుసవాల్ మానవ స్పర్శ పట్ల మన ఆలోచనలను పునర్నిర్మించుకోవడం ఎలా అన్నదే. కరోనా వైరస్‌కి చెందిన భయానకమైన అనుభవం నుంచి వైదొలగడానికి కూడా మనకు ఒక స్పర్శ, ఒక వెచ్చని కౌగిలింత అవసరం కావచ్చేమో మరి.

సాహిత్య చరిత్ర మనకు నేర్పే పాఠం

ప్రాచీన కాలంలో హోమర్ నుంచి ఆధునిక కాలంలో స్టీఫెన్ కింగ్ దాకా పాశ్చాత్య సాహిత్య చరిత్రలో సాంక్రమిక వ్యాధుల గురించి అనేక గాథలు వ్యాప్తిలో ఉన్నాయి. మానవులు ప్రజారోగ్యం సంక్షోభంలో పడినప్పుడు ఎలా స్పందించారో, కెథార్సిస్ రూపంలో తమ తీవ్రమైన భావోద్వేగాలను ఎలా ప్రకటించారో, రాజకీయంగా ఎలా వ్యాఖ్యానించారో ఈ కథనాలు చాటి చెబుతూ వచ్చాయి. కోవిడ్ 19 సాంక్రమిక వ్యాధి పట్ల మన స్పందనలను కూర్చడంలో సాహిత్యానికి కీలకపాత్ర ఉంది.

కరోనా వైరస్ చుట్టూ అలుముకుంటున్న జాత్యహంకారం, జాతి ఉన్మాదం, వివక్షలను మనం ఎలా అర్థం చేసుకోవాలో కూడా సాహిత్యమే మనకు దారి చూపుతుంది. ప్రాచీన కావ్యాల నుంచి ఆధునిక నవలల వరకు సాంక్రమిక వ్యాధులకు సంబంధించిన అధ్యయనం అనిశ్చితపరిస్థితుల్లో తర్వాత ఏం జరుగుతుందో మార్గదర్శినిగా మనకు దారి చూపుతుంది. హోమర్ రాసిన ప్రామాణిక కావ్యం ఇలియడ్.. ట్రాయ్ వద్ద విడిది చేసిన గ్రీక్ సైనిక శిబిరాల్లో చెలరేగిన ప్లేగ్ వ్యాధి గురించిన వర్ణనతో మొదలవుతుంది. క్రిసీస్ జాతీయులను బానిసలుగా చేసుకున్న గ్రీకులను శిక్షించడానికే ప్లేగ్ విరుచుకుపడిందని ఆ కావ్యంలో పాత్రలు చెబుతాయి. గ్రీకుల దుష్ట ప్రవర్తన ఫలితంగానే ప్లేగ్ మహమ్మారి వారిపై విరుచుకుపడిందనే నైతిక చర్చను ఇలియడ్ లోని పాత్రలు ప్రదర్శించాయి. అలాగే క్రీ.శ. 1353లో గివోవన్నీ బొకాసియో రాసినది డెకమెరోన్, రచనలో కూడా బ్లాక్ డెత్ సంక్షోభ సమయంలో రెండువారాలపాటు ఏకాంతంగా గడిపిన పాత్రలు నీతి, ప్రేమ, లైంగిక రాజకీయాలు, వాణిజ్యం, అధికారం వంటి అంశాలపై చర్చించాయి. సాంక్రమిక వ్యాధుల కారణంగా స్తంభించిపోయిన సాధారణ జీవితాలను పునర్నిర్మించుకోవడంపై సాంస్కృతిక పునరుజ్జీవన కాలంలో పలు రచనలు ఎత్తిచూపాయి.

20వ శతాబ్దంలో ఆల్బర్ట్ కాము రాసిన 'ది ప్లేగ్' (1942) స్టీఫెన్ కింగ్ రాసిన 'ది స్టాండ్' (1978) సాంక్రమిక వ్యాధులు చెలరేగిన సమయంలో సమాజంలో వాటి ప్రభావాలపై దృష్టి పెట్టాయి. సామూహిక ఏకాంతవాసం, ప్రభుత్వాల వైఫల్యాల నేపథ్యంలో సాంక్రమిక వ్యాధిని నివారించడం లేక భయాందోళనలను తగ్గించడంపై ఈ రెండు రచనలూ చర్చించాయి. ప్రత్యేకించి కామూ నవల ప్లేగ్ చెలరేగిన సమయంలో మానవ సంబంధాలు, పౌరుల మధ్య పరామర్శల పట్ల జాగరూకత గురించి వర్ణించింది. కోవిడ్ 10 వైరస్ కూడా ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలను ప్రకంపింప చేస్తూనే గతంలో ఇలాంటి సందర్భాల్లోనే తలెత్తిన సంక్షోభాలను ప్రాచీనులు ఎలా ఎదుర్కొన్నారు అనే చర్చకు దారి తీయడం విశేషం.

వ్యాసకర్త రీడర్, కన్స్యూమర్ సైకాలజీ,
అంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ (బ్రిటన్)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి

"సుప్రీంకోర్టుకీ పార్లమెంటుకీ మధ్య ఒక అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిని వాళ్లు ఎందుకు నిర్మించరు? అట్లాగైనా కొంత ట్రాఫిక్ తగ్గుతుంది కదా!"

(సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజన్ గొగోయ్ రాజ్యసభకు నామినేట్ అయిన నేపథ్యంలో)

– సాగరిక ఘోష్, పాత్రికేయురాలు

రాజ్యాంగం బందీ

"దేశంలో ప్రధానమైన మార్క్సిస్టు ఆనంద్ తేల్‌తుంబ్డేని జైల్లోకి పంపించబోతున్నారు. పార్లమెంటరీ వామపక్షాలు ఎక్కడ? అంబేడ్కర్ సొంత కుటుంబంలోని ఓ సభ్యుడిని తప్పుడు ఆరోపణలతో నిర్బంధించబోతున్నారు. వాళ్లు రాజ్యాంగాన్ని కూడా బందీ చేయొచ్చు. ఉదారవాదుల ఆగ్రహం ఎక్కడ?"

– మీనా కందసామి, రచయిత్రి

జీవిత పాఠం

"జీవిత పాఠాలు: ఉద్వేగపు ఉగ్ర సముద్రంలోకి, గందరగోళపు ఉగ్ర సముద్రంలోకి, అస్తవ్యస్తపు ఉగ్ర సముద్రంలోకి నిన్ను నువ్వు తోసేసుకో. అప్పుడు మాత్రమే తెలిసినవీ, గత జీవితాన్ని అంటుకుని ఉన్నవీ, జ్ఞాపకాలుగా మనం పిలిచే పక్షపాతపు ఛాయాపటాలనీ వదులుకోగలవు. అప్పుడు మాత్రమే తెలియనిదీ, ఆశ్చర్యం గొలిపేదీ పైకి తేలుతుంది"

– శేఖర్ కపూర్, దర్శకుడు

కృతజ్ఞత బాకీ

"ప్రతివాళ్లూ ఇంట్లో ఉండటానికి లేదు. దానికిగానూ మనం ఆరోగ్య సంబంధ వృత్తిలో ఉన్నవాళ్లకూ, వాహనాలు నడిపేవాళ్లకూ, విమానాశ్రయ సిబ్బందికీ, మొదటి స్పందకులకూ, సమాజాన్ని నిలబెడుతున్న అందరికీ పెద్ద కృతజ్ఞత బాకీ వున్నాం. రానున్న వారాల్లో దెబ్బతిననున్న మనుషుల్నీ, వారి బతుకుదెరువుల్నీ కాపాడటానికి నాయకులు ముందడుగులు వేయాల్సి ఉంది"

– బరాక్ ఒబామా, అమెరికా మాజీ అధ్యక్షుడు

చక్కటి ఉదాహరణ

"హిందూ–ముస్లిం ఐక్యతలో లక్నో ప్రశంసాయోగ్యమైన ఉదాహరణగా నిలిచింది. లక్నోలోని ఆదిల్‌నగర్ కుర్రాళ్లు చరిత్ర సృష్టించారు" *(హోలీ సందర్భంగా అక్కడి ఉస్మాన్ ఘనీ మనీదులో ఏర్పాటైన కలయికను గుర్తు చేస్తూ)*

– మార్కండేయ కట్జూ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

సరైన విధానం

"ఇంకా మూసేయని చోట్లలో ప్రజలు పోగయ్యే అవకాశం ఉన్న అన్ని స్థలాల్లోనూ చిన్న చిన్న వాష్‌బేసిన్లు, సబ్బును వదిలే ఆటోమేటిక్ యంత్రాలను ఏర్పాటు చేయవలసిందిగా డీఎంలు (డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్స్), ఎస్డీఎంలు (సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్స్), మున్సిపల్ కమిషనర్లు అందరికీ నిర్దేశించాను. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి కట్టుదిట్టమైన విధానం.. చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవటం"

– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

అరుదైన సందర్భం

"మనిషిలోని మానవత్వం ఒకే విధంగా ప్రదర్శించబడే సందర్భాలు అరుదుగా వస్తాయి. మనం వేర్వేరు రంగు, కులం, జాతి, మతం, విశ్వాసం, భాష, ప్రాంతం వాళ్లం కావొచ్చు; కానీ అందరం అప్రయత్నంగా ఎదుటివాళ్ల కోసం ఆపన్నహస్తాన్ని సాచాం"

– అమితాబ్ బచ్చన్, నటుడు

ఇన్‌బాక్స్

మహమ్మారిని ధైర్యంగా ఎదుర్కొందాం

కరోనా వ్యాధిని ప్రపంచ ఆరోగ్య సంస్థ మహమ్మారిగా నిర్వచించింది. అంటే అన్నిదేశాలూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్టు. ప్రపంచ వ్యాప్తంగా, 140 దేశాల్లో లక్షలాదిమంది వ్యాధిన పడగా, ఏడువేల మంది మృత్యువాత పడ్డారు. వ్యాధి కేంద్రక స్థానం చైనాలో బాధితులు అధికంగా ఉండగా, ఇటలీ నేడు రెండోస్థానంలో ఉంది. భారత్ తన సన్నద్ధతలో భాగంగా ట్రావెల్ వీసాల్ని తాత్కాలికంగా రద్దు చెయ్యడమే కాకుండా, బాధిత దేశాలనుండి వచ్చిన వాళ్ళను క్వారంటైన్‌లో ఉంచుతోంది. దేశవ్యాప్తంగా సాంక్రమిక వ్యాధుల చట్టం నిబంధనల్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. తద్వారా కేంద్రం పరిస్థితులకనుగుణంగా జారీ చేసే ఆదేశాలు వెనువెంటనే అమలౌతాయి.

ప్రస్తుతానికి కరోనా తీవ్రత దేశంలో అధికంగా లేకున్నా,ముప్పు మాత్రం పొంచివుంది. వ్యాధి పెద్ద స్థాయిలో విరుచుకుపడితే తట్టుకొనే సామర్థ్యం ఆరోగ్య సేవల విభాగానికి లేదు. అందుకనే ముందుజాగ్రత్త ఎంతయినా మేలు. కొంచెం అజాగ్రత్త వల్ల దేశంలో కొన్ని అదనపు కేసులు వచ్చినట్లు; ఇంకొంచెం జాగ్రత్త వహిస్తే ఇటలీనుండి వచ్చిన రోగివల్ల మరికొంత మందికి విస్తరించిన వ్యాప్తిని అడ్డుకొని ఉండేవాళ్లమని వార్తలు వినవస్తున్నాయి. ఇలాంటి తప్పిదాలు పునరావృతం కారాదు. కరోనా వ్యాధి నివారణకు సంబంధించి అన్ని సంబంధిత శాఖల్ని సమన్వయ పర్చాలి. అన్ని మాధ్యమాల ద్వారా అవగాహనా కార్యక్రమాలు ఉధృత పర్చాలి. వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత, వ్యాధి నివారణా పద్ధతులపై ప్రజాచైతన్యం ప్రోది చెయ్యాలి. స్వచ్ఛంద సంస్థల్ని, వాలంటీర్లను ఈ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చెయ్యాలి. అనుమానిత రోగులు, వారితో సామీప్యం ఉన్నవాళ్లు పాటించాల్సిన ఆరోగ్య నియమాలు అందరికీ తెలియాలి. ప్రజలందరు క్రియాశీలతతో అడ్డుకట్ట వెయ్యాల్సిన మహమ్మారిని తక్కువగా అంచనావేసి, ముప్పు తెచ్చుకోవద్దు.

డా॥ డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ | 94408 36931

పౌరసత్వ నిరూపణకు మతం ఆధారమా?

సందర్భం

డా. కాలువ మల్లయ్య

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద, చిన్న మతాలన్నీ శాస్త్ర విజ్ఞానం బాగా అభివృద్ధి చెందక ముందు, ఈ భూగోళం ఎలా ఏర్పడిందో తెలియకముందు, సృష్టి రహస్యం తెలియకముందు పుట్టినవే. మతాన్ని కారల్‌మార్క్స్ మత్తుమందు అన్నాడు. మతాలు ఎందుకు పుట్టినా ప్రపంచవ్యాప్తంగా హింసాయుత సంఘటనలకు దారితీశాయి. మతాల కోసం యుద్ధాలు, రక్తపాతాలు జరిగాయి. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం వచ్చి సృష్టి రహస్యాన్ని ఛేదించిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఒక్క మతమూ పుట్టుకు రాలేదు. మతాల స్థానంలో బాబాలు పుట్టుకొచ్చారు. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, ఐన్ స్టీన్ థియరీ ఆఫ్ రిలేటివిటీ, ఖగోళ శాస్త్ర పరిశోధనలు, ఇతర గ్రహాలకు పోయేంత టెక్నాలజీ, సృష్టికి ప్రతి సృష్టి చేయగల శాస్త్ర విజ్ఞానం, కంప్యూటర్, ఇంటర్నెట్, ఐటీ, సెల్‌ఫోన్ లాంటి ఆవిష్కరణలు జరిగిన తర్వాత కూడా మతాలు తమ ప్రభావాన్ని చూపుతూనే ఉన్నాయి. మానవ జాతిని 'మనుషులు, మనీషులు'గా ఐక్యం చేయకుండా మతాలుగా విభజిస్తున్నాయి. మానవ జాతినంతా కలిపి ఉంచే మానవత్వం అనే భావనకు దూరంగా ఉండటం వల్లనే మనుషుల్లో మత, కుల, జాతి, దేశ పరంగా విభజనలు, విభేదాలొస్తున్నాయి.

ప్రపంచంలో ఎంత వైవిధ్యం, బహుళత్వ ముందో మతాలననుసరించడంలోనూ అంతే బహుళత్వముంది. ఉండాలి. గ్రహాంతర సీమల్లోకి వెళ్ళి బతకగలిగే విషయాల గురించి పర

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 18-3-2020

సక్సెస్ స్టోరీ

స్వీపర్‌గా చేసిన స్కూల్లోనే ఇంగ్లిష్ టీచర్‌గా!

కన్నన్‌గడ్‌లోని ఇక్బాల్ ప్రాథమికోన్నత పాఠశాల ఆరో తరగతి గదిలోకి వచ్చిన కొత్త ఇంగ్లిష్ టీచర్‌ను చూసి పిల్లలు 'ఆ' అని నోరు తెరిచారు. 'గుడ్మానింగ్ స్టూడెంట్స్' అని టీచర్ లింజా చెప్పినా, తిరిగి వారు గుడ్మానింగ్ చెప్పడం మర్చిపోయిట్లుగా ఆమెనే చూస్తుండిపోయారు. ఆమె పేరు లింజా అని, రోజూ స్కూల్ ఊడ్చి, శుభ్రం చేసే ఆయా అని మాత్రమే వారికి తెలుసు. మరైతే ఇదేమిటి!!

ఇంగ్లిష్ టీచర్‌గా లింజాకు అది తొలి రోజు. స్కూలు ఆమెకు కొత్త కాదు కానీ, స్కూల్లోని క్లాసు కొత్తగా ఉంది. అయితే బడిని శుభ్రం చేసే ఒక ఆయమ్మ ఇంగ్లిష్‌ను 'టీచ్' చేయడం ఏంటి అనే సందేహాన్ని పిల్లల్లో చాలా త్వరగానే పోగొట్టారు లింజా. టీచరుగా చేరిన 2018 నుంచి ఈ రోజు వరకు ఆరు, ఏడు తరగతులకు తను తీసుకున్న ఒక్క క్లాసులో కూడా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌ని

విద్యార్థినులతో ఇంగ్లిష్ టీచర్ లింజా

మలయాళంలో చెప్పలేదు ఆమె. పిల్లల్ని కూడా ఇంగ్లిష్‌లో తప్ప వేరే భాషలో మాట్లాడనివ్వలేదు! ఇప్పుడా పిల్లలంతా మంచి ఇంగ్లిష్ గడగడ మాట్లాడేస్తున్నారు. లింజా 2013 నుంచి 2018 వరకు ఇక్బాల్ స్కూల్‌లో స్వీపర్‌గా ఉన్నారు. అంతక్రితం 2001 నుంచి 2006 వరకు కూడా స్వీపర్‌గానే ఉన్నారు. ఈ మధ్యలో (2006–2013) వచ్చిన విరామంలోనే తనకు తెలియకుండానే టీచర్ కావడానికి అవసరమైన అన్ని అర్హతలూ సంపాదించారు లింజా! ఆ అర్హతలకు కోసం ఆమె ఎంత శ్రమపడ్డారన్న విషయం కన్నా, అసలు ఆమెకు ఆ విరామం ఎలా వచ్చిందన్నదే ఎక్కువ ఆసక్తి కలిగించే సంగతి. అదేమిటో తెలుసుకోడానికి మనం పందొమ్మిదేళ్లు వెనక్కి వెళ్లాలి.

'నేనేమిటి? స్వీపర్ ఏమిటి?'

అప్పట్లో లింజా తండ్రి రాజన్ ఇక్బాల్ స్కూల్‌లోనే సంస్కృతం టీచర్‌గా పని చేస్తున్నారు. లింజా డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. అది 2001. రాజన్ హఠాత్తుగా మరణించారు. అందుకు పరిహారంగా తండ్రి స్థానంలో కూతురికి.. అప్పటికి ఆమెకున్న విద్యార్హతలను బట్టి.. ఖాళీగా ఉన్న పోస్టును ఇచ్చారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టు.. 'స్వీపర్'. అదైనా ఆ పని చేస్తున్నవారెవరో దీర్ఘకాలపు సెలవు మీద వెళ్లిపోవడంతో తాత్కాలికంగా ఖాళీ అయిన పోస్టు. లిజా తమ్ముడు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. వాడిని చదివించాలి. కుటుంబాన్నీ పోషించాలి. ఇంకేం ఆలోచించకుండా స్వీపర్‌గా చేరిపోయారు లింజా. అయితే ఆ సెలవు పెట్టిన వాళ్లు 2006 తిరిగొచ్చారు. దాంతో ఆమె పోస్టు పోయింది. పోస్ట్ అయితే పోయింది కానీ, అప్పటికే ఆమె స్కూల్లో పనిచేస్తూనే బి.ఎ. పూర్తి చేశారు. ఎం.ఎ. ఇంగ్లిష్ చేశారు. బి.ఇడి. కూడా పాస్ అయి, ప్రైవేటు పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ చెబుతున్నారు. ఆ సమయంలో ఆమెకు స్కూల్ నుంచి పిలుపు! మళ్లీ అదే స్వీపర్ పోస్ట్. మొదటిసారి 'నేనేమిటి? స్వీపింగ్ ఏమిటి?' అనుకున్న లింజా.. రెండోసారి స్వీపర్‌గా మళ్లీ చేరుతున్నప్పుడు అలా అనుకోలేదు. పనిపై తనకున్న గౌరవం అది. మరి తన చదువుకు ఆమె ఇచ్చిన గౌరవం మాటేమిటి? ఉద్యోగం చేస్తూనే టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ రాసి, పాస్ అయ్యారు. 'స్టేట్ ఎలిజబిలిటీ టెస్ట్' కూడా రాయమని ప్రధానోపాధ్యాయురాలు ప్రవీణ ప్రోత్సహించారు. అయితే అప్పటికే ఆమెకు ఆరేళ్ల కొడుకు, నెలల వయసున్న కూతురు. ఇద్దర్నీ చూసుకోవాలి. ''టెస్ట్‌కు ప్రిపేర్ అవడం నా వల్ల కాదు మేడమ్'' అన్నారు లింజా. 'వాళ్లిద్దర్ని కూడా స్కూల్‌కి తెచ్చేయ్. నేను చూసుకుంటాను. నువ్వు ప్రిపేర్ అవు'' అన్నారు ప్రవీణ! అంతకన్నా కావల్సిందేముంది. స్టేట్ టెస్ట్ కూడా పూర్తయింది. టీచర్‌గా అదే స్కూల్‌లో పోస్టింగ్ వచ్చింది. ''చూస్తుండండి.. ఇదే స్కూల్‌కి లింజా ఏనాటికైనా హెడ్‌మిస్ట్రెస్ అవుతారు''అని నవ్వుతూ అంటున్నారు ప్రవీణ.

స్వర్ణయాదవ్ కర్ర సాము, కత్తి సాము ప్రదర్శనలు

ఆడపిల్లలకు ప్రమాదాలు అనుక్షణం పొంచి ఉంటాయి. ఎప్పుడు ఎవరు లైంగిక దాడి చేస్తారో ఊహించలేకపోతున్నాం. అమ్మాయి ఎంత జాగ్రత్తగా ఉన్నా జరుగుతూనే ఉండే దాడులు ఇవి. ఆ ప్రమాదాల దాడి నుంచి ఆడబిడ్డను రక్షించేదెవరు? అందుకు రక్షణ వ్యవస్థలు ఉన్నప్పటికీ, అవి స్పందించేలోపు ఆడపిల్లలే ప్రతిస్పందించాలి. ధైర్యంగా ముందుకు అడుగు వేసి దాడి చేయబోయిన వాడికి దడ పుట్టించాలి. అమ్మాయిల్లో అలాంటి ధైర్యాన్ని పాదుకొల్పడానికే కర్రసాము నేర్చుకుని ప్రదర్శిస్తున్నానని చెప్పారు స్వర్ణయాదవ్. ఇటీవలే ఆమె హైదరాబాద్, రాజభవన్‌లో తెలంగాణ గవర్నర్ తమిళిసై ఎదుట కర్రసాము ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు.

నువ్వే నీ శక్తి

స్వర్ణ యాదవ్‌ది నాగర్ కర్నూల్ జిల్లా, వెల్దండ మండలం, బైరాపూర్ గ్రామం. అమ్మానాన్నలు వెంకటమ్మ, పెద్దయ్య వ్యవసాయం చేస్తారు. ముగ్గురు అక్కలు, ఒక తమ్ముడు. అత్యంత సాధారణ నేపథ్యం నుంచి రాష్ట్రం గర్వించదగిన స్థాయిలో జానపద గాయనిగా, కర్రసాము యుద్ధ కళాకారిణిగా ఎదగడంలో ఆమె వేసిన ప్రతి అడుగూ సాహసోపేతమైనదే. ఇప్పుడు అందుకుంటున్న ప్రశంసల వెనుక ఉన్న పోరాట జీవితాన్ని సాక్షితో మాట్లాడుతున్న సందర్భంలో గుర్తు చేసుకున్నారు స్వర్ణయాదవ్.

బాయిలో బచ్చలి కూర

''నేను ఇప్పుడు కర్రసాము స్వర్ణగా పరిచయమయ్యాను. కానీ అంతకు ముందు జానపద గాయనిగా వందల వేదికల మీద పాటలు పాడాను. ఏడవ తరగతిలో ఉన్నప్పుడు మా సొంతూరులో ప్రభుత్వ పాఠశాలలో తొలిసారి పాట పాడాను. మా అక్కలు నేర్పించిన 'బాయిలో బచ్చలి కూర...' అనే ఆ పాట స్కూలు తర్వాత గ్రామ స్థాయి పోటీలు, మండలం, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో నాకు ప్రథమ స్థానాన్ని తెచ్చిపెట్టింది. జానపదంలో పాటతోపాటే నాట్యం కూడా చేస్తాం. అలా వేదిక మీద డాన్స్ చేయడంతో బిడియం పోతుంది. మనుషుల్లో కలిసిపోయే చొరవ వస్తుంది. ఆ చొరవే నన్ను తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ గేయాలు పాడేలా ముందడుగు వేయించింది. ఉద్యమం ఊపందుకోవడానికి పాటలను మించిన మాధ్యమం మరొకటి ఉండదని చెప్పి, మా ఊరిలోని ఉద్యమ గాయకుల బృందంలోని వాళ్లు నన్ను కూడా పాట పాడమని అడిగారు. అలా ఉద్యమంలోకి ఉరికిన దాన్ని... గళమెత్తాక ఎన్ని వేదికల మీద ఎన్ని గేయాలు పాడానో ఎప్పుడూ లెక్కపెట్టుకోలేదు. నేను నేర్చుకున్న ఉద్యమ గేయాలే కాకుండా, అక్కడికక్కడే ఆ సందర్భాన్ని బట్టి సొంతంగా పదాలు కూర్చుకుని పాడడం కూడా వచ్చేసింది. ఇంతవరకు పాటను కాగితం మీద రాసుకున్నది లేదు, నేరుగా పాడడమే.

ఆడపిల్లలు ఇలా ఉండాలంటూ గవర్నర్ తమిళిసై కర్రసాము నిపుణురాలు స్వర్ణయాదవ్‌ను అక్కున చేర్చుకున్న దృశ్యం

బతికించడమే బతుకు

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ చేస్తున్నాను. మరో యూనివర్సిటీలో ఎం.ఏ పాలిటిక్స్‌లో సీటు వచ్చింది. కానీ కళలకు కాణాచి అయిన తెలంగాణలో కళలు తెరమరుగవుతున్నాయి. సంగీత వాయిద్యాలు చిలక్కొయ్యల మీదనే ఉండిపోతున్నాయి. వాటిని కిందికి దించి తిరిగి మోగించాలని, కళలకు జీవం పోయడంలోనే జీవితాన్ని వెతుక్కోవాలని అనుకున్నాను. ఆర్ట్ ఫార్మ్‌ను బతికించడంలో మన బతుకుకు కూడా భరోసా ఉంటుందని నిరూపిస్తాను. అందులో భాగంగానే కర్రసాము, కత్తిసాము నేర్చుకుని ప్రదర్శిస్తున్నాను.

మొండిగా ప్రాక్టీస్

నెల రోజుల్లో కర్రసాములో మెళకువలు పట్టుపడ్డాయి. మొదట్లో దెబ్బలు తగిలాయి. భుజాలు నొప్పి, ఒళ్లు నొప్పులతో రాత్రి నిద్రపట్టేది కాదు. ఎందుకు మొదలు పెట్టానా అని కూడా అనిపించింది. కానీ మొండిగా ప్రాక్టీస్ చేశాను. అమ్మాయిలందరికీ కర్రసాము వచ్చి ఉండాలి. నేర్చుకున్నంత మాత్రాన ఎప్పుడూ కర్ర వెంట తీసుకెళ్లడం కుదురుతుందా అనుకుంటారు. కానీ ప్రమాదం తరుముకొచ్చినప్పుడు చేతిలో కర్ర లేకపోయినా, ప్రత్యర్థిని మట్టికరిపించే ఒడుపులు ఈ సాధనలో తెలుస్తాయి. ప్రమాదం నుంచి తమను తాము రక్షించుకోగలమనే ధీమా కలిగితే అమ్మాయిల్లో ఆత్మవిశ్వాసం దానంతటదే పుట్టుకొస్తుంది'' అన్నారు స్వర్ణయాదవ్.

ఇక్కడ ఒకమాట చెప్పాలి. ప్రతి మనిషికీ ఒక అండ కావాలి. ఆ అండ బయట ఉండదు. తనలో నిద్రాణంగా ఉన్న ఆత్మవిశ్వాసమే ఆ అండ. అలాగే ప్రతి మనిషీ... ఒక ఆధారాన్ని కోరుకుంటారు. ఆ ఆధారం మరొకరు అయి ఉండకూడదు. తనకు తానే అయి ఉండాలి. ఈ ఒక్క విషయాన్ని తెలుసుకుంటే చాలు... అమ్మాయిల చుట్టూ పరిభ్రమించడానికి ప్రమాదాలు కూడా భయపడతాయి.

– వాకా మంజులారెడ్డి

సంపాదన

ఆడవాళ్ల పని కూడా

బాలీవుడ్ నటి కాజోల్ కూతురు నైసా. పద హారేళ్లు. కొడుకు యుగ్. తొమ్మిదేళ్లు. ఇక చూడండి. ఈ ఏజ్ పిల్లలు ఇంట్లో ఉంటే.. అదీ అక్కా తమ్ముడో, అన్నా చెల్లెలో అయి ఉంటే.. ఇంట్లో ప్రతి క్షణమూ ఒక కోర్టు సీనే. సాధారణంగా ఇలాంటి కేసుల్లో తల్లే న్యాయమూర్తి. తండ్రి.. కేసు వదిలేసుకున్న జడ్జిలా మౌనంగా బయటికి వెళ్లిపోతాడు. కాజోల్ ఇంట్లో తమ్ముడి మీద అక్క ఫిర్యాదులు తక్కువే. అక్కను ఏదో ఒకటి అని విసిగించడం మాత్రం తమ్ముడికి డైలీ రొటీన్. 'అక్కరా.. నీకన్నా పెద్దదిరా..' అన్నా.. వింటాడా యుగ్! 'ఆడవాళ్లు ఆడవాళ్లలా

నటి కాజోల్

ఉండాలి' అంటాడు! 'ఆడా మగా ఏంట్రా.. అక్క చేసే పనులన్నీ నువ్వూ చెయ్యాల్సిందే' అంటారు కాజోల్. అంతే.. ముఖం మాడ్చుకుని వెళ్లిపోతాడు. కాజోల్ నిన్న ఒక ఇంటర్వ్యూలో.. ఈ సంగతే చెప్తూ.. ఇంటి పని ఎలాగైతే ఆడవాళ్ల పని మాత్రమే కాదో, అలాగే బయటికి వెళ్లి సంపాదించడం కేవలం మగాళ్ల పని మాత్రమే కాదు' అన్నారు. పేరెంట్స్ ఈ విషయం పిల్లలకు అర్థమయ్యేలా చెప్పగలిగితే.. సమాజంలో స్త్రీ పురుష సమానత్వం దానంతట అదే వచ్చేస్తుందని అని కూడా చెప్పారు.

క్షమాపణ

నా పిల్లలకు చెప్పక్కర్లేదు

కూతురికి కోర్ట్నీ ముద్దు

కోర్ట్నీ కర్దేషియన్ అమెరికన్ మీడియా ప్రముఖురాలు. మోడల్. కాలిఫోర్నియాలో ఉంటారు. అయితే ఏ రోజూ ఆమె గురించి వినని దేశమే ఉండదు. ఎప్పుడూ వార్తల్లో ఉంటారు. కిమ్, క్లో అని ఆమెకు ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. ఫ్యాషన్ రంగంలో ప్రసిద్ధులు వాళ్లు. కోర్ట్నీకి నలభై ఏళ్లుంటాయి. 2006లో పెళ్లయింది. ముగ్గురు పిల్లలు. కొడుకు, కూతురు, మళ్లీ ఒక కొడుకు. భర్త స్కాట్. కోపం వచ్చినప్పుడు భార్యాభర్తలు విడిపోతుంటారు. ఎడబాటుగా అనిపించినప్పుడు తిరిగి కలుస్తుంటారు. జీవితంలో తనకేవీ పశ్చాత్తాపాలు లేవంటారు కోర్ట్నీ. ఈ సంగతిని ఆమె తరచు టీవీ రియాల్టీ షోలలో చెబుతుంటారు. నిన్ననో, మొన్ననో కోర్ట్నీని మళ్లీ ఎవరో అడిగారు. అయితే వేరేలా అడిగారు. ''మీ జీవితంలో మీరు చేసిన.. 'క్షమాపణ చెప్పనవసరం లేని పని' ఏమిటో ఒకటి చెప్పండి'' అని! ఆ ప్రశ్నకు కోర్ట్నీ చెప్పిన సమాధానమే ఆమెను మళ్లీ వార్తల్లోకి తెచ్చింది. ''ఒక పనికి మాత్రం నేను ఎప్పటికీ క్షమాపణ చెప్పనవసరం లేదు'' అన్నారు! క్షమాపణ చెప్పనవసరం లేని ఆ పనిని కోర్ట్నీ తన పిల్లల విషయంలో చేశారట! బహుశా తండ్రిని అప్పుడప్పుడు పిల్లలకు దూరం చేయడం ఆమె చేసిన' క్షమాపణ చెప్పనవసరం లేని పని' అని మనం అనుకోవచ్చు. కానీ అది కాదట. ''నా పిల్లల్ని నేను వారి మూతిపై ముద్దు పెట్టుకున్నాను. అందుకు మాత్రం వారికి క్షమాపణ చెప్పక్కర్లేదు'' అని నవ్వేశారు కోర్ట్నీ. తర్వాత పేరెంటింగ్ గురించి కొద్ది సేపు మాట్లాడారు. పదేళ్ల కొడుకు, ఏడేళ్ల కూతురు, ఐదేళ్ల కొడుకు. ఇక కోర్ట్నీ కన్నా పెద్ద పేరెంట్ ఎవరుంటారు? కోర్ట్నీ లాంటి తల్లులు తప్ప. ''ఈ ఏజ్‌లోని పిల్లల్ని చాలా జాగ్రత్తగా పెంచాలి. పిల్లలు మాట వినరు కదా. నా కష్టమేదో నేను పడుతున్నాను. అప్పటికీ ఎవరో ఒకరు నాకు అక్కర్లేని సలహాలు ఇస్తుంటారు.. పిల్లల్ని అలా పెంచాలి, ఇలా పెంచాలి అని. అప్పుడు నాకు ఒళ్లు మండిపోతుంది'' అన్నారు కోర్ట్నీ. మండినందుకు కూడా ఆమె క్షమాపణ చెప్పక్కర్లేదు. పిల్లల పెంపకంలో ఒకరి అనుభవం ఇంకొకరికి పనికి రాదు కదా.



కరోనా కథలు - 1

మా ఇంటికి రాకండి

ప్రస్తుతం ప్రపంచాన్ని కరోనా 'కరో' నా అని హెచ్చరిస్తోంది. అంటే కొన్ని పనులు చేయొద్దు అని ముందుజాగ్రత్తలు చెబుతోంది. విదేశాల నుంచి ఎవరైనా అత్యవసరంగా స్వదేశానికి వస్తే, వాళ్లని కొన్ని రోజుల పాటు ఇంట్లో నుంచి బయటకు రావద్దని, ఎవ్వరితోనూ సంభాషించొద్దని, ఒంటరిగా ఉండటం మంచిదని సూచిస్తోంది. ఈ జాగ్రత్తలు పాటిస్తున్నారు హైదరాబాద్ మోతీనగర్‌లో నివాసం ఉంటున్న సత్యవతమ్మ గారు (పేరు మార్చాం). ఆవిడ వయసు 70. ఇటీవలే దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చారు. ఆవిడ తనంతట తానుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పని అమ్మాయిని నెలాఖరు దాకా పని చేయడానికి రావొద్దన్నారు. పై అంతస్థులో ఉండే కూతుర్ని కూడా రావొద్దని ఆవిడ తనకు తానుగా నియమాలు విధించుకున్నారు. తానుగా పని చేసుకోలేకపోయినా, కష్టపడి తన పనులు తనే చేసుకుంటున్నారు. కాలక్షేపం కోసం ఫోన్‌లో పేకాట ఆడుకుంటున్నారు. ఇది అందరికీ మంచిది. ఇతరులకు వ్యాప్తి చెందకుండా ఉండటానికి సత్యవతమ్మగారు అనుసరిస్తున్న విధానం బాగుంది కదూ!

చెట్టు నీడ

మూడు చారలు

గుడి ప్రాంగణంలో ఉన్న చెట్టుపై జామపండు తింటున్న ఉడుతకి, తన వీపు మీద ఉన్న మూడు చారలు.. వారధి నిర్మాణంలో సాయం చేసినందుకు గాను శ్రీరామచంద్రులవారు ప్రేమగా నిమరడం చేత వచ్చాయని.. చెట్టు నీడలో కూర్చుని ప్రసాదం తింటున్న ఇద్దరు భక్తులు మాట్లాడుకుంటుండగా వినిపించింది!



సాక్షాత్తు రామచంద్రయ్య చేతి గుర్తులా ఇవి! అయితే నేనెంత గొప్పదాన్ని అనే గర్వం మొదలైంది ఆ ఉడుతకి.

ఇక ఆగలేక తనతో రోజూ ఆడుకునే ఎలుక, తాబేలును వేళాకోళం చేస్తూ 'ఈ భూమ్మీద మీకు విలువ లేదు' అంటూ నానా మాటలు అనడం మొదలుపెట్టింది.

ఇది విని అక్కడే ఉన్న ఏనుగు నవ్వింది.

ఎందుకు నవ్వుతున్నావని ప్రశ్నించింది ఉడుత.

'నవ్వక ఏం చెయ్యమంటావ్ ? వీపు మీద చారలకే ఎగిరెగిరి పడుతున్నావే.. మరి ఎలుక వినాయకుడి వాహనం, తాబేలు విష్ణుమూర్తి అవతారం. ఎవరి గొప్ప వారిది. నిగర్వి గా ఉండటమే గొప్పతనం' అంది.

తన తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పుకుంది ఉడుత.

– సుజాత.పి.వి.ఎల్.

జాగ్రత్తగా ఉండండి

కోవిడ్ 19 (కరోనావైరస్) ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. ఇప్పటికే దేశ, విదేశాల్లో ఈ వైరస్ బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వాలు, ఆరోగ్య సంస్థలు తమ వంతు సూచనలను, సలహాలను ప్రజలకు చెబుతున్నాయి. కోవిడ్ 19పై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాయి. సినిమా స్టార్స్ కూడా తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. ట్వీట్స్, వీడియోల రూపంలో జాగ్రత్తలు చెబుతున్నారు.

'ఆర్ఆర్ఆర్' స్టార్స్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ కలిసి కోవిడ్ 19 (కరోనా వైరస్) వ్యాప్తి చెందకుండా ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను చెప్పిన వీడియో సోమవారం బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఇంకొందరు స్టార్స్ చెప్పిన విషయాలు ఈ విధంగా...

త్యాగం చేద్దాం – మహేశ్‌బాబు



కరోనా వైరస్ వల్ల వచ్చే సమస్యలను, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఒక్కొక్కరు ఒక్కోలా చెబుతున్నారు. సూపర్‌స్టార్ మహేశ్‌బాబు ఈ విషయం గురించి ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలోని సారాంశం ఏంటంటే.. వరుసగా ఓ యాభై అగ్గిపుల్లలను నిలబెట్టారు. మొదటి అగ్గిపుల్లకు నిప్పు అంటిస్తే ఒక అగ్గిపుల్ల నుండి మరో అగ్గిపుల్ల వేగంగా అంటుకుంటుంది. అవి ఓ సమూహంలా ఉన్నాయి కాబట్టే నిప్పు అంటుకుంది. అయితే ఓ అగ్గిపుల్లని వేరు చేస్తే అక్కడినుండి మిగిలిన అగ్గిపుల్లలకి మంట అంటలేదు. కరోనా వైరస్ కూడా ఓ సమూహంలా ఉంటే వేగంగా అంటుకుంటుంది. గుంపులో ఉంటేనే ఒకరి నుండి మరొకరికి అంటుకుంటుంది. విడిగా ఎవరికి వారుగా ఉంటే ఒకరి ద్వారా ఒకరికి వ్యాప్తి చెందదు అనేది వీడియోలోని సారాంశం. ''ఈ సమయంలో మనందరం సామాజికంగా ఒకరికొకరం దూరంగా ఉండాల్సిన పరిస్థితి. అది కష్టమైనప్పటికీ ఈ నిమిషంలో మనందరం కలిసికట్టుగా సమాజానికి వీలైనంత దూరంగా ఉంటేనే ఈ విపత్తు నుండి బయటపడటానికి సాధ్యమవుతుంది. పబ్లిక్ లైఫ్ బావుండాలంటే పర్సనల్‌గా మనందరం త్యాగం చేయాల్సిందే. వీలైనంతగా ఇంట్లోనే ఉండటానికి ప్రయత్నించండి'' అంటూ మరికొన్ని సలహాలు కూడా ఇచ్చారు.



ఇది మనందరి ఆరోగ్యాలకు పరీక్షాకాలం. పబ్లిక్ సేఫ్టీకి ఓ చాలెంజ్. కోవిడ్ 19 అనే మహమ్మారిపై విజయం సాధించేందుకు మనమందరం బాధ్యత వహించాలి. ప్రభుత్వ, ఆరోగ్య సంస్థల సూచనలు, సలహాలను పాటిద్దాం. ఈ కోవిడ్ 19 గురించిన తప్పుడు సమాచారానికి దూరంగా ఉందాం.

– ప్రభాస్

రాజకీయాలు, కులం, మతం, అధికారం, డబ్బు, కీర్తి.. ఏమీ ఉండవు. చివరికి మనిషికి మనిషే. మనమందరం ఒకే కుటుంబం. ఒకరి నొకరం సంరక్షించుకుందాం. బాధ్యతగా ఉండి సురక్షితంగా ఉందాం.

– నాని

'కోవిడ్ 19' వైరస్‌పై అవగాహన లేనివారికి, మాస్కులు, శానిటైజర్స్‌ను కొనలేనివారికి నా వంతు సహాయం చేస్తున్నాను. సూచనలు, సలహాలు పాటిస్తూ అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుకుంటున్నాను. శానిటైజర్స్ పంచమని తమను పంపారని కొందరు ఇంట్లోకి వచ్చి దొంగతనానికి ప్రయత్నిస్తున్నారని తెలిసింది. అలా పంపిణీ చేయమని ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు. అలాంటి వారి పట్ల జాగ్రత్త వహించండి.

– మంచు మనోజ్

కోవిడ్ 19 వైరస్ ప్రపంచంలో సృష్టిస్తోన్న కలకలాన్ని దృష్టిలో ఉంచుకుని మా పూరీ కనెక్ట్స్ సంస్థలోని అన్ని కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నాం. మా అందరి నిర్ణయం ఇది. ప్రభుత్వం, అధికారిక ఆరోగ్య ప్రతినిధులు ఇచ్చే సలహాలు, సూచనలను అందరూ పాటించండి. పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండండి. సమష్టి కృషితో ఈ కోవిడ్ 19 అనే యుద్ధాన్ని గెలుద్దాం.

– పూరి జగన్నాథ్, ఛార్మి

కరోనా మహమ్మారి కలవరపెడుతోంది. ఇలాంటి సమయంలోనే మనం కంగారు పడకూడదు. పుకార్లను ప్రచారం చేయకూడదు. బాధ్యతగల పౌరులుగా మనం పరిశుభ్రంగా, జాగ్రత్తగా ఉండాలి. దగ్గు, జలుబు ఉన్నవారు ఇతరులకు కాస్త దూరంగా ఉండటం మంచిది

– గాయని లతా మంగేష్కర్

మన దేశంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. భయంకరమైన ఈ వైరస్‌కు ఇప్పటివరకు వ్యాక్సిన్ లేదు. మనందరం ప్రభుత్వాలకు సహకరిద్దాం. వారి సూచనలు, జాగ్రత్తలను పాటిద్దాం

– నటి హేమమాలిని



ప్రపంచాన్ని వణికిస్తోన్న కరోనా వైరస్ ప్రస్తుతం మనదేశంలో కూడా వ్యాప్తి చెందుతోంది. అందుకే మా ధర్మ ప్రొడక్షన్స్‌కు సంబంధించిన అన్ని పనులను నిలిపివేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలు, మా సంస్థలో పని చేస్తున్న వారందరి క్షేమం గురించి ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన సూచనలు, ఆదేశాలు వచ్చిన తర్వాత మా పనులను తిరిగి ప్రారంభిస్తాం.

– కరణ్ జోహార్

వ్యాయామం, యోగ వంటివి చేసి మనలోని రోగనిరోధక శక్తిని పెంచుకుందాం. మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం.

– కత్రినా కైఫ్

కరోనా వైరస్ ప్రభావం ఉన్న దేశాల్లో ఎలాంటి చెడు పరిణామాలు జరుగుతున్నాయో అవి మన దేశంలో జరగకుండా జాగ్రత్త పడదాం. అందరం బాధ్యతాయుతంగా ఉందాం. తర్వాత పశ్చాత్తాపం చెంది ప్రయోజనం లేదు.

– పరిణీతి చోప్రా



● మోహన్‌బాబు

అందరూ బాగుండాలని...

ప్రతి ఏడాది ప్రముఖ నటుడు, నిర్మాత మోహన్‌బాబు బర్త్‌డే వేడుకలు మార్చి 19న తిరుపతిలో ఘనంగా జరుగుతాయి. ఈ ఏడాది ఆ వేడుకలకు అంతరాయం ఏర్పడింది. కరోనా కారణంగా వేడుక వాయిదా వేశానని మోహన్‌బాబు చెబుతూ – ''1992లో శ్రీవిద్యానికేతన్ విద్యాలయం ప్రారంభించాను. అప్పటి నుండి 27 ఏళ్లుగా మార్చి19న నా పుట్టినరోజు వేడుకలు తిరుపతిలో ఘనంగా జరుగుతున్నాయి. విజ్ఞానులు, శాస్త్రవేత్తలు, మేధావులు, కళాకారులు ఈ వేడుకలకు అతిథులుగా హాజరవుతుంటారు. ఎన్నో వేల మంది విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటుంటారు. ప్రతి సంవత్సరం కన్నుల పండుగగా జరిగే ఈ వేడుకలను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నాను. కారణం మనందరికీ తెలిసిందే. కరోనా ప్రపంచవ్యాప్తంగా ఒక దేశం నుండి మరో దేశానికి గాలి కంటే వేగంగా వ్యాప్తి చెందుతోంది. ప్రజలు గుంపులు, గుంపులుగా ఉన్నప్పుడు ఒకరినుంచి మరొకరికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అందరూ బావుంటేనే మనం బావుంటాం అనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. అందుకే ఈ ఏడాది శ్రీవిద్యానికేతన్ పాఠశాల అండ్ కళాశాలల వార్షికోత్సవాన్ని అదే రోజున జరిగే నా పుట్టినరోజు వేడుకను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాను. కరోనా వైరస్ ఈ భూభాగం నుండి వెళ్లిపోయేవరకు జాగ్రత్తగా ఉండండి'' అన్నారు.

పెళ్లి వార్తలపై ఫిర్యాదు

'హీరోయిన్ లావణ్యా త్రిపాఠిని వివాహం చేసుకుని, ఆపై వదిలేశా' అంటూ సోషల్ మీడియా ద్వారా శ్రీరామోజు సునిశిత్ అనే వ్యక్తి ఓ దుమారం రేపారు. సునిశిత్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కథానాయిక లావణ్యా త్రిపాఠి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీరామోజు సునిశిత్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తనపై అసత్య ప్రచారం చేస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారామె. లిఖితపూర్వక ఫిర్యాదును ఆమె తన సహాయకుడి ద్వారా ఏసీపీ కేవీఎమ్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ విషయంపై ఏసీపీ కేవీఎమ్ ప్రసాద్ మాట్లాడుతూ– ''శ్రీరామోజు సునిశిత్ అనే వ్యక్తి లావణ్య ఒక్కరిపైనే కాదు.. చాలా మంది సెలబ్రిటీలపైనా లేనిపోని వ్యాఖ్యలు చేశాడు.. ఎవరూ ఫిర్యాదు చేయలేదు. లావణ్యా త్రిపాఠి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నాం. మహిళల గురించి అసభ్యంగా మాట్లాడితే ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదు'' అన్నారు.

● లావణ్యా త్రిపాఠి

కార్మికులకు అండగా సహాయ నిధి

కరోనా వైరస్ కారణంగా సినిమా రిలీజ్‌లు, షూటింగ్స్‌లు ఆగిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రభావం జూనియర్ ఆర్టిస్టులు, లైట్‌మెన్స్, ప్రొడక్షన్‌లో పని చేసే చిన్న స్థాయి ఉద్యోగుల జీవితాలపై కూడా పడుతోంది. సినిమా షూటింగ్‌లు ఆగిపోవడం వల్ల ఇబ్బందులు పడే వర్కర్స్ కోసం ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా సహాయనిధిని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించిన ప్రకటన మంగళవారం విడుదలైంది. 'కరోనా మహమ్మారి వల్ల సినిమా, టీవీ, ఓటీటీ (డిజిటల్)లకు సంబంధించిన షూటింగ్స్ ఆగిపోయాయి. దీని వల్ల ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో పని చేసే కార్మికులపై తీవ్ర ప్రభావం పడింది. ఆర్థికపరమైన ఇబ్బందులతో వారి దైనందిన జీవితం కుంటుపడుతోంది. అందుకే వారికి బాసటగా నిలిచేందుకు సహాయనిధిని ఏర్పాటు చేస్తున్నాం. అలాగే మాతో కలిసి పనిచేస్తున్న మా తోటి ఉద్యోగులకు , మాతో అసోసియేట్ అయినవారికి కూడా ఈ కష్టకాలంలో తోడుగా ఉండాలనుకుంటున్నాం'' అని ది ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సిద్ధార్థ్ రాయ్‌కపూర్ పేర్కొన్నారు.

కరోనా

హిందీలో రోనా అంటే ఏడవడం అని అర్థం. 'కరోనా'లోనూ ఏడుపు ఉంది. అందుకే అందరినీ ఏడిపిస్తోంది. గృహ నిర్బంధం చేస్తోంది. మనిషికీ మనిషికీ దూరం పెంచేస్తోంది. కరోనా పేరుకి తగ్గట్టుగా ఇక ఏడవడమే మిగిలింది అన్నట్లుగా తయారైంది. అన్ని వ్యాపారాలపై కరోనా ప్రభావం పడింది. సినిమా పరిశ్రమపై కూడా భారీ ప్రభావం చూపుతోంది. పది రోజులు షూటింగ్స్‌కి బ్రేక్ ఇచ్చినందుకు, సినిమాల విడుదల వాయిదా వేసినందుకు బాలీవుడ్ దాదాపు 800 కోట్లు నష్టపోయే అవకాశం ఉందని లెక్కలు చెబుతున్నారు. మరి... కరోనా ఎంతమంది జీవితాలను రోడ్లపాలు చేస్తుందో? ఇక 'రోనా'నే మిగిలింది.

హౌస్‌ఫుల్ కావాల్సిన థియేటర్స్ కరోనా వైరస్ ప్రభావంతో షట్‌డౌన్ అయ్యాయి. షూటింగులు ఆగాయి. నిర్మాతల హృదయాలు బరువెక్కాయి. బాక్సాఫీస్‌పై కరోనా చేసిన దాడికి నిర్మాతలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇటు రిలీజ్ పరంగా, అటు నిర్మాణం పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనా వైరస్ కారణంగా బాలీవుడ్‌కి దాదాపు 800 కోట్లు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్తాన్, గుజరాత్, బీహార్.. ఇలా ఉత్తరాదిన పలు రాష్ట్రాల్లో థియేటర్స్‌ను మూసేశారు. దీంతో ఈ నెలలో విడుదల కావాల్సిన 'సూర్యవన్షి' వంటి సినిమాలు వాయిదా పడ్డాయి. అలాగే ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్ మోషన్ పిక్చర్స్, బాలాజీ మోషన్ పిక్చర్స్ వంటి బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థలు తమ షూటింగ్స్‌ను తాత్కాలికంగా బంద్ చేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో హీరోహీరోయిన్ల కాల్షీట్ల విషయంలోనూ భవిష్యత్‌లో ప్రాబ్లమ్స్ వచ్చే అవకాశాలు లేకపోలేదు. ''ఇప్పటికే విడుదలైన టైగర్‌ష్రాఫ్ 'భాఘీ 3' సినిమాకు 25 నుంచి 30 కోట్ల నష్టం వాటిల్లింది. ఇటు ఇర్ఫాన్ ఖాన్ 'అంగ్రేజీ మీడియం' సినిమా కూడా కలెక్షన్ల పరంగా తీవ్రంగా నష్టపోయింది. అనుకున్న సమయానికి సినిమాలు విడుదల కాకపోవడం, సినిమా నిర్మాణాలు అగిపోవడం వల్ల హిందీ చిత్రపరిశ్రమకు దాదాపు 800కోట్ల నష్టం కలుగుతుంది'' అని ఓ ట్రేడ్ విశ్లేషకుడు అభిప్రాయపడ్డారు.

''కరోనా వైరస్ కారణంగా ఎంత నష్టం ఏర్పడుతుందని ఇప్పుడే లెక్కలేయడం కష్టం. ఎందుకంటే చిత్రీకరణలు ఆగిపోయిన సినిమాల నష్టాన్ని అంచనా వేయడానికి కాస్త సమయం పడుతుంది. ఈ నెలలో కొన్ని సినిమాలు విడుదలయ్యాయి. నష్టపోయిన నిర్మాతలు తమ సినిమాలను రీ రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారు. అలా అయితే కొత్తగా విడుదల కావాల్సిన సినిమాలు, విడుదల ఆలస్యమైన సినిమాలు ఒకేసారి వస్తే అదొక సమస్యగా మారుతుంది'' అని మరో ట్రేడ్ విశ్లేషకుడు పేర్కొన్నారు. ఒక్క బాలీవుడ్‌లోనే కాదు..కరోనా వైరస్ ప్రభావం కారణంగా టాలీవుడ్, కోలీవుడ్..ఇలా అన్ని ఇండస్ట్రీలకు నష్టం వచ్చేలా ఉంది.

మరో ముగ్గురికీ టెస్ట్ కరోనా

హాలీవుడ్‌లో కరోనా బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఐదు రోజుల క్రితం స్టార్ కపుల్ టామ్ హ్యాంక్స్, రీటా విల్సన్ తమ కరోనా పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు పేర్కొన్నారు. మరో తార ఓల్గా కురిలెంకో కూడా కరోనా బారిన పడ్డారు. సోమవారం ఈ విషయాన్ని ఆమె స్వయంగా తెలిపారు. మంగళవారం నటుడు క్రిస్టోఫర్ హివ్జు కూడా తన బ్లడ్ శాంపిల్‌లో కరోనా లక్షణాలు ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. 'ది వెండీ ఎఫెక్ట్', 'ది లాస్ట్ కింగ్', 'ది ఫేట్ ఆఫ్ ది ఫ్యూరియస్', 'డౌన్‌హిల్' తదితర చిత్రాల్లో నటించారు క్రిస్టోఫర్. టెలివిజన్ సిరీస్ 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'లో చేసిన టోర్మండ్ పాత్ర ద్వారా క్రిస్టోఫర్ చాలా పాపులర్. ''నేను, నా కుటుంబ సభ్యులు ప్రస్తుతం మా అంతట మేం గృహనిర్బంధంలో ఉన్నాం. అందరం ఆరోగ్యంగా ఉన్నాం. నాకు కొంచెం జులుబు ఉంది. కరోనా లక్షణాలు కనిపించాయి. కోవిడ్–19 ప్రమాదకరమైన వైరస్. అందరూ చాలా జాగ్రత్తగా ఉండండి'' అన్నారు క్రిస్టోఫర్ హివ్జు.

● క్రిస్టోఫర్ హివ్జు

నటుడు ఇద్రిస్ ఎల్బా కూడా కోవిడ్ 19 వైరస్ సోకినట్లు తెలిపారు. 'లూథర్', 'ది వైర్' తదితర చిత్రాల్లో నటించారు ఎల్బా. కరోనా లక్షణాలు కనిపించడంతో ఇంటి నుంచి బయటకు రావడంలేదని పేర్కొన్నారు. వైరస్ ఉన్న వ్యక్తికి సమీపంగా ఉండటం వల్ల తనకు కూడా సోకిందేమోననే అనుమానంతో చేయించారట ఎల్బా. పాజిటివ్ రావడంతో ఇంటికి పరిమితం అయ్యారు. ''ఇది మనిషికీ మనిషికీ దూరం పాటించాల్సిన సమయం'' అని పేర్కొన్నారు ఇద్రిస్ ఎల్బా.

● ఇద్రిస్ ఎల్బా

'ప్రోజెన్ 2', 'హ్యాపీ డెత్' వంటి చిత్రాల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న హాలీవుడ్ తార రేచెల్ మాథ్యూస్ తనకు కోవిడ్ 19 టెస్ట్‌లో పాజిటివ్ వచ్చినట్లు పేర్కొన్నారు. ''వైరస్ సోకిందని తెలియగానే వారం రోజులుగా ఇంట్లోనే ఉంటున్నాను. ఆరోగ్యం నిలకడగానే ఉంది. అయితే డాక్టర్లు చెప్పేవరకూ ఇంటి నుంచి బయటకు రాకూడదనుకుంటున్నాను. ఈ వ్యాధి గురించి ఎవరికైనా ఏమైనా అనుమానాలు ఉంటే నన్ను అడగండి. ఎందుకంటే కరోనా బారిన పడ్డాను కాబట్టి ఈ స్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు'' అన్నారు రేచెల్.

● రేచెల్

అవతార్‌కి అవరోధం

దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన చిత్రాల్లో 'ది టెర్మినేటర్', 'టైటానిక్', 'అవతార్'.. ఈ మూడు చిత్రాలకూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఇప్పుడు కామెరూన్ 'అవతార్' సీక్వెల్‌తో బిజీగా ఉన్నారు. అయితే కరోనా కారణంగా 'అవతార్'కి అవరోధం ఏర్పడింది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ లాస్ ఏంజెల్స్‌లో జరుగుతోంది. అలాగే న్యూజిల్యాండ్‌లోని 'వెటా డిజిటల్'లో విజువల్ ఎఫెక్ట్స్ పనులు మొదలుపెట్టాలనుకున్నారు. దీనికోసం ఒక బృందంతో కలిసి కామెరూన్ న్యూజిల్యాండ్ వెళ్లాలనుకున్నారు. ''శుక్రవారం వెళదామనుకున్నాం. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రయాణం ప్రమాదం. అందుకే విరమించుకున్నాం'' అని చిత్రనిర్మాత లాండ్యూ పేర్కొన్నారు.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్

స్టార్ కపుల్ టామ్ హ్యాంక్స్, రీటా విల్సన్ హాస్పిటల్‌కి టాటా చెప్పి ఇంటికి చేరుకున్నారు. ఓ సినిమా షూటింగ్ కోసం ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు జ్వరం, అలసట అనిపించడంతో పరీక్షలు చేయించుకున్నారు టామ్, రీటా. కరోనా అని నిర్ధారణ కావడంతో ఆస్ట్రేలియాలోనే ఓ హాస్పిటల్‌లో చేరారు. ఐదు రోజులు చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. వీళ్లు కాలిఫోర్నియాలో ఉంటారు. కానీ ఇప్పుడు ప్రయాణం మంచిది కాదని భావించి, హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం ఆస్ట్రేలియాలోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడ ఉండాలనుకున్నారు. కొన్నాళ్ల పాటు బయటకు రాకుండా ఇంట్లోనే ఉండాలని ఈ దంపతులు నిర్ణయించుకున్నారు.

● టామ్ హ్యాంక్స్, రీటా విల్సన్

కరోనా లేదు కానీ...

ప్రముఖ బాలీవుడ్ నటుడు దిలీప్ కుమార్ (97) గృహనిర్బంధంలో ఉన్నారు. అంటే.. ఆయన కరోనా బారినపడ్డారని అనుకుంటున్నారేమో. అదేం కాదు. కరోనా లేదుకానీ ఈ వైరస్ రోజురోజుకీ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుండటంతో ముందు జాగ్రత్తగా ఆయన ఇంటి పట్టునే ఉండాలనుకున్నారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ''మా ఆవిడ (నటి సైరా భాను) నన్ను బాగా చూసుకుంటోంది. ఏ వైరస్సూ నా దగ్గరికి రాలేదు'' అని దిలీప్ ట్వీట్ చేశారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని, కుదిరినంతవరకూ ఇంటిపట్టునే ఉండాలని సూచించారు.

● సైరా భాను, దిలీప్ కుమార్

డిఫరెంట్ హారర్

● మానస

రాజ్ బాల, మానస జంటగా రమేష్ వీభూది దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'చిత్రం ఎక్స్'. బేబీ రాజశ్రీ సమర్పణలో శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి దేవి మూవీ క్రియేషన్స్ పతాకంపై పొలం గోవిందయ్య నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, మాట్లాడుతూ– ''మంచి కంటెంట్‌తో, జాగ్రత్తగా సినిమాలు చేస్తే ప్రేక్షకులు తప్పకుండా విజయాన్ని అందిస్తారు. 'చిత్రం ఎక్స్' మంచి కంటెంట్‌తో తెరకెక్కినట్లుగా అనిపిస్తోంది'' అన్నారు. ''రమేష్ వీభూది చెప్పిన కథ బాగా నచ్చింది. సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకంతో నిర్మించాను'' అన్నారు పొలం గోవిందయ్య. ''ఇప్పటివరకు వచ్చిన హారర్ ఫిలిమ్స్‌కి మా సినిమా భిన్నంగా ఉంటుంది'' అన్నారు రమేష్ వీభూది. ''భయంకరమైన అడవిలో నెల పాటు ఈ సినిమా కోసం పని చేశాం'' అన్నారు రాజ్ బాల. ఈ చిత్రానికి సంగీతం: శివ ప్రణయ్.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 18-3-2020

యాదోం కీ బారాత్ విలన్ నటుడు ఇంతియాజ్ ఖాన్ మృతి

'యాదోంకి బారాత్', 'ధర్మాత్మ', 'జఖ్మీ' వంటి బాలీవుడ్ సినిమాలలో విలన్‌గా నటించిన నటుడు ఇంతియాజ్ ఖాన్ (77) నేడు ముంబైలో మృతి చెందాడు. ఆయన భార్య కృతికా దేశాయ్ ప్రసిద్ధ టీవీ నటి. వీరికి ఆయేషా ఖాన్ అనే కుమార్తె ఉంది. ఆయేషా వీరి దత్తపుత్రిక.

ఇంతియాజ్ మొదటిసారి వెండితెర మీద 'దో గజ్ జమీన్ కే నీచే' (1972)లో విలన్‌గా నటించాడు. ఆ వెనుకనే వచ్చిన 'యాదోంకి బారాత్' (1973) సినిమాతో గుర్తింపు పొందాడు. ఈ సినిమాలో విలన్ అజిత్‌కు కొడుకుగా నటించాడు. పొడుగ్గా ఉండి, గడ్డం నిండిన ముఖంతో ఇంతియాజ్ ఖాన్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ఇంతియాజ్ ఖాన్‌ది సినిమా కుటుంబం. తండ్రి జయంత్ బాలీవుడ్‌లో పేరున్న విలన్. ఇక 'గబ్బర్ సింగ్'గా ప్రపంచానికి తెలిసిన అంజాద్ ఖాన్ ఇతని తమ్ముడు. అంజాద్ ఖాన్‌ను నటునిగా తీర్చిదిద్దడంలో ఇంతియాజ్ పాత్ర ఉంది. కాలేజీలో ఇంతియాజ్ డైరెక్ట్ చేసిన 'అయ్ మేరే వతన్ కే లోగో' అనే నాటకంలో అంజాద్ ఖాన్ నటించాడు. ఆ నాటకంలోని అంజాద్ నటనను చూసిన రచయిత సలీమ్ 'షోలే' సినిమాకు రికమండ్ చేశాడు.

తమ్ముడు అంజాద్ ఖాన్‌తో ఇంతియాజ్ ఖాన్

ఇంతియాజ్ ఖాన్‌ను మొదటి నుంచి దర్శకుడు కావాలని ఉండేది. కె.ఆసిఫ్ దగ్గర, ఆ తర్వాత చేతన్ ఆనంద్ దగ్గర దర్శకత్వ శాఖలో పని చేశాడు. రెండు సినిమాలు ప్రారంభించినా అవి సగంలోనే ఆగిపోయాయి. ఇంతియాజ్ తెర మీద విలన్‌గా నటించినా నిజ జీవితంలో ఎంతో సౌమ్యుడిగా పేరు పొందాడు. ఆయన మృతి పట్ల అనేక మంది సంతాపం వ్యక్తం చేశారు.

గయ్యాళి కాదు ఉత్త బోళా మనిషి

గళ్ల లుంగీ, బుగ్గ మీద గాటు ఉన్న రౌడీని చూసిన దాని కంటే సూర్యకాంతమ్మను చూస్తే ప్రేక్షకులకు దడుపు ఎక్కువ. ఎవరిని ఏం బాధలు పెడుతుందో. ఎవరిని రాచిరంపాన పెడుతుందో. ఆమె తలుచుకుంటే ఎవరి జీవితమైనా నాశనం అయిపోతుంది. అందుకే తెలుగువారు తమ ఆడ పిల్లలకు 'సూర్యకాంతం' అనే పేరే పెట్టడం మానేశారు. తెరమీద ఇంతగా నమ్మించగలిగిందంటే ఆమె ఎంత గొప్ప నటి అయ్యుండాలి. ఎంతో సౌమ్యురాలు, అమాయకురాలు, స్నేహశీలి అయిన సూర్యకాంతం గురించి ఆమె కుమారుడు పద్మనాభమూర్తి పంచుకున్న జ్ఞాపకాలివి.

పద్మనాభ మూర్తి

అమ్మకు ఆరేళ్ల వయస్సులోనే మా తాతయ్య చనిపోవడంతో వాళ్ల పెద్దక్క, బావల దగ్గర పెరిగింది. అమ్మ అల్లరిగా ఉండటం వల్లనో ఏమో చదువు పెద్దగా ఒంట పట్టలేదు. సినిమాల మీద మక్కువ కలిగింది. పల్లెటూరి నుంచి కాకినాడకు ఎడ్లబండిలో వచ్చి, పృథ్వీరాజ్ కపూర్ నటించిన హిందీ చిత్రాలు చూసేదట. సినిమాల మీద వ్యామోహంతో, పెద్దక్క ఒప్పుకోకపోయినా అమ్మ మ్మతో కలిసి మద్రాసు వచ్చేసిందట. నారదనారది (1946) అమ్మ మొదటి చిత్రం. మొదట్లో నాయిక పాత్రలు ధరించాలనుకుందట. కాని ఒకసారి అమ్మ పడిపోవటంతో, ముక్కు మీద మచ్చ పడిందట. క్లోజప్‌లో మచ్చ కనపడుతుంది కాబట్టి ఇక నాయిక పాత్రలకు పనికిరానని నిర్ణయించుకుని, క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారిపోయిందట. 1962లో విడుదలైన 'గుండమ్మ కథ' చిత్రంతో అమ్మ గయ్యాళి పాత్రలకు చిరునామాగా మారిపోయింది. ఒక్కసారి డైలాగ్ వింటే చాలు వెంటనే వచ్చేసేది. ఒకే టేక్‌లో ఓకే అయిపోయేదట. డైలాగ్ పలకడంలో విచిత్రమైన మాట విరుపు, ఎడమ చేతివాటం...ఈ రెండు ప్రత్యేకతలూ అమ్మను గొప్ప నటిని చేశాయి.

పది భాషలు వచ్చు..

అమ్మ స్కూల్ చదువులు పెద్దగా చదువుకోలేదన్న మాటే గానీ పది భాషలు అవలీలగా మాట్లాడగలదు. మద్రాసు వచ్చాక ఇంగ్లిషు, 50 ఏళ్ల వయస్సులో ఫ్రెంచ్ నేర్చుకుంది. బెంగాలీ అంటే అమ్మకు చాలా ఇష్టం. దిన పత్రికలు, పుస్తకాలు, నవలలు, పురాణేతిహాసాలు బాగా చదివేది. ఆంధ్రపత్రిక పేపరు ఆలస్యం అయితే చాలు పేపరు బాయ్‌ను నిలదీసేది.

క్రమశిక్షణతో ఉండేది..

తెల్లవారుజామునే నిద్రలేవడం, పూజ చేసుకోవడం, వంట పూర్తిచేసి, మాకు క్యారేజీలు పెట్టి, తన కోసం సిద్ధం చేసుకున్న క్యారేజీలతో షూటింగ్‌కు వెళ్లడం ఆవిడ దినచర్య. ఇంటికి వచ్చే బంధువుల కోసం నిమిషాల్లో ఏదో ఒక ప్రత్యేక వంటకం తయారు చేసేది. అనారోగ్యంతో బాధపడుతున్న రోజుల్లో కూడా అందరికీ చక్కని ఆతిథ్యం ఇచ్చేది. ఉన్నంతలో దానధర్మాలు చేసింది. చిన్న చిన్న పత్రికలకు ఆర్థికంగా సహాయపడింది.

చిన్నతనంలోనే..

మా అమ్మ (సూర్యకాంతం) నాకు స్వయానా పిన్ని. నేను రోజుల పిల్లాడిగా ఉన్నప్పుడే దత్తతు తీసుకుని మద్రాసులోనే బారసాల చేసిందట. కాకినాడ సమీపంలో ఉన్న వెంకటరాయపురం అమ్మ పుట్టిల్లు. మా తాతయ్యను నాలో చూసుకునేందుకే నాకు అనంత పద్మనాభమూర్తి అనే పేరు పెట్టి, నన్ను 'నాన్నా' 'నానీ' అని పిలిచేది. నాన్నగారు పెద్దిభొట్ల వెంకట చలపతిరావు. నన్ను కన్న తల్లి (సత్యవతి) ఇంటి పేరును నిలపడం కోసం 'దిట్టకవి' ఇంటి పేరునే కొనసాగించింది. నేను స్కూల్‌కి ప్రతిరోజూ కారులోనే వెళ్లేవాడిని. డ్రైవర్ రాకపోతే ఇంట్లో పనివాళ్లు సైకిల్ మీద స్కూల్‌లో దింపేవారు. ఆ స్కూల్‌లో ఒక ల్యాబ్ కట్టడానికి అమ్మ పదిహేను వేల రూపాయలు డొనేషన్ ఇచ్చింది. నేను ఎం. కామ్ చదువుకున్నాను. చదువు పూర్తయ్యాక కెనరా బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. కాని దూరమని పంపలేదు. ఆ తరవాత చెన్నై మైలాపూర్ ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. దగ్గరగా ఉండటంతో అమ్మ అనుమతితో చేరాను.

భయస్తురాలు..

అమ్మ ఎవరిని ఏ వరసలో పిలిస్తే, నేనూ అలాగే పిలిచేవాడిని. అమ్మ వాళ్ల అక్కయ్యలను.. దొడ్డమ్మ అనకుండా దొడ్డక్క అని పిలిచేవాడిని. అమ్మ ఎక్కడకు వెళ్లినా తన వెంటే నన్ను తీసుకువెళ్లేది. నాకు ఒంట్లో బాగా లేకపోతే ఎందరో దేవుళ్లకు మొక్కులు మొక్కేది. దేవాలయాలకు వెళ్లినప్పుడు హుండీలో నా చేత డబ్బులు వేయించేది, నా పేరున అర్చనలు చేయించేది. అమ్మ దయ వల్ల చాలా బాగా ఉన్నాను. అమ్మకి ఎవరి మీద అభిమానం, గౌరవం ఉండేవో వాళ్లకి ఏదైనా అవుతుం దేమోనని భయం ఎక్కువగా ఉండేది. జగపతి పిక్చర్స్ అధినేత వి.బి. రాజేంద్రప్రసాద్‌గారికి యాక్సిడెంట్ అయినప్పుడు ఆయన త్వరగా కోలుకోవాలని మొక్కుకుంది అమ్మ. ఆయనకు తగ్గాక అందరికీ భోజనాలు పెట్టింది. ఎవరికి ఒంట్లో బావుండకపోయినా, వాళ్ల తరపున అర్చనలు చేయించేది, మొక్కులు తీర్చేది. మా పుట్టినరోజు నాడు గుడికి తీసుకెళ్లి, పూజలు చేయించి, ఇంటికి వచ్చిన వాళ్లకి భోజనాలు పెట్టేది. కేక్ కట్ చేయటం అమ్మకు ఇష్టం లేదు.

నెయ్యి అంటే చాలా ఇష్టం..

అందరం కలిసి అన్నం తినాలనేది అమ్మ. ఒక్కోసారి అమ్మ వండుకున్న కూర అమ్మకే నచ్చేది కాదు. వెంటనే 'నాన్నా! నెయ్యి వేసి మాగాయి అన్నం కలిపి పెట్టరా' అనేది నాతో. అమ్మకు నెయ్యి – మాగాయి, నెయ్యి – ఆవకాయ అంటే చాలా ఇష్టం. జీవితంలో ఒక్కరోజు కూడా నెయ్యి లేకుండా అన్నం తినేది కాదు. ఎన్ని మానేసినా, నెయ్యి మాత్రం మానలేదు అమ్మ.

అన్నీ అమ్మే చూసింది..

నా వివాహం అమ్మే కుదిర్చి చేసింది. నా భార్య పేరు ఈశ్వరిరాణి. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి సూర్య సత్య వెంకట బాల సుబ్రహ్మణ్యం చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అమ్మాయి జయలక్ష్మి ఎంబిఏ చదివి, గీతమ్ యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తోంది. మా ఇంటి మొత్తానికి ఒక్క గదిలోనే ఏసీ ఉండేది. అందరం ఆ గదిలో చేరి కబుర్లు చెప్పుకునేవాళ్లం.

అమ్మ చేతి వంట... నోరూరేనంట..

అమ్మ చేతి వంట అమృతంలా ఉండేదనుకునేవారు సినిమా వారంతా. అమ్మకు బయట తిండి తినే అలవాటు లేదు. అందుకే షూటింగులకు వెళ్లేటప్పుడు తనకు మాత్రమే కాకుండా, షూటింగ్‌లో ఉన్న మిగతా వాళ్ల కోసమూ వంట చేసి తీసుకెళ్లేది. అమ్మ రాక కోసం అందరూ ఎదురు చూసేవారు. ఎన్‌టిఆర్ 'అక్కయ్యగారూ! ఏం తెచ్చారు?' అని అడిగి మరీ తినేవారు.

పెరుగన్నమే.. టిఫిన్ లేదు..

పొద్దున్నపూట టిఫిన్ కాకుండా పెరుగన్నమే తినాలి. నేను పదవీ విరమణ చేసేవరకూ ఉదయం పెరుగన్నమే తిన్నాను. ఇంటికి ఎవరు వచ్చినా 'మజ్జిగ తాగుతారా! అన్నం తింటారా!' అని అడిగేది. కాఫీ టిఫిన్లు ఇచ్చేది కాదు. ఆవిడ చాలా సింపుల్. జనసమ్మర్దంలోకి వెళ్లాలంటే అమ్మకి చాలా భయం. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి దేవాలయాలకు, బీచ్‌లకు రద్దీ లేని సమయంలో నన్ను తీసుకుని వెళ్లేది. అమ్మ చాలా రిజర్వ్‌డ్. అప్పట్లో సినిమా వారంతా టి నగర్‌లో ఉంటే, మేం మాత్రం సిఐటీ కాలనీలో ఉండేవాళ్లం.

అన్నీ చదివి వినిపించాలి..

అమ్మ నాకు తెలుగు నేర్పించింది. అన్ని రకాల పుస్తకాలు కొని తను చదివాక, నా చేత చదివించేది. నేను మూస ధోరణిలో చదువుతుంటే, 'ఆడ మగ గొంతు మార్చి చదివితేనే బాగుంటుంది, అప్పుడే అర్థమవుతుంది' అనేది. ఆవిడ మరణించాక అర్థమైంది పుస్తకాలు చదవటం వల్ల లోక జ్ఞానం వస్తుంది కాబట్టే చదివించిందని. అమ్మను ఎన్నటికీ మరువలేను.

– కొట్రా నందగోపాల్, సాక్షి ప్రతినిధి, చెన్నై
– వైజయంతి పురాణపండ

సూర్యకాంతం

సినీ పరివారం

శత్రువు ఇంటికి వచ్చినా వాళ్లని ఆదరించి అన్నం పెట్టేది. లైట్ కలర్స్ బాగా ఇష్టపడేది. నలుపు రంగంటే అస్సలు ఇష్టం లేదు అమ్మకు. ఒకసారి లైట్ బ్లూ కలర్ కారు బుక్ చేస్తే వాళ్లు బ్లాక్ కలర్ ఇచ్చారు. అప్పుడు గొడవ పెట్టి మార్చుకుంది అమ్మ. అమ్మే స్వయంగా కారు డ్రైవ్ చేసేది. 1994లో అమ్మ కన్ను మూసింది. అమ్మ కాలం చేసి పాతికేళ్లు దాటినా సూర్యకాంతం గారి అబ్బాయిగా నేను పొందే ప్రేమాభిమానాలతో కూడిన గౌరవ మర్యాదలు ఎవ్వరూ అపహరించేందుకు వీలులేని తరగని ఆస్తి. అమ్మను పద్మ పురస్కారాలతో సత్కరించకపోయినా, తెలుగు ప్రేక్షకులు అంతకంటే గొప్ప కీర్తిప్రతిష్టలతో ఆమెను వారి గుండెల్లో పదిలంగా ఉంచుకున్నారు.

సీ'రియల్'

నా భార్య కళ... ఇదేనా కల

'జీవితం మనం ప్లాన్ చేసుకున్న ప్రకారం ఉండదని బాగా నమ్ముతాను. ఎందుకంటే నేను అనుకున్నవాటికన్నా నన్ను వేరేగా చూపింది ఈ లైఫ్ జర్నీ' అంటూ తన గురించి పరిచయం చేసుకున్నారు ప్రతాప్ అభి. 'శశిరేఖ పరిణయం', 'కుటుంబ గౌరవం', 'కుంకుమపువ్వు', 'తేనెమనుసులు', 'నిన్నే పెళ్లాడతా..' ఇలా వరుస సీరియల్స్‌తో బుల్లితెర ప్రేక్షకులకు చిరపరిచితుడు ప్రతాప్ అభి. తన గురించి ఇలా వివరించారు.

'సీరియల్స్ చేస్తూనే నాలుగేళ్ల క్రితం 'ముద్దపప్పు – ఆవకాయ' టైటిల్‌తో వెబ్‌సీరీస్ చేశాను. మంచి రెస్పాన్స్ వచ్చింది. చిన్నప్పటి నుంచి యాక్టర్ కావాలని ఆలోచన ఏమీ లేదు. మాది ఖమ్మం జిల్లా పాల్వంచ. మా నాన్నగారు పవర్ స్టేషన్‌లో ప్రభుత్వోద్యోగి. అమ్మ గృహిణి. ముగ్గురు అన్నదమ్ములం. ఇంట్లో నేనే పెద్దవాడిని. నా ఇష్టాలకు ఇంట్లో ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. కానీ, నా భవిష్యత్తుకు ఒక మార్గం వేసుకోవడంలో మాత్రం చాలా సమస్యలు ఎదుర్కొన్నాను. ఇందులో పాఠాలు ఎన్నో నేర్చుకున్నాను.

నిన్నే పెళ్లాడతా...

'జీ' తెలుగులో వస్తున్న ఈ సీరియల్ నాకు జీవితాన్నే ఇచ్చిందని చెప్పవచ్చు. ఈ సీరియల్‌లో హీరోయిన్‌గా నటించిన అనూష హెగ్డే నిజ జీవితంలో నా అర్ధాంగి అయ్యింది. ఇప్పుడు అనూష 'సూర్యకాంతం' సీరియల్‌లో లీడ్ రోల్ పోషిస్తోంది. 'నిన్నే పెళ్లాడతా' సీరియల్‌లో ఏర్పడిన మా పరిచయం స్నేహంగా.. ఆ తర్వాత ప్రేమగా మారింది. తనది మంగుళూరులోని పుత్తూరు. మా ఇరు కుటుంబాల వాళ్లు మా పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇద్దరం కిందటి నెలలో పెళ్లి చేసుకున్నాం.

త్రీ క్యారెక్టర్స్...

బుల్లితెర మీద నా లైఫ్ ఇచ్చిందే 'శిశిరేఖపరిణయం' సీరియల్, ఆ తర్వాత తేనెమనసులు. ఇప్పుడు నిన్నే పెళ్లాడతా! ఈ మూడు సీరియల్స్‌లోని మూడు క్యారెక్టర్స్ నాకు మంచి గుర్తింపు నిచ్చాయి. అయితే, సీరియల్స్‌లో

ఆర్మీకి వెళ్లాలనుకున్నా

ఇంటర్మీడియట్ టైమ్‌లో ఆర్మీకి వెళ్లాలని చాలా ఆరాటపడ్డాను. సైనికుడిని కావాలన్నది నా లక్ష్యంగా ఉండేది. కానీ, అనుకోని కారణాల వల్ల ఆర్మీకి వెళ్లే అవకాశం కోల్పోయాను. ఆ విషయం అర్థమయ్యాక డిప్లమా ఇన్ యానిమేషన్, మల్టీమీడియా కోర్సు చేశాను. ఇది పూర్తయ్యాక కోరుకున్న కంపెనీలో అవకాశాలు రాలేదు. దీంతో 2009 నుంచి సినీ పరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించాను. 2013లో ఒక సినిమాలో అవకాశం వచ్చింది. కానీ, అది మొదట్లోనే ఆగిపోయింది. అయితే నిరాశ చెందలేదు. పడిపోయిన దగ్గరే ప్రయత్నాలు చేయాలనుకున్నాను. అప్పుడు 'శశిరేఖ పరిణయం' సీరియల్ ఆడిషన్స్‌కి పిలుపు వచ్చింది. సెలక్ట్ అయ్యాను. అప్పటినుంచి ఈ ఫీల్డ్‌లో కొనసాగుతున్నాను.

ముందు కథ విన్నప్పుడు క్యారెక్టర్ వేరుగా ఉంటుంది. ఆ తర్వాత రేటింగ్ బట్టి కథ, క్యారెక్టరైజేషన్ అన్నీ మారుతాయి. దానిని మనం డిసైడ్ చేయలేం. అందుకే లైఫ్ అంటే ఇలాగే ఉండబోతుందని ఎక్కువ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకోను.

విధిని నమ్ముతాను...

చదువుకునే రోజుల్లో దేవుడు–దెయ్యం అంటూ నమ్మకాలు ఏవీ లేవు. ప్రసాదాల కోసం గుడికి వెళ్లాలని అనుకునేవాడిని. కుటుంబం అంతా కలుసుకోవడానికి ఒక మంచి సందర్భం అనుకునేవాడిని. ఇంటర్మీడియట్ నుంచి నాకు తెలియకుండానే నా జీవితంలో కొన్ని స్ట్రగుల్స్ ఫేస్ చేశాను. ఆ సమయంలో భయంతో స్టార్ట్ అయిన భక్తి ఇప్పుడు ప్రేమగా మారింది. ఇలా జరిగి తీరాల్సిందే అని గట్టిగా నేను అనుకున్నప్పుడల్లా అలా పాజిటివ్ ఫలితాలు వచ్చాయి. దీంతో నమ్మకం మీద ఎక్కువ నమ్మకం ఏర్పడింది. పంచభూతాలు ఉన్నట్టే దైవం కూడా ఉందని, భయానికి ధైర్యంలా, ప్రశ్నకు సమాధానంలా ఈ సృష్టికి భగవంతుడు ఉన్నాడని నమ్ముతాను.

నా భార్య కళ .. నా కల

జీవితంలో బాగా సెట్ అవ్వాలి. పచ్చదనానికి దగ్గరగా ఉండాలి. వ్యవసాయం చేయాలి. పక్షులతో కబుర్లు చెప్పాలి. మూగజీవాల ఆలనాపాలన చూసుకోవాలి. అందుకు ఒక ఫామ్ హౌజ్ ఏర్పాటు చేసుకోవాలనేది ఆలోచన. అంతకుమించి ఒక నృత్య అకాడమీ ఏర్పాటు చేయాలన్నది కల. నా భార్య అనూష క్లాసికల్ డ్యాన్సర్. తనకు నృత్యం అంటే ప్రాణం. తన కోసమే ఇప్పుడు కల కంటున్నా. దానిని నెరవేర్చే ప్రయత్నంలో ఉన్నా. విధి ఎటువైపుగా తీసుకెళుతుందో చూడాలి.'

– సంభాషణ: నిర్మలారెడ్డి

ఫ్యామిలీ డాక్టర్

మందులు వాడినప్పుడే పీరియడ్స్... గర్భం వస్తుందా?

ఫెర్టిలిటీ కౌన్సెలింగ్

నా వయసు 32 ఏళ్లు. పెళ్లయి ఎనిమిదేళ్లు అవుతోంది. ఇంకా పిల్లలు లేరు. మందులు వాడినప్పుడు మాత్రమే నాకు పీరియడ్స్ వస్తోంది. లేడీడాక్టర్ కొన్ని పరీక్షలు చేయించారు. నా ఎఫ్ఎస్‌హెచ్ పాళ్లు 50 ఐయూ/ఎమ్ఎల్ అన్నారు. అలాగే నాలో ఏఎమ్‌హెచ్ కూడా చాలా తక్కువగా ఉందట. నా అండాశయ సామర్థ్యం (ఒవేరియన్ కెపాసిటీ) చాలా తక్కువగా ఉందన్నారు. నా భర్త స్పెర్మ్ కౌంట్ నార్మల్‌గానే ఉంది. నాకు గర్భం వచ్చే అవకాశం ఉందా? మా దంపతులకు తగిన సలహా ఇవ్వగలరు.

– ఓ సోదరి, శ్రీకాకుళం

మీ కండిషన్‌ను ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ అంటారు. సాధారణంగా ఇది శాశ్వతమైన సమస్య. అయితే కొన్ని సందర్భాల్లో అనూహ్యంగా గర్భం రావచ్చు కూడా. ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్‌కు కారణాలూ పెద్దగా తెలియదు. కొన్నిసార్లు క్రోమోజోములోని లోపాలు, తమ వ్యాధి నిరోధక శక్తి తమనే దెబ్బతీసే ఆటో ఇమ్యూన్ సమస్యలు, గాలాక్టోసీమియా వంటివి కారణమవుతాయి. ఫ్యామిలీ హిస్టరీగా ఈ కండిషన్ ఉన్నవారి కుటుంబాలలో ఇది తరచూ కనిపిస్తుంటుంది. ఈ సమస్య ఉన్నవారికి ఆటో ఇమ్యూన్ పరీక్షలూ, ఫ్రాజైల్ ఎక్స్ క్రోమోజోమ్ పరీక్షలూ, డెక్సాస్కాన్ వంటివి అవసరమవుతాయి. సాధారణంగా ఈ కండిషన్ ఉన్నవారిలో గర్భధారణ అవకాశాలు తక్కువ కాబట్టి ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) చేయించుకోవాల్సిందిగా సలహా ఇస్తుంటాం. ఉన్న కొద్దిపాటి అండాలను సేకరించడం కష్టమైతే, అప్పుడు దాతల నుంచి సేకరించి, వాటితో మీ భర్త శుక్రకణాలతో ఫలదీకరణ చేయించి, పిండాన్ని రూపొందించి, దాన్ని మీ గర్భసంచిలోకి ప్రవేశపెట్టవచ్చు. ఈ సమస్య ఉన్నవారు చాలా జాగ్రత్తగా తమ ఆరోగ్యాన్నీ కాపాడుకోవాల్సి ఉంటుంది. మీరు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం కోసం రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్యాల్షియమ్, విటమిన్–డి ఎక్కువగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవడం అవసరం. మీకు ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ ఉన్నందుకు మీ డాక్టర్ హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీని సూచిస్తారు. ఆ హార్మోన్లను సుమారు యాభై, యాభై ఒక్క ఏళ్లు వరకు వాడాల్సి ఉంటుంది. వేర్వేరు వైద్యవిభాగాలకు చెందిన మల్టీడిసిప్లనరీ టీమ్‌తో మీరు సత్ఫలితాలను పొందవచ్చు.

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలో బిడ్డ గుండెచప్పుడు వినిపిస్తుందా?

నా భార్యకు గర్భం వచ్చాక ఇటీవల ఏడో వారంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేయించాం. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చిందనీ, అది గర్భసంచిలో కాకుండా... కుడివైపున ట్యూబ్‌లో పెరుగుతోందని డాక్టర్ చెప్పారు. అయితే గుండెచప్పుళ్ళు వినిపిస్తున్నాయని అన్నారు. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలోనూ గుండెస్పందనల శబ్దాలు వినిపిస్తాయా? ఇప్పుడు శస్త్రచికిత్స చేసి దాన్ని తొలగించాలని డాక్టర్లు చెబుతున్నారు. మందులతో తగ్గే అవకాశం లేదా? గతంలోనూ ఆమెకోసారి గర్భం వచ్చినప్పుడు ఎడమవైపు ఇలాగే జరిగి, ఆ వైపు ఉన్న ట్యూబును తొలగించారు. ఇప్పుడు ఇలాగే జరిగితే భవిష్యత్తులో గర్భధారణ జరిగే అవకాశాలు ఎలా ఉంటాయి?

– ఎస్‌బీఆర్., కాకినాడ

గర్భసంచిలో కాకుండా ట్యూబ్‌లోనే గర్భం ఉండే పరిస్థితిని ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అంటారు. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ కండిషన్‌లోనూ గుండెచప్పుళ్లు వినిపిస్తుంటాయి. ఈ పరిస్థితిని ఒక దశ వరకు మందులతో తగ్గించవచ్చు. అయితే పిండంలో హార్ట్‌బీట్ మొదలయ్యాక మాత్రం మందులతో తగ్గించలేం.

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ అని తెలిసినప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి అది అకస్మాత్తుగా కడుపులో రక్తస్రావానికి (ఇంటర్నల్ బ్లీడింగ్‌కు) దారితీయవచ్చు. అందుకే పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోడానికి శస్త్రచికిత్సను డాక్టర్లు సూచిస్తుంటారు. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ వచ్చినప్పుడు దాన్ని తొలగించడానికి లాపరోస్కోపిక్ సర్జరీ అనేది మంచి ప్రత్యామ్నాయం. శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో ట్యూబ్ ఉంచాలా లేదా అనే నిర్ణయాన్ని అప్పటి పరిస్థితిని బట్టి డాక్టర్లు తీసుకుంటారు. ఇక ఆమెకు అకస్మాత్తుగా రక్తస్రావం అయితే మాత్రం ఓపెన్ సర్జరీ నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ మీ భార్య రక్తం గ్రూప్ నెగెటివ్ అయితే ఆమెకు 'యాంటీ–డీ' అనే ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజెక్షన్ చేయించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆమెకు రెండు ట్యూబులు తొలగించినా మీరు ఆందోళన చెందకండి. ఆమె సురక్షితంగా ఉండే ఆ తర్వాత టెస్ట్‌ట్యూబ్ బేబీ అని పిలిచే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) మార్గాన్ని అనుసరించవచ్చు.

డాక్టర్ రత్న దూర్వాసుల
సీనియర్ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో,
హైదరాబాద్

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్వర్థయా వర్ధతే విద్య
బుధవారం
18-3-2020

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో 'యాంత్రిక్' పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

దరఖాస్తులకు చివరి తేది: 22.03.2020

సాహస యాంత్రిక్‌లు

సముద్ర తీర ప్రాంతానికి రక్షణగా ఉండటంతోపాటు.. విపత్తుల్లో సహాయ సహకారాలు అందించడంలో 'కోస్ట్‌గార్డ్' విభాగం ముందుంటుంది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ కోస్ట్ గార్డ్, సాయుధ విభాగంలో 'యాంత్రిక్' (02/2020 బ్యాచ్) నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. సముద్రంపై సాహసంతో కూడిన ఉద్యోగం కోరుకునే యువతకు ఇదో చక్కటి అవకాశం. యాంత్రిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఎంపికైన వారికి ఆగస్టులో శిక్షణ ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ కోస్ట్‌గార్డ్ యాంత్రిక్ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..

పోస్టుల వివరాలు

- యాంత్రిక్ 02/2020 బ్యాచ్‌లో 37 ఖాళీలు ప్రకటించారు. ఇందులో యాంత్రిక్ టెక్నికల్(మెకానికల్) పోస్టులు 19 ఉండగా.. వీటిలో జనరల్ కేటగిరీ-8, ఓబీసీ-06, ఎస్సీ-2, ఎస్టీ-2, ఆర్థికంగా వెనుకబడిన వారికి(ఈడబ్ల్యూఎస్)-01 రిజర్వ్ చేశారు.
- యాంత్రిక్ టెక్నికల్(ఎలక్ట్రికల్) విభాగంలో 03 ఖాళీలు ఉండగా.. వీటిలో జనరల్-01, ఓబీసీ-01, ఎస్సీ-01 కేటాయించారు.
- యాంత్రిక్ టెక్నికల్(ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్) విభాగంలో 15 ఖాళీలు ఉన్నాయి. వీటిలో జనరల్-07, ఓబీసీ-04, ఎస్సీ-03, ఈడబ్ల్యూఎస్-01 రిజర్వ్ చేశారు. పోస్టుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

విద్యార్హతలు

పురుష అభ్యర్థులై ఉండాలి. మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన విద్యార్హతతోపాటు ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) గుర్తింపు ఉన్న కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్(రేడియో /పవర్) ఇంజనీరింగ్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు, జాతీయ స్థాయి అత్యుత్తమ క్రీడాకారులకు 5 శాతం మార్కుల సడలింపు లభిస్తుంది.

వయసు

- కనిష్టంగా 18 ఏళ్లు, గరిష్టంగా 22ఏళ్లు ఉండాలి. అంటే.. 01 ఆగస్టు 1998 నుంచి 31 జూలై 2002 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 5ఏళ్లు, ఓబీసీలకు మూడేళ్లు వయో సడలింపు ఉంటుంది.
- అభ్యర్థి కనిష్ట ఎత్తు 157 సెంటీమీటర్లు ఉండాలి. కొండ, గిరిజన ప్రాంత అభ్యర్థులకు కొంత సడలింపు ఉంటుంది. » ఊపిరి తీసుకున్నప్పుడు ఛాతీ కనీసం 5 సెంటీమీటర్లు విస్తరించాలి. » వయసు, ఎత్తుకు తగిన బరువు తప్పనిసరి. వినికిడి సమస్య ఉన్నవారికి అవకాశం లేదు. » గుర్తింపు లేని కళాశాలల్లో చదివిన వారు దరఖాస్తు చేసేందుకు అనర్హులు. » అభ్యర్థుల శరీరంపై ఎలాంటి పచ్చబొట్టు (టాటూస్) ఉన్నా తిరస్కరిస్తారు.

ఎంపిక విధానం

యాంత్రిక్ పోస్టులకు రాత పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. ప్రశ్నపత్రంలో దరఖాస్తు చేసుకున్న పోస్టును బట్టి.. సంబంధిత విభాగంపై (మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్) ప్రశ్నలు ఉంటాయి. దాంతోపాటు జనరల్ నాలెడ్జ్, రీజనింగ్, ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. రాత పరీక్షలో అర్హత సాధించిన వారిని ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ), వైద్య పరీక్షకు ఎంపిక చేస్తారు. మెడికల్ టెస్ట్‌ను ఆర్మీ వైద్యులే నిర్వహిస్తారు.

- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్:** 7 నిమిషాల్లో 1.6 కిలోమీటర్ల పరుగుతో పాటు.. 20 స్క్వాట్ అప్స్ (ఉతక్ బైతక్), 10 పుష్ అప్స్ పూర్తి చేయాలి.

జీతభత్యాలు

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో చేరిన తర్వాత బేసిక్ పే రూ.29,200(పే లెవల్-5) లభిస్తుంది. దీంతో పాటు అదనంగా యాంత్రిక్ పే రూ.6200, ఇతర అలవెన్సులు ఉంటాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం-విధుల స్వభావం, పోస్టింగ్ పొందే ప్రాంతాన్నిబట్టి ఇతర భత్యాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

పదోన్నతులు- సౌకర్యాలు

- యాంత్రిక్‌గా చేరిన అభ్యర్థి ప్రధాన్ సహాయక్ ఇంజనీర్ ర్యాంక్ వరకు పదోన్నతి పొందవచ్చు. ఈ ర్యాంక్‌లో రూ.47,600 వేతనం, యాంత్రిక్ పే రూ.6200, డియర్‌నెస్ అలవెన్స్ చెల్లిస్తారు. తర్వాత పనితీరు ఆధారంగా ఆఫీసర్ కేడర్‌కు పదోన్నతి లభిస్తుంది.
- ఉద్యోగి కుటుంబం, తల్లిదండ్రులకు ఉచిత రేషన్, వైద్య సౌకర్యాలు, అతి తక్కువ అద్దెతో ప్రభుత్వ వసతి, ఏటా 45 ఆర్జిత సెలవులు, 08 సాధారణ సెలవులు ఉంటాయి. ఎల్‌టీసీ సదుపాయం కూడా లభిస్తుంది. ఉద్యోగ విరమణ అనంతరం గ్రాట్యుటీ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ వర్తిస్తుంది.

దరఖాస్తు విధానం

- ఆసక్తి గల అభ్యర్థులు **www.joinindiancoastguard.gov.in** లో దరఖాస్తు చేయాలి.
- అభ్యర్థి పేరు, తండ్రి/తల్లి పేరు, పుట్టిన తేదీ (10వ తరగతి సర్టిఫికెట్ ప్రకారం) ఉండాలి.
- డిప్లొమా మార్కుల పర్సంటేజీని 'కచ్చితంగా' పేర్కొనాలి.
- వ్యక్తిగత ఇ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ వంటి సమాచారాన్ని తప్పనిసరిగా పొందుపరచాలి.
- అభ్యర్థి పరీక్ష రాసేందుకు వెబ్‌సైట్‌లో చూపించిన ఏదైనా ఒక కేంద్రాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:** 16.03. 2020
- **దరఖాస్తులకు చివరి తేది:** 22.03.2020
- **పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్:** **www.joinindiancoastguard.gov.in**

స్వయంగా నేర్చుకోండి

» ఎంహెచ్ఆర్‌డీ స్వయం పోర్టల్‌లో ఉచితంగా ఆన్‌లైన్ లెర్నింగ్ సదుపాయం
» అత్యుత్తమ ప్రొఫెసర్లు, నిపుణుల ద్వారా బోధన అందిస్తున్న వైనం
» తొమ్మిదో తరగతి నుంచి పీజీ వరకూ.. ప్రతి ఒక్కరికీ ఉపయుక్తం

ఎవరైనా.. ఎప్పుడైనా...ఎక్కడైనా..! ఏంటీ ఇదేదో సినిమా డైలాగ్‌లాగా ఉంది అనుకుంటున్నారా! కానే కాదు! స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ యాస్పైరింగ్ మైండ్స్.. స్థూలంగా.. స్వయం!! కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ(ఎంహెచ్ఆర్‌డీ) ప్రారంభించిన స్వయం పోర్టల్ ద్వారా సమయం, ప్రాంతాలు, వ్యక్తులు అనే తారతమ్యాలు లేకుండా.. తొమ్మిదో తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకూ.. ఉచితంగా ఆన్‌లైన్ లెర్నింగ్ సదుపాయం పొందొచ్చు. ఈ నేపథ్యంలో.. స్వయం ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్‌తో ప్రయోజనాలు, సదుపాయాల గురించి తెలుసుకుందాం...

అత్యుత్తమ బోధన

అందుబాటు, సమానత్వం, నాణ్యతలనే మూల సూత్రాలపై స్వయం ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, సీఎఫ్ఐటీలతోపాటు దేశంలోని ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు, స్కూల్స్ నుంచి 1000 మందికిపైగా నేటి మేటి అత్యుత్తమ ప్రొఫెసర్లు, టీచర్లు స్వయం పోర్టల్‌లో ఆన్‌లైన్ లెక్చర్లు అందిస్తున్నారు. విద్యార్థులు దీన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఉచితంగా అత్యుత్తమ అధ్యాపకుల బోధన, శిక్షణతోపాటు సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశాన్ని దక్కించుకోవచ్చు.

కోర్సు స్వరూపం

స్వయం పోర్టల్ ద్వారా అందించే కోర్సుల్లో నాలుగు ప్రధాన అంశాలు ఉంటాయి. అవి... 1. వీడియో లెక్చర్స్. 2. ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్. 3. స్వీయ సామర్థ్య పరీక్షలు (టెస్టులు, క్విజ్‌లు), 4. ఆన్‌లైన్ చర్చా వేదిక. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఆడియో, వీడియో, మల్టిమీడియా సాధనాలను ఉపయోగిస్తారు.

కో-ఆర్డినేటర్స్

స్వయం కోర్సుల్లో విద్యార్థులకు అత్యుత్తమ మెటీరియల్, లెక్చర్స్‌ను అందించేందుకు తొమ్మిది ఇన్‌స్టిట్యూట్‌లు,ఆర్గనైజేషన్లను నియమించారు. అవి.. » **ఏఐసీటీఈ:** వృత్తి విద్య, ఇంటర్నేషనల్ కోర్సులు » **ఎన్‌పీటీఈఎల్:** ఇంజనీరింగ్ » **యూజీసీ:** పోస్టు గ్రాడ్యుయేషన్ ఎడ్యుకేషన్(నాన్ టెక్నికల్) » **సీఈసీ:** అండర్ గ్రాడ్యుయేషన్ ఎడ్యుకేషన్ » **ఎన్‌సీఈఆర్‌టీ:** స్కూల్ ఎడ్యుకేషన్ » **ఎన్ఐఓఎస్:** స్కూల్ ఎడ్యుకేషన్ » **ఇగ్నో:** స్కూల్ ఎడ్యు కేషన్ ముగించుకున్న వారికి » **ఐఐఎంబీ:** మేనేజ్‌మెంట్ స్టడీస్ » **ఎన్ఐటీటీటీఆర్:** టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్.

తీరుతెన్నులు

స్వయం అనేది ఒక ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ వెబ్ పోర్టల్. దీన్నొక విధంగా మూక్స్‌కు విస్తృత రూపంగా చూడొచ్చు. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థులకు మూక్స్ విధానంలో లెక్చర్స్, ఇంటరాక్టివ్ సెషన్స్ అందుబాటులో ఉంటాయి.

- స్వయం వెబ్‌పోర్టల్ ద్వారా మూక్స్ రూపంలో అందించే కోర్సులన్నీ సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర ప్రముఖ యూనివర్సిటీల ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో రూపొందుతాయి.
- ప్రొఫెసర్లను ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ లేదా సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్‌గా పిలుస్తారు. వీళ్లు తాము అందించనున్న కోర్సు వివరాలను వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. సదరు వివరాలు ఆమోదం పొందిన తర్వాత ఆన్‌లైన్ లెక్చర్స్ అందించే క్రమంలో లైవ్ ట్యుటోరియల్స్, సదరు కోర్సుకు సంబంధించిన మెటీరియల్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం, ఈ-టెక్స్ట్‌బుక్స్, ఇల్లస్ట్రేషన్స్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తేవాల్సి ఉంటుంది. ఇవన్నీ ఉన్నాయని రుజువు చేస్తేనే ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ లేదా సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా పిలిచే ప్రొఫెసర్/లెక్చరర్‌కు స్వయంలో బోధించేందుకు అనుమతి లభిస్తుంది.

సర్టిఫికెట్ సదుపాయం

- స్వయం విధానంలో ఆన్‌లైన్ లెక్చర్స్ విని మూల్యాంకలోనూ ప్రతిభ చూపిన విద్యార్థులకు సదరు కోర్సును బోధించిన ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ లేదా సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ సర్టిఫికెట్‌ను అందిస్తారు. దీన్ని విద్యార్థికి డొమైన్ ప్రోగ్రామ్ చదువుతున్న ఇన్‌స్టిట్యూట్ ద్వారా అందజేస్తారు.
- స్వయం విధానంలో రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఎలాంటి విద్యార్హత లేని వారు సైతం ఓపెన్ స్కూల్‌లో చేరి విద్యను అభ్యసించొచ్చు. పాఠశాల స్థాయిలో 110, సర్టిఫికెట్ లెవల్‌లో 70, డిప్లొమాకు సంబంధించి 38, అండర్ గ్రాడ్యుయేట్‌లకు 965, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లకు 358 వీడియోలు అందుబాటులో ఉన్నాయి.

ప్రయోజనాలు ఇవి

- **టాప్ క్లాస్ ఇన్‌స్ట్రక్టర్స్:** స్వయం కోర్సులకు రిజిస్టర్ చేసుకోవడం ద్వారా వరల్డ్ క్లాస్ ఫ్యాకల్టీ బోధన వినేందుకు అవకాశం ఏర్పడుతుంది. అత్యుత్తమ బోధనా వీడియోలు, మెటీరియల్‌ను అందుకోవడంతోపాటు నేటి మేటి అధ్యాపకులతో ఇంటరాక్ట్ అయ్యే అవకాశం దక్కుతుంది.
- **వీక్లీ అసైన్‌మెంట్‌లు:** స్వయం కోర్సుల్లో వారాంతర అసైన్‌మెంట్‌లు ఉంటాయి. వీటి ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తారు.
- **ప్రొక్టోర్డ్ ఎగ్జామ్స్:** స్వయంలో కోర్సు పూర్తయిన తర్వాత ప్రొక్టోర్డ్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. వీటిని గుర్తింపు పొందిన భాగస్వాముల ద్వారా జరుపుతారు.
- **క్రెడిట్స్ సదుపాయం:** స్వయం వెబ్ పోర్టల్ ద్వారా అందించే ఆన్‌లైన్ లెక్చర్స్‌లో ప్రతి కోర్సుకు నిర్దిష్ట క్రెడిట్స్ ఉంటాయి. దీనికోసం ఆన్‌లైన్ లెక్చర్ ముగిసిన తర్వాత ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ పరీక్ష నిర్వహిస్తారు. అంతేకాకుండా ఈ క్రెడిట్స్‌ను సదరు ప్రోగ్రామ్‌లో ఫైనల్ క్రెడిట్స్‌లో కలపాలని యూనివర్సిటీలకు యూజీసీ మార్గనిర్దేశాలు జారీ చేసింది.
- **క్రెడిట్స్ బదిలీ:** స్వయం ద్వారా కల్పించే క్రెడిట్ సదుపాయానికి సంబంధించి మరో ప్రత్యేకత.. క్రెడిట్స్ బదిలీ సదుపాయం. ఒక ఇన్‌స్టిట్యూట్ లేదా యూనివర్సిటీ తరఫున క్రెడిట్స్ పొందిన అభ్యర్థి సదరు క్రెడిట్స్‌ను సైతం బదిలీ చేసుకొనే వెసులుబాటు ఉంటుంది.
- **వెబ్‌సైట్: swayam.gov.in**

ప్రవేశాలు

ఆర్మీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ ప్రవేశాలు

ఆర్మీకాలేజ్ ఆఫ్ నర్సింగ్, జలంధర్ కంట్, ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్- గువాహటి.. బీఎస్సీ (నర్సింగ్)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నాయి.

» **అర్హత:** కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు.
» **ఎంపిక:** ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **పరీక్ష తేదీ:** జూన్ 6, 2020
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 30, 2020
» **వెబ్‌సైట్: http://acn.co.in**

ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాలు-2020
❖ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, జీకే, మాక్ టెస్టులు, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్, మోడల్ పేపర్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
Google Play
App Store

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
TELUGU

ఏపీ అభ్యర్థులకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

చెన్నైలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయ పరిధిలోని.. ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్-గుంటూరు ఏపీ అభ్యర్థులను నియామక ర్యాలీ నిర్వహిస్తోంది. ఏపీకి చెందిన ఏడు (అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం) జిల్లాల వారు దీనికి అర్హులు.

» **పోస్టులు:** సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్/సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్ వెటర్నరీ కేటగిరీ.
» **అర్హత:** ఎనిమిదో తరగతి, పదోతరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతో పాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలుండాలి.
» **వయసు:** 17-23 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ), ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), మెడికల్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ర్యాలీ నిర్వహణ తేదీ:** 2020, మే 5 నుంచి 17 వరకు ఉంటుంది.
» **ర్యాలీ ప్రదేశం:** భారతీయార్ యూనివర్సిటీ స్పోర్ట్స్ స్టేడియం, కోయంబత్తూరు (తమిళనాడు).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ప్రక్రియ:** 2020, మార్చి 21 నుంచి ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in**

ఎస్ఏసీ-54

అహ్మదాబాద్ (గుజరాత్)లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 54 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** సైంటిస్ట్/ఇంజనీర్-ఎ సీడీ, టెక్నికల్ అసిస్టెంట్, టెక్నీషియన్-బీ/డ్రాఫ్ట్స్‌మెన్-బీ.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ తదితర విభాగాలున్నాయి.
» **అర్హత:** పోస్టులను బట్టి మెట్రిక్యులేషన్, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
» **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 3, 2020
» **వెబ్‌సైట్: www.sac.gov.in**

జాబ్ పాయింట్

ఎన్ఎల్‌సీ-259

తమిళనాడులోని భారత ప్రభుత్వానికి చెందిన నవరత్న సంస్థ అయిన నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్ 259 గ్రాడ్యుయేట్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్-125, ఎలక్ట్రికల్ (ఈఈఈ)-65, ఎలక్ట్రికల్ (ఈసీఈ)-10, సివిల్-5, కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్-15, కంప్యూటర్-5, జియాలజీ-5, ఫైనాన్స్-14, హ్యూమన్ రిసోర్స్-10.
» **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, లా, సీఏ/సీఎంఏ, ఎంటెక్/ఎంఎస్సీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత.
» **వయసు:** మార్చి 1, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.854
» **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 18, 2020
» **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 17, 2020
» **పరీక్ష తేదీ:** 2020, మే 26, 27 తేదీల్లో ఉంటుంది.
» **వెబ్‌సైట్: www.nlcindia.com**

షార్-12

శ్రీహరికోట (నెల్లూరు)లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్డీఎస్సీ)-షార్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీ ఖాళీలు:** నర్సు-2, ల్యాబ్ టెక్నీషియన్-3, ఫైర్‌మెన్-7.
» **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా ఉత్తీర్ణత, నిర్దిష్ట అనుభవం ఉండాలి.
» **వయసు:** మార్చి 27, 2020 నాటికి 18-35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.100
» **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 7, 2020
» **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 27, 2020
» **వెబ్‌సైట్: www.shar.gov.in**

బీఈసీఐఎల్-32

నోయిడాలోని భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 32 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీ ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్-30, మల్టీ టాస్కింగ్ స్టాఫ్-2.
» **అర్హత:** పోస్టును బట్టి పదోతరగతి, గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం ఉండాలి.
» **వయసు:** 25-45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.500
» **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 20, 2020
» **వెబ్‌సైట్: www.becil.com**

డ్రెడ్జింగ్ కార్పొరేషన్-9

విశాఖపట్నంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 9 ట్రెయినీ (డ్రెడ్జింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీలు:** 9
» **కాల వ్యవధి:** ఏడాది
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక:** మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 9, 2020
» **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 23, 2020
» **వెబ్‌సైట్: http://dredge-india.nic.in**

సీఎస్ఐఆర్-11

ఢిల్లీలోని సీఎస్ఐఆర్-సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ).. 11 సైంటిస్ట్ గ్రేడ్-4 (2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్, పీహెచ్‌డీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **ఎంపిక:** షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ముందుగా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ నింపిన తర్వాత హార్డ్‌కాపీని పోస్ట్ చేయాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 17, 2020
» **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 6, 2020
» **హార్డ్‌కాపీ పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 16, 2020
» **వెబ్‌సైట్: www.crridom.gov.in**

టీహెచ్ఎస్టీఐ-29

ఫరిదాబాద్ (హరియాణ)లోని భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన ట్రాన్స్‌లేషన్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్టీఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 29 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** సీనియర్ మేనేజర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితర పోస్టులున్నాయి.
» **అర్హత:** పోస్టును బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, పీజీ డిగ్రీ/డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
» **వయసు:** పోస్టులను బట్టి 30-56 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 8, 2020
» **వెబ్‌సైట్: https://thsti.res.in**

యూపీఎస్సీ-85

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 85 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీ ఖాళీలు:** చీఫ్ డిజైన్ ఇంజనీర్-1, డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజికల్ కెమిస్ట్రీ-2, అసిస్టెంట్ ఇంజనీర్-54, అసిస్టెంట్ వెటర్నరీ ఆఫీసర్-1, అసిస్టెంట్ డైరెక్టర్-13, అసిస్టెంట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్-2, డిప్యూటీ డైరెక్టర్-1, అసిస్టెంట్ ఇంజనీర్-9, డిప్యూటీ డైరెక్టర్-2.
» **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణత, నిర్దిష్ట అనుభవం ఉండాలి.
» **ఎంపిక:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు ఫీజు:** రూ.25
» **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 2, 2020
» **వెబ్‌సైట్: www.upsc.gov.in**

ఫ్రెంచ్ ఓపెన్ వాయిదా

కరోనా (కోవిడ్-19) దెబ్బకు ఏడాదిలో జరిగే రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ అయిన ఫ్రెంచ్ ఓపెన్ వాయిదా పడింది. మే 18 నుంచి జూన్ 7 మధ్య పారిస్ వేదికగా జరగాల్సిన ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. ఇప్పుడు ఈ టోర్నీ సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4 మధ్య జరగనుంది.

సైనా పయనం ఎంతవరకు?

- ఒలింపిక్ అర్హత టోర్నీలు రద్దు
- దిగజారిన ఫామ్
- వరుస పరాజయాలతో డీలా

(సాక్షి క్రీడా విభాగం)

సైనా నెహ్వాల్ మంగళవారమే తన 30వ పుట్టిన రోజు జరుపుకుంది. తన వ్యక్తిగత జీవితంలో ఒక కీలక దశకు చేరిన తర్వాత ఆమె ముందు ఇప్పుడు పెద్ద సవాల్ నిలిచింది. మరోసారి ఒలింపిక్స్‌లో పాల్గొనాలని పట్టుదలగా ఉన్న నేపథ్యంలో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తీసుకున్న నిర్ణయం ఆమెను ఇబ్బందుల్లో పడేసింది. కరోనా వైరస్ కారణంగా ఏప్రిల్ 12 వరకు జరగాల్సిన అన్ని టోర్నీలను రద్దు చేస్తున్నట్లు బీడబ్ల్యూఎఫ్ ప్రకటించింది. రాబోయే టోర్నీలలో రాణించి ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలనుకుంటున్న షట్లర్లను ఇది షాక్‌కు గురి చేసింది. మంగళవారం జరిగిన కీలక సమావేశం అనంతరం టోక్యో ఒలింపిక్స్‌ను ఎలాగైనా నిర్వహిస్తామంటూ కమిటీ విస్పష్టంగా ప్రకటించింది. కాబట్టి బ్యాడ్మింటన్‌లో నెలకొన్న తాజా పరిస్థితి ఆందోళన కలిగించేదే.

భారత బ్యాడ్మింటన్‌లో సైనా నెహ్వాల్‌ది ప్రత్యేక స్థానం... దేశవ్యాప్తంగా ఆటపై ఆసక్తి పెంచడంలో, ముఖ్యంగా అమ్మాయిలు బ్యాడ్మింటన్ వైపు ఆకర్షితులు కావడంతో సైనా స్ఫూర్తిగా నిలిచింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో ఆమె కెరీర్ శిఖరానికి చేరగా... పెద్ద సంఖ్యలో సాధించిన విజయాలు, అందుకున్న అవార్డులు, రివార్డులు సైనా స్థాయిని చూపిస్తాయి. అయితే గత కొంత కాలంగా సైనా ఆట అంతంతమాత్రంగానే సాగుతోంది. వరుస పరాజయాలు, ఫిట్‌నెస్ సమస్యలు ఆమెను వెనక్కి తోస్తున్నాయి. రియో ఒలింపిక్స్‌లో వైఫల్యం తర్వాత ఈ సారి మళ్లీ ఒలింపిక్స్‌పై ఆమె గురి పెట్టింది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో అసలు సైనా టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించగలదా అనేది చూడాలి.

వరుస వైఫల్యాలు...

దాదాపు ఏడాది కాలంగా సైనా ప్రదర్శన గొప్పగా లేదు. టోర్నీ విజయాలపరంగా కూడా ఆమె టైటిల్ సాధించి చాలా రోజులైంది. 2019 జనవరిలో ఆమె చివరిసారిగా ఇండోనేసియా మాస్టర్స్ గెలిచింది. అదీ ఫైనల్లో 4-10తో వెనుకబడిన దశలో మారిన్ గాయంతో తప్పుకున్న తర్వాత దక్కింది. అంతకు ముందు చూస్తే 2017 జనవరిలో మలేసియా మాస్టర్స్ ఆమె గెలిచిన చివరి టోర్నీ. ఈ రెండు కూడా సూపర్-500 స్థాయి టోర్నీలే. సైనా ఆట సహజంగానే ఆమె ర్యాంకింగ్‌పై ప్రభావం చూపించింది. 2019లో సరిగ్గా ఇదే సమయంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్న సైనా, ఇప్పుడు 20వ ర్యాంక్‌కు చేరింది. 2020 కూడా ఆమెకు కలిసి రాలేదు. మలేసియా మాస్టర్స్, స్పెయిన్ మాస్టర్స్‌లో క్వార్టర్ ఫైనల్లో ఓడిన సైనా...ఇండోనేసియా మాస్టర్స్, థాయిలాండ్ మాస్టర్స్, ఆల్ ఇంగ్లండ్‌లలో తొలి రౌండ్‌లోనే చిత్తయింది. ఇప్పుడు కీలకమైన ఒలింపిక్స్‌కు ముందు జరిగే టోర్నీలో రాణించాలని భావించిన తరుణంలో టోర్నీల రద్దు ఇబ్బంది కరంగా మారింది.

ప్రస్తుతం 22వ స్థానంలో...

బీడబ్ల్యూఎఫ్ రద్దు చేసిన టోర్నీల్లో స్విస్ ఓపెన్, ఇండియా ఓపెన్ కూడా ఉన్నాయి. ఇందులో స్విస్ సైనాకు గతంలోనూ బాగా కలిసి రాగా... ఈ సారి రెండు టోర్నీల్లోనూ ఆమెకు మంచి 'డ్రా' ఎదురైంది. ఒలింపిక్స్‌కు అర్హత కల్పించే పాయింట్ల ప్రకారం (రేస్ టు టోక్యో) చూస్తే ఆమె ప్రస్తుతం 22వ ర్యాంకులో ఉంది. గత ఏడాది కాలంగా ఆమె ఆడిన 15 టోర్నీల ద్వారా 41,847 పాయింట్లు సైనా ఖాతాలో ఉన్నాయి. కరోనా నేపథ్యంలో బీడబ్ల్యూఎఫ్ రద్దు చేసిన టోర్నీలు జరిగే అవకాశం లేకపోతే... సైనా చేయడానికేమీ ఉండదు! ఎందుకంటే ఒలింపిక్ అర్హత కోసం కటాఫ్ తేదీ అయిన ఏప్రిల్ 30నాటికి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలి 16 స్థానాల్లో ఉన్నవారికే అర్హత లభిస్తుంది. తాజా పరిస్థితుల్లో ఆమె ఆ జాబితాలో రాదు. ఒక వేళ కొన్ని టోర్నీలు జరిగినా ఆమె తన అత్యుత్తమ ప్రదర్శనకు మించి ఇవ్వాల్సి ఉంది. ఫైనల్ లేదా సెమీఫైనల్ చేరితేనే సైనా ఖాతాలో పెద్ద సంఖ్యలో పాయింట్లు చేరతాయి. అయితే ఇటీవలి ఫామ్‌ను చూస్తే ఇది అంత సులువుగా అనిపించడం లేదు. గెలవాలనే పట్టుదల, అందు కోసం ఆమె తగిన విధంగా శ్రమిస్తున్నా కోర్టులో సైనా కదలికల్లో చురుకుదనం తగ్గినట్లే కనిపిస్తోంది. కొత్తగా దూసుకొస్తున్న అమ్మాయిలు చెలరేగిపోతుంటే చాలా సందర్భాల్లో సైనా వారి ముందు బేలగా కనిపిస్తోంది. ఆమె తన అత్యుత్తమ దశను దాటేసినట్లుగా ఇటీవలి ఫలితాలు చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఒలింపిక్ రేసులో ఎంత వరకు ముందుకు వెళ్లగలదనేది చూడాలి.

మంగళవారం తన తండ్రి హర్వీర్ సింగ్‌తో కలిసి ఇంట్లో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న సైనా.

మ్యాక్స్‌వెల్ 'భారతీయ నిశ్చితార్థం'

ఆస్ట్రేలియా క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. భారత సంతతికి చెందిన ఫార్మసిస్ట్ విని రామన్‌తో అతని నిశ్చితార్థం మెల్‌బోర్న్‌లో భారతీయ సాంప్రదాయ శైలిలో ఘనంగా జరిగింది. మ్యాక్స్‌వెల్ తరఫు బంధువులు కూడా చీరకట్టు, కుర్తా, పైజామాలు ధరించి ఈ కార్యక్రమానికి హాజరు కావడం విశేషం.

కోహ్లి దూకుడు నాకిష్టం

మాజీ క్రికెటర్ మదన్ లాల్ వ్యాఖ్య

ముంబై: మైదానంలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి దూకుడుకు ఎంత మంది అభిమానులు ఉన్నారో అదే స్థాయిలో విమర్శకులు ఉన్నారన్నది వాస్తవం. అయితే ఆట సమయంలో అతని ప్రవర్తన, దూకుడు తనకెంతో ఇష్టమని భారత మాజీ క్రికెటర్, క్రికెట్ సలహాదారు కమిటీ (సీఏసీ) సభ్యుడు మదన్ లాల్ అన్నాడు. కోహ్లి సహజ లక్షణం అయిన దూకుడును తగ్గించుకోవాలని అందరూ సూచించడంలో అర్థం లేదని పేర్కొన్నారు. భారత్‌కు కోహ్లినే సరైన కెప్టెన్ అని తన అభిప్రాయాన్ని చెప్పాడు. 'కోహ్లి దూకుడు తగ్గించుకోవాలని అందరూ ఎందుకు అంటున్నారో నాకు అర్థం కావట్లేదు. ఒకప్పుడేమో భారత్‌కు దూకుడైన కెప్టెన్ అవసరముందని అన్నారు. ఇప్పుడేమో కోహ్లిని ఆవేశం తగ్గించుకోమని సూచిస్తున్నారు. టీమిండియాకు దూకుడుగా ఉండటం రాదనేవారు. ప్రస్తుతం ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. మనకు కోహ్లి లాంటి కెప్టెనే సరైనవాడు. మైదానంలో అతని ఆట, ప్రవర్తించే తీరు నాకు నచ్చుతుంది. అతని దూకుడును నేను ఆస్వాదిస్తాను'అని భారత మాజీ ఆల్‌రౌండర్ మదన్ లాల్ వివరించాడు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఇంజినీర్ ఇన్ చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్, CRN NIT No.1920/DCE(R)/EE-R/DEE-4/AEE-2/2020 తేది.12.03.2020
నాన్ ప్లాన్ స్కీమ్ క్రింద 4వ పీలుపు కొరకు (i) మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు (2) పనులు (ii) జోగులాంబ గద్వాల జిల్లాలో మూడు(3) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్లను ఇ మార్కెట్‌ప్లేస్ అంటే https://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది: 26-03-2020న లేదా ఆలోగా మ. 3:30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ఇంజినీర్ ఇన్ చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN
DIPR Ro.No.2672-DP/CL/Advt/1/2019-20, Dt:17-03-2020

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU వరంగల్ (అర్బన్)
NIT No.01 to 41/DMFT/SDF/2019-20 టెండరు ప్రకటన తేది.10.03.2020
పనుల నంబ్యు:41, పనుల పేరు: కమలాపూర్(M)లోని గూడూరు (గ్రా.) వద్ద V.O. మహిళ బిల్డింగ్ నిర్మాణం, వరంగల్ అర్బన్ జిల్లాలో కమలాపూర్ 30 పడకల ఆసుపత్రి (V&M) వద్ద ప్రహరీగోడ నిర్మాణం. అదనపు తరగతి గదుల నిర్మాణం మరియు అన్ని ఇతర సివిల్ పనుల కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ.363.42 లక్షలు. బిడ్డు దాఖలు ప్రారంభ తేది, సమయం: 16-03-2020 రా.9:00 గం., బిడ్డు దాఖలు ముగింపు తేది, సమయం: 23-03-2020 మ.3:00 గం. తదుపరి వివరాలకు దర్శించండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ www.eprocurement.gov.in
ఫోన్ నం. 9059771306
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, వరంగల్ (అర్బన్)
DIPR Ro.No.2668-DP/CL/Advt/1/2019-20, Dt:17-03-2020

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్, హైదరాబాద్
(తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ)
5వ అంతస్తు, పరిశ్రమ భవనం, H No 5-9-58/B ఫతేమైదాన్ రోడ్, హైదరాబాద్-04 ఫోన్: 23238290-250
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
దిగువ తెలిపిన పనుల కోసం చీఫ్ ఇంజినీర్, TSIIC లిమిటెడ్ హైదరాబాద్ వారు బిడ్డు కోరుచున్నారు.
TN.No.46: GAR లక్ష్మి ఇన్‌ఫోటాన్ కోకపేట్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ (ORR) నుంచి కనెక్టివిటీ కల్పించడానికి 450m పొడవు గల 1x7.00m క్యాన్లేటేవ్ PQC నిర్మాణం మరియు చేయుట (IALA ఫండ్స్ క్రింద).
ECV రూ: 85,42,723.00
TN.No.47: HKC, రాయ్‌పుర్ రంగారెడ్డి జిల్లాలో 600m పొడవుకు రోడ్ నం.3 రీఎలైన్‌మెంట్ పనులు అంటే ITC కోహినూర్ ఎదురుగా 250m పొడవుకు రోడ్డు వెడల్పు చేయుట సెంట్రల్ వెర్జ్, ఫుట్‌పాత్ నిర్మాణం (IALA క్రింద).
ECV రూ: 2,67,43,072.00
TN.No.49: పాశమైలారం (గ్రామం) సంగారెడ్డి జిల్లా కోసం Admin R&D ల్యాబ్, QA/QC మరియు పైలట్ ప్లాంట్ కోసం అంతర్గత & వెలుపల విద్యుద్గీకరణ, HVAC, ఫైర్ ఫైటింగ్ పనులు చంటి MEP ఫెసిలిటీ ఏర్పాటు చేయుట.
ECV రూ.1,88,79,829.00
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 19.03.2020న ఉ.11.00 గంటల నుంచి
బిడ్డ దాఖలుకు ఆఖరు తేది : 26.03.2020న మ.3.00 గంటల వరకు.
TN.No.48: పుప్పాలగూడ (గ్రామం) రంగారెడ్డి జిల్లాలో కండ్యూట్ ప్రొటెక్షన్ పనులు మరియు స్టార్మ్ వాటర్ డ్రెయిన్స్ ఏర్పాటు చేయుటతో సర్వే నం.285లో ORR సర్వీస్ రోడ్ మధ్య కనెక్టివిటీ ఏర్పాటు చేయుటకు DBM, BCతో 900m పొడవుకు 2x10.50m క్యాన్లేటేవ్ నిర్మాణం (IALA ఫండ్స్ క్రింద).
ECV రూ: 10,02,67,997.00
TN.No.50: ప్లాస్టిక్ పార్క్, తుమ్మలూర్ (గ్రామం), మహేశ్వరం (మండలం) రంగారెడ్డి జిల్లాలో అప్రోచ్, ఇంటర్నల్, పెరిఫెరల్ రోడ్స్ పొడవునా LED ల్యాంప్ ఫిటింగ్స్‌తో స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు చేయుట
ECV రూ.2,31,96,482.00
బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 19.03.2020న ఉ.11.00 గంటల నుంచి
బిడ్డ దాఖలుకు ఆఖరు తేది : 03.04.2020న మ.3.00 గంటల వరకు.
టెండరు ప్రకటనల వివరాలు మరియు బిడ్ డాక్యుమెంట్లను వెబ్‌సైట్: www.tender.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DIPR Ro.No.926-PP/CL/ADVT/1/2019-20, Dt: 17/03/2020
సం/- చీఫ్ ఇంజినీర్

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
ప్లాట్ నంబరు 9, సర్వే నంబరు 49, IT పార్క్ మంగళగిరి - 522503, గుంటూరు జిల్లా
అమరావతి రీజియన్, ఆంధ్రప్రదేశ్, ఇ-మెయిల్: ce.aphmhidc@gmail.com
టెండరు ప్రకటన నం.15/APMSIDC/2019-20 తేది : 16-03-2020
ఆం.ప్ర.లోని దిగువ తెలిపిన జిల్లాలలోని వివిధ ప్రదేశాలలో హెల్త్ & వెల్‌నెస్ సెంటర్లకోసం కొత్త భవనాల నిర్మాణానికి రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. (2వ పిలుపు) 1) శ్రీకాకుళం జిల్లా (10 ప్యాకేజీలలో 365 నంబర్లు) పనుల విలువ రూ. 6715 లక్షలు 2) విజయనగరం జిల్లా (9 ప్యాకేజీలలో 254 నంబర్లు) పనుల విలువ రూ. 4649 లక్షలు 3) విశాఖపట్నం జిల్లా (13 ప్యాకేజీలలో 399 నంబర్లు) పనుల విలువ రూ. 7389 లక్షలు 4) తూర్పుగోదావరి జిల్లా (16 ప్యాకేజీలలో 393 నంబర్లు) పనుల విలువ రూ. 7369 లక్షలు. 5) పశ్చిమ గోదావరి జిల్లా (15 ప్యాకేజీలలో 425 నంబర్లు) పనుల విలువ రూ. 7982 లక్షలు. 6) కృష్ణా జిల్లా (12 ప్యాకేజీలలో 378 నంబర్లు) పనుల విలువ రూ. 7160 లక్షలు. 7) గుంటూరు జిల్లా (15 ప్యాకేజీలలో 414 నంబర్లు) పనుల విలువ రూ. 7821 లక్షలు. 8) ప్రకాశం జిల్లా (10 ప్యాకేజీలలో 357 నంబర్లు) పనుల విలువ రూ. 6389 లక్షలు. 9) నెల్లూరు జిల్లా (9 ప్యాకేజీలలో 345 నంబర్లు) పనుల విలువ రూ. 6432 లక్షలు. 10) చిత్తూరు జిల్లా (14 ప్యాకేజీలలో 408 నంబర్లు) పనుల విలువ రూ.7513 లక్షలు. 11) కడప జిల్లా (10 ప్యాకేజీలలో 317 నంబర్లు) పనుల విలువ రూ. 5833 లక్షలు. 12) అనంతపురం జిల్లా (13 ప్యాకేజీలలో 274 నంబర్లు) పనుల విలువ రూ.5051 లక్షలు. 13) కర్నూలు జిల్లా (13 ప్యాకేజీలలో 402 నంబర్లు) పనుల విలువ రూ.7521 లక్షలు. ఇతర వివరాలను వెబ్‌సైట్ http://msidc.ap.nic.in నందు చూడగలరు.
సం/-మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO. No. 442PP/CL/ADVT/1/1/2019-20, DT.17-03-2020

'గేమ్స్‌ను జరిపి తీరుతాం'

ఐఓసీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం

టోక్యో: కొవిడ్-19 విలయతాండవం చేస్తున్నప్పటికీ ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌ను నిర్వహించడమే లక్ష్యంగా అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించింది. టోక్యో ఈవెంట్‌కు ఇంకా నాలుగు నెలలు సమయం ఉండటంతో ఇప్పటికిప్పుడు ఎలాంటి అనుచిత, అసాధారణ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదని ఐఓసీ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ అభిప్రాయపడింది. ఈ అత్యున్నత సమావేశంలో ఐఓసీ స్టేక్ హోల్డర్లు, అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ, వివిధ దేశాలకు చెందిన జాతీయ ఒలింపిక్ కమిటీ, క్రీడాసమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు. అయితే అందరి సంరక్షణకే తమ తొలి ప్రాధాన్యమని, ఆరోగ్యకరమైన వాతావరణంలోనే ఆటలు సాగుతాయని ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాచ్ తెలిపారు. వైరస్ వ్యాప్తిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే కార్యాచరణ కొనసాగిస్తామని చెప్పారు. ప్రత్యేక సమావేశంలో అసంపూర్తిగా ఉన్న క్వాలిఫికేషన్ ప్రక్రియను ఎలా పూర్తిచేయాలన్న దానిపై చర్చించారు. ఇప్పటివరకైతే 57 శాతం మంది క్రీడాకారులు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సంపాదించారు. ఇంకా 43 శాతం మంది అర్హత సాధించాల్సి వుంది. ప్రధానంగా దీనిపైనే ఐఓసీ సమావేశంలో చర్చించారు. సమావేశంలోని ప్రతిపాదనల్ని ఐఓసీ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్‌తో పాటు పాల్గొన్న ప్రతి అంతర్జాతీయ క్రీడా సమాఖ్య ఏకగ్రీవంగా ఆమోదించింది.

చర్చలోని ప్రధానాంశాలు

- ఇప్పటివరకు ఖరారైన కోటా స్థానాల్ని సంబంధిత అథ్లెట్లకు, సమాఖ్యలకు కేటాయించారు. దీనిపై ఏ సమస్యా లేదు.
- ఇక మిగిలిన క్వాలిఫికేషన్ ఈవెంట్లను పూర్తి చేసేందుకు అవలంభించాల్సిన పద్ధతుల్ని, సాధ్యాసాధ్యాల్ని సంబంధిత క్రీడా సమాఖ్యలతో పరిశీలిస్తారు.
- ఆన్ ఫీల్డ్ ఫలితాలు లేదంటే ర్యాంకింగ్, గడిచిన అత్యుత్తమ ఫలితాల ఆధారంగా బెర్తులిచ్చే అంశాల్ని పరిశీలించనున్నారు.
- ఈ పద్ధతుల్లో అథ్లెట్ల కోటా పెరిగితే ప్రతి కేసును, ఆయా పరిస్థితుల్ని కూలంకషంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు.

కరోనా హైరానా...

- 'జ్యోతి' దారి కుదింపు



టోక్యో: ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌కు ముందు టార్చ్ రిలే (ఒలింపిక్ జ్యోతి) చేసే హంగామా అంతా ఇంతా కాదు. ప్రపంచ దిగ్గజాలు చేతబూనే ఈ జ్యోతి ఎక్కడికెళ్లినా విశేష ఆదరణ లభిస్తుంది. అలాంటి రిలేకు కరోనా పెద్ద కష్టమే తెచ్చింది. అసాంతం, అద్వితీయంగా సాగే రీలే ఇప్పుడు మాత్రం కుదించిన రూట్లలో అది కూడా పరిమిత సంఖ్యలోనే హాజరయ్యే వారితో ముగించాలని టోక్యో-2020 ఆర్గనైజింగ్ కమిటీ నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ జన సమూహానికి అవకాశమివ్వరాదని, ఎవరూ కూడా గుమిగూడి చూడాల్సిన అవసరం లేదని దానివల్ల కరోనా ముప్పు పొంచి వుందని నిర్వాహకులు హెచ్చరికలు జారీచేశారు.

- **జపాన్ ఒలింపిక్ కమిటీ డిప్యూటీ చీఫ్‌కు వైరస్**

టోక్యో: ఓ వైపు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఏమో గేమ్స్‌ను జరిపి తీరాల్సిందేననే పట్టుదలతో ఉంటే... మరోవైపు నిర్వాహక దేశానికి చెందిన కమిటీ డిప్యూటీ చీఫ్ కొజో తషిమా కరోనా బారిన పడ్డారు. తనకు నిర్వహించిన కోవిడ్-19 పరీక్షల ఫలితాలు పాజిటివ్‌గా వచ్చాయని ఆయన వాపోయారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు.

- **ఫుట్‌బాల్ యువ కోచ్ మృతి**

మాడ్రిడ్: కరోనా వైరస్ స్పెయిన్‌కు చెందిన 21 ఏళ్ల యువ ఫుట్‌బాల్ కోచ్‌ను బలి తీసుకుంది. ఫ్రాన్సిస్కా గార్సియా కొవిడ్-19తో మృతి చెందినట్లు స్పానిష్ లీగ్ వర్గాలు తెలిపాయి.

- **అన్ని శిబిరాలు వాయిదా: రిజిజు**

భారత్‌లోనూ కరోనా వైరస్ చాపకింద నీరులా విజృంభిస్తుండటంతో దేశంలో అన్ని రకాల శిక్షణ శిబిరాలను వాయిదా వేస్తున్నట్లు కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఒలింపిక్స్ సన్నాహక శిబిరాలు మాత్రమే యథాతథంగా కొనసాగుతాయని ఆయన చెప్పారు.

- భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా టర్కీలో తన శిక్షణను అర్ధాంతరంగా ముగించుకొని తిరుగుముఖం పట్టాడు. టోక్యో ఈవెంట్‌కు అర్హత సంపాదించిన ఇతను గత నెల రోజులుగా టర్కీలో శిక్షణ పొందుతున్నాడు.

క్రికెటర్ హేల్స్‌కు కరోనా?

పాకిస్తాన్ సూపర్ లీగ్ రద్దు

కరాచీ: కరోనా వైరస్‌తో ప్రపంచమే ఆగిపోయింది. ఆటలన్నీ వాయిదా పడినా... లీగ్ దశ దాకా పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) నిర్విరామంగా సాగింది. మంగళవారం రెండు సెమీస్ మ్యాచ్‌లు, బుధవారం ఫైనల్‌తో ఈ లీగ్‌కు శుభం కార్డు పడాల్సివుంది. అయితే ఈ 'మహమ్మారి' బారిన ఓ విదేశీ క్రికెటర్ పడటంతో లీగ్ అర్ధాంతరంగా వాయిదా పడింది. ఇంగ్లండ్ ప్లేయర్ అలెక్స్ హేల్స్‌కు కరోనా లక్షణాలు ఉన్నట్లు తెలియడంతో సెమీస్, ఫైనల్స్ పోటీల్ని వాయిదా వేస్తున్నట్లు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సీఈఓ వసీమ్ ఖాన్ తెలిపారు. 'పాక్ నుంచి తిరుగుముఖం పట్టిన హేల్స్ తనకు కరోనా లక్షణాలున్నట్లు మాకు సమాచారమిచ్చాడు. దీంతో పలు వర్గాలతో సంప్రదింపులు జరిపాక లీగ్‌ను వాయిదా వేయాలని నిర్ణయించాం' అని ఆయన చెప్పారు. పాకిస్తాన్ మాజీ కెప్టెన్ రమీజ్ రజా మాట్లాడుతూ లీగ్ మొదలైనప్పటినుంచి ఎలాంటి అనుమానిత కేసులు లేకపోవడంతో సజావుగానే సాగిందని, కానీ 31 ఏళ్ల హేల్స్‌కు కరోనా లక్షణాలు బయటపడటంతో కలకలం రేగిందని... ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇప్పుడు పీఎస్ఎల్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కరోనా పరీక్షలు చేయనున్నామని ఆయన చెప్పారు. పీఎస్ఎల్‌లో మొత్తం 34 మంది విదేశీ ఆటగాళ్లు పాల్గొన్నారు. వారంతా కరోనా భయాందోళనలతో ఇదివరకే స్వదేశాలకు చేరారు. ఇప్పుడున్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఒప్పందాలు, వ్యవహారాలను పక్కనబెట్టి వెళ్లాలనుకున్నవారిని పంపించామని రమీజ్ రజా తెలిపారు. పాకిస్తాన్‌లోనూ కరోనా కేసులు నమోదు కావడంతో బంగ్లాదేశ్‌తో వచ్చే నెలలో జరగాల్సిన వన్డే, టెస్టు సిరీస్‌లను పీసీబీ రద్దు చేసింది. అలాగే ఈ నెల 25 నుంచి జరగాల్సిన నేషనల్ వన్డే కప్‌ను కూడా సస్పెండ్ చేసింది. ఇంగ్లండ్ చేరుకున్న అనంతరం హేల్స్ తన స్పందన తెలియజేశాడు. తాను ఇంకా కరోనా పరీక్షలకు హాజరు కాలేదని, పాజిటివ్ అంటూ వచ్చిన వార్తల్లో కూడా నిజం లేదని స్పష్టం చేశాడు. అయితే జ్వరంతో పాటు సాధారణం కంటే భిన్నమైన లక్షణాలు తనలో కనిపించడంతో ముందు జాగ్రత్తగా అందరికీ దూరంగా ఉంటున్నట్లు అతను వెల్లడించాడు.

టి20 ప్రపంచ కప్ నిర్వహణపై ఆసీస్ దృష్టి

ముందు జాగ్రత్త చర్యల్లో నిమగ్నమైన సీఏ

మెల్‌బోర్న్: కరోనా వైరస్ కారణంగా టోర్నీలన్నీ రద్దవుతున్నప్పటికీ క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మాత్రం అక్టోబర్‌లో ఆసీస్ వేదికగా జరిగే టి20 ప్రపంచ కప్ మెగా టోర్నీపై దృష్టి సారించింది. ఈ మహమ్మారి కారణంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో జరగాల్సిన క్రీడా ఈవెంట్లన్నీ రద్దయ్యాయి. అయితే వరల్డ్ కప్ నిర్వహణ సజావుగా సాగేట్లుగా క్రికెట్ ఆస్ట్రేలియా ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటోంది. టోర్నీకి ఆతిథ్యమిచ్చే మైదానాలను సంరక్షించడంతో పాటు నిధులను పద్ధతి ప్రకారం కూడబెడుతున్నట్లు సీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెవిన్ రాబర్ట్స్ తెలిపారు. 'కరోనా కారణంగా రాబోయే నెలల్లో ఏం జరుగుతుందో చెప్పలేం. నిపుణుల సలహా మేరకు మేం నడచుకుంటున్నాం. ప్రపంచ కప్ నిర్వహణకు మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను పరిశీలిస్తున్నాం' అని అన్నారు. అక్టోబర్ 18-23 వరకు జరిగే ప్రి క్వాలిఫయర్స్‌తో ప్రపంచకప్‌కు తెరలేస్తుంది. 24న ప్రధాన టోర్నీ ప్రారంభమవుతుంది. నవంబర్ 15న ఎంసీజీలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.





ఐపీఎల్‌కూ ఆసీస్ ఆటగాళ్లు దూరం!

ఒక వేళ ఐపీఎల్ జరిగితే అందులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు పాల్గొనేది అనుమానంగా మారింది. కరోనా నేపథ్యంలో ఈ టోర్నీలో పాల్గొనాలా? వద్దా? అనేది ఆలోచించి... పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయం తీసుకోవాలని ఆటగాళ్లకు సీఏ చీఫ్ కెవిన్ సూచించారు. మొత్తం 17 మంది ఆసీస్ ప్లేయర్లు ఐపీఎల్‌లో భాగంగా ఉన్నారు. ఈ టోర్నీలో తమ ఆటగాళ్లు పాల్గొనే అవకాశం ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై క్రికెట్ ఆస్ట్రేలియా సమీక్షిస్తున్నట్లు అక్కడి వార్తా పత్రికలు పేర్కొన్నాయి. ప్యాట్ కమిన్స్, స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, గ్లెన్ మ్యాక్స్‌వెల్‌లను తమ కాంట్రాక్టులను వదులుకోమని సీఏ అడిగే అవకాశాలున్నట్లు కూడా అందులో ప

సాక్షి బిజినెస్
బుధవారం
18-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
811 ▼	230 ▼
30,579	8,967

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు 11.30గంటలకు)

నాస్‌డాక్	7,141	▲ 235
డోజోన్స్	20,635	▲ 447
ఎఫ్‌టీఎస్‌ఈ 100	5,295	▲ 114
డాక్స్	8,939	▲ 197
షాంఘై	2,779	▼ 10
నికాయ్	17,011	▲ 9

అమెరికా, బ్రిటన్, జర్మనీ, చైనా, జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$ యూఎస్ డాలర్	ఫామ్‌కుకి	71.86	76.51
£ బ్రిటన్ పౌండ్	ఫామ్‌కుకి	87.49	92.25
€ యూరో	ఫామ్‌కుకి	79.14	84.20
¥ జపాన్ ఎన్ (100)	ఫామ్‌కుకి	59.00	76.00
AU$ ఆస్ట్రేలియా డాలర్	ఫామ్‌కుకి	42.59	46.48
S$ సింగపూర్ డాలర్	ఫామ్‌కుకి	50.29	53.93
SAR సౌదీ రియాల్	ఫామ్‌కుకి	18.75	20.61
UAE D యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుకి	18.88	21.11
¥ చైనా యువాన్	ఫామ్‌కుకి	9.44	11.21

'ఇన్నోవా క్రిస్టా' లిమిటెడ్ ఎడిషన్ @ 21.21 లక్షలు

న్యూఢిల్లీ: వాహన తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) తన పాపులర్ మల్టీ-పర్పస్ వెహికల్ (ఎంపీవీ) 'ఇన్నోవా క్రిస్టా'లో లిమిటెడ్ ఎడిషన్‌ను మంగళవారం మార్కెట్లోకి విడుదలచేసింది. భారత్ స్టేజ్ (బీఎస్)-6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఈ వాహనం ధర రూ. 21.21 లక్షలుగా ప్రకటించింది. 2.4 లీటర్ల డీజిల్, 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వంటి ఫీచర్లతో లీడర్‌షిప్ ఎడిషన్ పేరిట దీనిని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా టీకేఎం సేల్స్ అండ్ సర్వీస్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ సోని మాట్లాడుతూ.. 'ఎంపీవీ సెగ్మెంట్‌లో ఈ వాహనం 50 శాతం వాటాను కలిగిఉంది. ఇందుకు సంకేతంగా లీడర్‌షిప్ ఎడిషన్‌ను విడుదలచేశాం' అని వ్యాఖ్యానించారు.

ఫోర్డ్ ఇండియా ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సౌలభ్యం

న్యూఢిల్లీ: అమెరికా వాహన దిగ్గజం ఫోర్డ్ మోటార్స్ తన భారత ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఫెసిలిటీని కల్పిస్తోంది. కోవిడ్-19(కరోనా) వైరస్ కంపెనీలో వ్యాపించకుండా ఉండేందుకు ఇక్కడి 10,000 మంది ఉద్యోగులకు ఈ సౌకర్యం కల్పించినట్లు ప్రకటించింది. ఫోర్డ్ ఫెసిలిటీలోనే పనిచేయాల్సిన ఉద్యోగులను మినహాయించి మిగిలిన వారికి ఈ అవకాశం ఇచ్చినట్లు వివరించింది. ఇదే విధంగా వోల్వో కార్ ఇండియా కూడా తన ఉద్యోగుల్లో 40 మందికి వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం ఇచ్చింది.

నిధుల సమస్య నో!!

- ఏటీఎంలు, బ్యాంక్ శాఖల్లో పుష్కలంగా నగదు ఉంది
- బుధవారం సాయంత్రం నుంచి అన్ని సేవల పునరుద్ధరణ
- బ్యాంక్ ఖాతాల ఫోరెన్సిక్ ఆడిట్ అక్కర్లేదు
- యస్ బ్యాంక్ 'సీఈవో' ప్రశాంత్ కుమార్ వెల్లడి

ముంబై: ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ నేటి సాయంత్రం నుంచి అన్ని బ్యాంకింగ్ సేవలను పునరుద్ధరించనుంది. నిధులపరమైన సమస్యలేమీ లేవని, బుధవారం సాయంత్రం 6 గం.ల నుంచి సర్వీసులన్నీ అందుబాటులోకి వస్తాయని సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్న ప్రశాంత్ కుమార్ తెలిపారు. 'అన్ని జాగ్రత్త చర్యలూ తీసుకున్నాం. మా ఏటీఎంలలో పుష్కలంగా నగదు నిల్వలు ఉంచాం. అలాగే, శాఖలన్నింటికీ తగినంత స్థాయిలో నగదు సరఫరా ఉంది. కనుక.. బ్యాంక్‌కు సంబంధించి నిధులపరంగా ఎలాంటి సమస్యా లేదు. ఇతరత్రా బైటి నుంచి సమీకరించాల్సిన అవసరమైతే లేదు. కానీ ఒకవేళ అవసరమైనా కూడా తక్షణం తగినంత స్థాయిలో నిధులను సమకూర్చుకోగలిగే మార్గాలు ఉన్నాయి' అని ఆయన చెప్పారు. బుధవారం సాయంత్రం మారటోరియం ఎత్తివేశాక.. ఖాతాదారులు పూర్తి స్థాయిలో బ్యాంకింగ్ సర్వీసులను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. మారటోరియం వ్యవధిలో నిర్దిష్ట పరిమితి రూ. 50,000 స్థాయిలో విత్‌డ్రా చేసుకున్న వారి సంఖ్య.. మొత్తం ఖాతాదారుల్లో మూడో వంతు మాత్రమే ఉండవచ్చని కుమార్ చెప్పారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యస్ బ్యాంక్‌లో ఇన్వెస్ట్ చేసిన ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్, ఫెడరల్ బ్యాంక్ చీఫ్ అశుతోష్ ఖజూరియాతో పాటు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

మూడేళ్ల లాకిన్

వ్యవధి పూర్తి కాకుండా యస్ బ్యాంకులో ఒక్క షేరు కూడా విక్రయించబోమని ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్

ఒక్క షేరూ విక్రయించం: రజనీష్

స్పష్టం చేశారు. ప్రస్తుతం 42 శాతం వాటాలు తీసుకున్నామని, రెండో విడత ఫండింగ్‌లో దీన్ని 49 శాతానికి పెంచుకోనున్నామని ఆయన చెప్పారు.

13 రోజుల్లోనే పరిష్కారం..

యస్ బ్యాంక్ పునరుద్ధరణ ప్రణాళిక గురించి స్పందిస్తూ.. ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్, ఇతర ఆర్థిక సంస్థల తోడ్పాటుతో 13 రోజుల్లోనే సంక్షోభం పరిష్కారమైనట్లు కుమార్ చెప్పారు. యస్ బ్యాంక్‌ను గట్టెక్కించే ప్రయత్నాల్లో భాగంగా మార్చి 5న సుమారు నెల రోజుల పాటు రిజర్వ్ బ్యాంక్ మారటోరియం విధించింది. ఈ వ్యవధిలో రూ. 50,000కు మించి విత్‌డ్రా చేసుకోవడానికి లేకుండా ఆంక్షలు విధించింది. బ్యాంకు బోర్డును రద్దు చేసి వ్యవహారాలను పర్యవేక్షించేందుకు అడ్మినిస్ట్రేటరుగా ఎస్‌బీఐ మాజీ సీఎఫ్‌వో ప్రశాంత్ కుమార్‌ను నియమించింది. మరోవైపు, బ్యాంకులోకి పెట్టుబడులు వచ్చేందుకు చర్యలు తీసుకుంది. పునరుద్ధరణ ప్రణాళిక ప్రకారం ఎనిమిది బ్యాంకులు యస్ బ్యాంక్‌లో రూ. 10,000 కోట్ల మేర ఇన్వెస్ట్ చేశాయి. ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అత్యధికంగా రూ. 6,050 కోట్లు ఇన్వెస్ట్ చేసింది.

రికవరీపై ఆశలు...

ముందు జాగ్రత్త చర్యగా సందేహాస్పద ఖాతాలన్నింటినీ క్యూ3 ఆర్థిక ఫలితాల్లో పొందుపర్చినందున యస్ బ్యాంక్ ఖాతాలను ఫోరెన్సిక్ ఆడిట్ చేయాల్సిన అవసరం లేదని ప్రశాంత్ కుమార్ చెప్పారు. మొండిబాకీలకు సంబంధించి ప్రొవిజనింగ్‌ను 42 శాతం నుంచి పెంచి.. 72 శాతం పైగా చేశామని, మార్చి త్రైమాసికంలో రూ. 8,500-10,000 కోట్ల దాకా రికవరీలు అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు. డిపాజిట్లు, రుణాల్లో 60 శాతం వాటాను రిటైల్ విభాగం నుంచి రాబట్టాలంటూ తమ సిబ్బందికి సూచించినట్లు ప్రశాంత్ తెలిపారు. యస్ బ్యాంక్‌కు ప్రస్తుతమున్న మొండిబాకీల్లో 90 శాతం పైగా బాకీలు డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల్లో జతయినవే కావడం గమనార్హం. ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో రూ. 36,764 కోట్ల మేర మొండిబాకీలు పెరిగాయి. డిసెంబర్ క్వార్టర్‌లో స్థూల మొండి బాకీలు రూ. 40,709 కోట్లకు, ప్రొవిజనింగ్ రూ. 29,594 కోట్లకు పెరిగాయి.

మరోవైపు, షేర్లపై లాకిన్ విధించడాన్ని సవాలు చేస్తూ రిటైల్ ఇన్వెస్టర్లు యస్ బ్యాంకు, ఆర్‌బీఐలపై కోర్టుకు వెళ్లనున్నారన్న వార్తలపై రజనీష్, ప్రశాంత్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అలాగే ఇకపైనా పొదుపు ఖాతాలపై అధిక స్థాయిలో వడ్డీ చెల్లిస్తారా అన్న ప్రశ్నకు సమాధానమివ్వకుండా దాటవేశారు. మరోపక్క, యస్ బ్యాంకులో రూ. 1,000 కోట్ల పెట్టుబడులతో 7.97% వాటా కొనుగోలు చేసినట్లు ఐసీఐసీఐ బ్యాంకు వెల్లడించింది. హెచ్‌డీఎఫ్‌సీ 7.97%, యాక్సిస్ 4.78%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 3.98 శాతం, ఫెడరల్ బ్యాంక్.. బంధన్ బ్యాంక్ చెరి 2.39%, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 1.99% వాటాలు కొనుగోలు చేశాయి.

యస్ బ్యాంక్ షేర్ జోరు కొనసాగుతోంది.

బ్యాంక్ రేటింగ్‌ను అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ, మూడీస్ అప్‌గ్రేడ్ చేయడంతో మంగళవారం

మూడో రోజూ షేరు జోరు...

యస్ బ్యాంక్ షేర్ 58% లాభంతో రూ.58.65కు చేరింది. ఇంట్రాడేలో 73% లాభంతో రూ.64కు ఎగసింది. 3 రోజుల్లో 134%లాభపడింది.

రాణా కపూర్‌పై కొత్తగా మరో కేసు..

యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్, ఆయన భార్యపై ఈడీ కొత్తగా మరో కేసు నమోదు చేసింది. అవంతా రియల్టీ గ్రూప్ సంస్థలకు యస్ బ్యాంక్ ద్వారా రూ. 1,900 కోట్ల రుణాలిచ్చినందుకు గాను .. వారు రూ. 307 కోట్ల మేర ముడుపులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీలో ఒక బంగ్లాను మార్కెట్ రేటులో సగం ధరకే దక్కించుకోవడం ద్వారా వారు లబ్ధి పొందినట్లు ఈసీఐఆర్‌లో ఈడీ పేర్కొంది. మొండిబాకీల వసూలు విషయంలో కాస్త ఉదారంగా వ్యవహరించినందుకు గాను కొన్ని బడా కార్పొరేట్ల నుంచి కపూర్‌కు ముడుపులు ముట్టాయంటూ ఈడీ ఇప్పటికే ఒక కేసు నమోదు చేసింది.

ఈడీ విచారణకు హాజరు కాని వాధ్వాన్ సోదరులు..

యస్ బ్యాంక్ ప్రమోటరు రాణా కపూర్‌పై మనీలాండరింగ్ కేసు విచారణకు సంబంధించి ప్రశ్నించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసినప్పటికీ.. డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లయిన వాధ్వాన్ సోదరులు (కపిల్, ధీరజ్) మాత్రం హాజరు కాలేదు. దీంతో కొత్తగా సమన్లు జారీ చేయడంతో పాటు, మరో కేసులో కపిల్ వాధ్వాన్‌కి ఇచ్చిన బెయిల్‌ను కూడా రద్దు చేయాలంటూ కోర్టును ఈడీ కోరనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యస్ బ్యాంక్ నుంచి డీహెచ్‌ఎఫ్‌ఎల్ తీసుకున్న రూ. 3,700 కోట్లు ప్రస్తుతం మొండిబాకీలుగా మారాయి. కార్పొరేట్లకు యస్ బ్యాంకు నుంచి రుణాలిప్పించినందుకు గాను రాణా కపూర్ రూ. 4,300 కోట్ల మేర ముడుపులు అందుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

2020లో భారత్ వృద్ధి 5.3 శాతమే!

- ఇంతక్రితం 5.4 శాతం అంచనాకు కోత
- కరోనా ప్రభావం ఉంటుందని విశ్లేషణ



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి రేటు 2020లో 5.3 శాతమే ఉంటుందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజ సంస్థ.. మూడీస్ తాజాగా అంచనావేసింది. ఫిబ్రవరిలో వేసిన 5.4 శాతం అంచనాలను 10 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) మేర కుదించింది. అంచనాల కుదింపునకు కోవిడ్-19(కరోనా) వైరస్ ప్రభావాన్ని కారణంగా చూపడం గమనార్హం. 2020 భారత్ వృద్ధి అంచనాలను మూడీస్ తగ్గించడం ఇది వరుసగా రెండవసారి. తొలుత 6.6 శాతం అంచనాలను ఫిబ్రవరిలో 5.4 శాతానికి కుదించడం జరిగింది. తాజాగా దీనిని 5.3 శాతానికి తగ్గించింది. 2020లో భారత్ జీడీపీ 5.3 శాతం. 2018లో ఈ రేటు 7.4 శాతంగా ఉంది. తాజా నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే...

- 2021లో వృద్ధి రేటు కాస్త పుంజుకుని 5.8 శాతంగా నమోదు కావచ్చు.
- కరోనా వైరస్ వల్ల దేశీయంగా డిమాండ్ గణనీయంగా పడిపోయే అవకాశం ఉంది. వస్తు సేవల సరఫరా చైన్లలో అంతర్జాతీయంగా తీవ్ర విఘాతం ఏర్పడ్డం దీనికి కారణం.
- పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే కరోనా ప్రభావంతో అంతర్జాతీయ మందగమన పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశం ఉంది. మరోవైపు మందగమన ధోరణులను ఎదుర్కొనడానికి ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, సెంట్రల్ బ్యాంకులు తీసుకుంటున్న చర్యలు ఏ మేరకు ఫలితాలు ఇస్తాయన్న అంశాలను వేచిచూడాల్సి ఉంది.
- ఇక అతి తక్కువ స్థాయి చమురు ధరల విషయానికి వస్తే, చమురు ఎగుమతి దేశాల ఆర్థిక వ్యవస్థలపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించకపోవచ్చు. అయితే దిగుమతి దేశాలకు వాణిజ్య లోటుకు సంబంధించి ఇది ఊరటనిస్తుంది.

కోవిడ్ నష్టం... క్రూడ్ లాభం!

కాగా, కోవిడ్-19 వల్ల భారత్ ఆర్థిక వ్యవస్థకు కలిగిన నష్టాన్ని తక్కువ స్థాయి క్రూడ్ ధర 'తగిన భారీ స్థాయిలోనే' సర్దుబాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు మంగళవారం పేర్కొన్నారు. 2020-21లో ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలతలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్దీపన చర్యలు వృద్ధికి కొంత మేర ఊపునిస్తాయని భావిస్తున్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు.

విదేశాలకు గోఎయిర్ సర్వీసులు రద్దు

ముంబై: కరోనా వైరస్ భయాలతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పడిపోవడంతో విదేశాలకు ఫ్లయిట్ సేవలు నిలిపివేస్తున్నట్లు చౌక చార్జీల విమానయాన సంస్థ గోఎయిర్ మంగళవారం వెల్లడించింది. మార్చి 17 నుంచి ఏప్రిల్ 15 దాకా సర్వీసులు ఉండవని పేర్కొంది. దీంతో రోజువారీ ఫ్లయిట్ల సంఖ్య 325 నుంచి 280కి తగ్గుతుంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని వినియోగించుకునే క్రమంలో.. ఉద్యోగులకు రొటేషనల్ ప్రాతిపదికన స్వల్పకాలికంగా, తాత్కాలిక సెలవులు కూడా ఇస్తున్నట్లు గోఎయిర్ వివరించింది. ఈ వ్యవధిలో జీతభత్యాలు ఉండవు. దీంతో పాటు ఉద్యోగుల వేతనాలను క్రమంగా 20 శాతం మేర తగ్గించాలని గోఎయిర్ యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

దివాలా అంచున ఎయిర్‌లైన్స్ ..

కరోనా వైరస్ కారణంగా ప్రయాణికుల సంఖ్య పడిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలు సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. బ్రిటన్‌కు చెందిన ఫ్లైబీ సంస్థ ఇప్పటికే దివాలా తీయగా.. ఈ ఏడాది మే ఆఖరు నాటికి చాలా ఎయిర్‌లైన్స్ మూతపడే ప్రమాదముందని మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ సీఏపీఏ హెచ్చరించింది. పలు విమానయాన సంస్థలు ఉద్యోగాల్లో కోతకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలకు 50 బిలియన్ డాలర్ల బెయిలవుట్ ప్యాకేజీ ఇవ్వాలంటూ అమెరికాలోని ఎయిర్‌లైన్స్ సంస్థల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది.

విమానరంగ నియంత్రణ సంస్థలకు మరిన్ని అధికారాలు

పౌర విమానయాన రంగ నియంత్రణ సంస్థలైన డీజీసీఏ, బీసీఏఎస్, ఏఏఐబీ మొదలైన వాటికి మరిన్ని అధికారాలు, చట్టబద్ధత కల్పించేందుకు ఉద్దేశించిన ఎయిర్‌క్రాఫ్ట్ (సవరణ) బిల్లు 2020ని పార్లమెంటు ఆమోదించింది. విమాన యాన రంగ సంస్థలు .. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో విధించే జరిమానాను రూ. 10 లక్షల నుంచి రూ. 1 కోటికి పెంచడం తదితర ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. కరోనా వైరస్‌పరమైన సవాళ్ల నుంచి విమానయాన రంగం సత్వరం బైటికి రాగలదని పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్ పురి ధీమా వ్యక్తం చేశారు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9, 10గ్రా)	41,160	▼ 1050
బంగారం (99.5, 10గ్రా)	39,200	▼ 1000
వెండి (కిలో)	38,100	▼ 2700
హైదరాబాద్/చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	40,110	▼ 1290
బంగారం (22 క్యారెట్లు)	38,200	▼ 1230
వెండి (కిలో)	38,100	▼ 2700
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	41,200	▼ 1000
బంగారం (22 క్యారెట్లు)	38,250	▼ 920
వెండి (కిలో)	38,500	▼ 3400
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	42,300	
బంగారం (22 క్యారెట్లు)	38,700	
వెండి (కిలో)	38,000	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	41,320	▼ 1370
బంగారం (22 క్యారెట్లు)	38,200	▼ 1230
వెండి (కిలో)	36,700	▼ 3000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన పాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	28.49 (రాత్రి 11.30కు)	$ 29.00 (సోమవారం ముగింపు)
బ్రెంట్	29.38 (రాత్రి 11.30కు)	$ 30.05 (సోమవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 18-3-2020

విశాఖ	300-00
చిత్తూరు	263-00
వరంగల్	253-00
విజయవాడ	290-00
గోదావరి	290-00
17-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	250-00

9,000 దిగువకు నిఫ్టీ

కొనసాగుతున్న 'కోవిడ్' పతనం

- చివరి గంట వరకూ లాభాల్లోనే మార్కెట్
- చివర్లో వెల్లువెత్తిన అమ్మకాలు
- 32,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్
- 811 పాయింట్ల పతనంతో 30,579 వద్ద ముగింపు
- 9,000 పాయింట్ల దిగువకు నిఫ్టీ
- 230 పాయింట్ల నష్టంతో 8,967 వద్ద ముగింపు

కోవిడ్-19(కరోనా) వైరస్ కల్లోలం కొనసాగుతోంది. ఈ వైరస్ కల్లోలం అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందన్న భయాలతో ప్రపంచ మార్కెట్లు పతనమవుతున్నాయి. మంగళవారం చివరి గంట వరకూ లాభాల్లోనే ఉన్న మన మార్కెట్ చివరకు నష్టాల్లోనే ముగిసింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 31,000 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 9,000 పాయింట్ల దిగువకు పడిపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం ప్రతికూల ప్రభావం చూపించాయి. ఇంట్రాడేలో 658 పాయింట్లు ఎగసిన సెన్సెక్స్ చివరకు ఆ లాభాలన్నింటినీ కోల్పోయి 811 పాయింట్లు క్షీణించి 30,579 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 230 పాయింట్లు పతనమై 8,967 పాయింట్ల వద్దకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ సూచీలు మూడేళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఎఫ్ఎమ్‌సీజీ రంగ షేర్లలో కొనుగోళ్లు కనిపించగా, బ్యాంక్, ఐటీ, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్, నిఫ్టీలు చెరో 10 శాతం పతనమయ్యాయి.

1,653 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్: సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఇటీవల భారీ పతనం కారణంగా ధరలు తగ్గి ఆకర్షణీయంగా ఉన్న పలు షేర్లలో కొనుగోళ్లు (వేల్యూ బయింగ్)జోరుగా సాగాయి. దీంతో సెన్సెక్స్ 658 పాయింట్ల లాభంతో 32,048 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ట స్థాయిని తాకింది. అయితే కోవిడ్-19 వైరస్ కల్లోలం ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందనే ఆందోళనలదే పై చేయి కావడంతో సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోకి జారిపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 995 పాయింట్లు నష్టపోయి 30,395 పాయింట్ల వద్ద కనిష్ట స్థాయిని తాకింది. మొత్తం మీద రోజంతా 1,653 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. మంగళవారం నాటి రూ.4,045 కోట్ల అమ్మకాలను కూడా కలుపుకుంటే ఈ నెలలో ఇప్పటివరకూ విదేశీ ఇన్వెస్టర్లు రూ. 38,189 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

సోమవారం అమెరికా స్టాక్‌సూచీలు అతలాకుతలమయ్యాయి. ఫండ్స్ రేట్‌ను అమెరికా ఫెడరల్ రిజర్వ్ సున్నా స్థాయికి తగ్గించినప్పటికీ, డోజోన్స్, నాస్‌డాక్, ఎస్ అండ్ పీ 500 సూచీలు 12 శాతం మేర పతనమయ్యాయి. మరోవైపు యూరప్ మార్కెట్లు 10 శాతం మేర నష్టపోయాయి. ఇక మంగళవారం ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. హాంగ్‌సెంగ్(హాంకాంగ్), నికాయ్ (జపాన్) సూచీలు లాభాల్లో, షాంఘై (చైనా), కోస్పి(దక్షిణ కొరియా) సూచీలు నష్టాల్లో ముగిశాయి. భారత్‌లో కోవిడ్ వైరస్ సోకిన వారి సంఖ్య 126కు, మరణాల సంఖ్య 2కు చేరాయి. ఇక ప్రపంచవ్యాప్తంగా 1.75 లక్షల మందికి ఈ వైరస్ సోకగా, మరణాల సంఖ్య 7,000కు పెరిగింది.

కొంత కాలం వేచి చూడండి...

స్టాక్ మార్కెట్లో కరెక్షన్ మరికొంత కాలం కొనసాగుతుందని నిపుణులంటున్నారు. తాజాగా పొజిషన్లు తీసుకోవడానికి మరికొంత కాలం వేచి చూస్తే మంచిదని వారు సూచిస్తున్నారు.

- స్టాక్ మార్కెట్ భారీ నష్టాల కారణంగా రూ.2.11 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ. 2.11 లక్షల కోట్లు ఆవిరై రూ.119.52 లక్షల కోట్లకు పడిపోయింది.
- ఐసీఐసీఐ బ్యాంక్ 9 శాతం నష్టంతో రూ.367 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 9 శాతం, బజాజ్ ఫైనాన్స్ 6 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 5 శాతం, ఇన్ఫోసిస్ 5 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు కూడా 5 శాతం మేర నష్టపోయాయి.
- మరోవైపు హిందుస్తాన్ యూనిలివర్ షేర్ 3.4 శాతం లాభంతో రూ.2,009 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. హీరో మోటొకార్ప్, ఏషియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్, మారుతీ సుజుకీ షేర్లు 2-3 శాతం రేంజ్‌లో పెరిగాయి.
- ప్రమోటర్లకు ఈడీ తాజాగా సమన్లు జారీ చేయడంతో జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ షేర్ 20 శాతం నష్టంతో రూ.133కు పడిపోయింది.ఇది ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయి.
- సోమవారం బలహీనంగా లిస్టైన ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ కంపెనీ షేర్ మంగళవారం పుంజుకుంది. 8 శాతం లాభంతో రూ.736కు పెరిగింది. ఈ కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.68,642 కోట్లకు చేరింది.
- దాదాపు 500కు పైగా షేర్లు లోయర్ సర్క్యూట్లను తాకాయి. ఐఆర్‌సీటీసీ, ఒరిస్సా మినరల్స్, ఆఫియల్ ఇండియా, ఐఓఎల్ కెమికల్స్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- దాదాపు 600కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయికి పడిపోయాయి. జీ ఎంటర్‌టైన్మెంట్, టీటీకే ప్రెస్టీజ్, పిరామల్ ఎంటర్‌ప్రైజెస్, ఎన్ఐఐటీ టెక్నాలజీస్ తదతర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	2,902
ఎన్ఎస్‌ఈ	45,263
ఎన్ఎస్‌ఈ (డెరివేటివ్స్)	7,95,772
ఎఫ్ఐఐ	-4,045
డీఐఐ	3,422

సన్ ఫార్మా బైబ్యాక్ ధర రూ.425

రూ.1,700 కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ: సన్ ఫార్మాస్యూటికల్స్ ఇండస్ట్రీస్ కంపెనీ రూ.1,700 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నది. ఈ షేర్ల బైబ్యాక్‌కు డైరెక్టర్ల బోర్డ్ ఆమోదం తెలిపిందని సన్ ఫార్మా వెల్లడించింది. ఒక్కో షేర్‌ను రూ.425 ధరకు మించకుండా దాదాపు నాలుగు కోట్ల ఈక్విటీ షేర్ల(మొత్తం షేర్ల సంఖ్యలో 1.67 శాతం వాటా)ను బైబ్యాక్ చేస్తామని పేర్కొంది. ఈ షేర్ల బైబ్యాక్‌కు సంబంధించిన విధివిధానాలు, గడువు తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని వివరించింది. షేర్ల బైబ్యాక్ అనంతరం కంపెనీలో ప్రమోటర్ల వాటా 54.69 శాతం నుంచి 55.61 శాతానికి పెరుగుతుంది. ప్రజల వాటా 45.31 శాతం నుంచి 44.

బోసిపోయిన యాదాద్రి క్షేత్రం

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో భక్తుల రద్దీ భారీగా తగ్గింది. కరోనా వైరస్ ప్రభావంతో మంగళవారం భక్తులు లేక ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ఘాట్‌రోడ్డు, పట్టణంలోని ప్రధాన రహదారులు బోసిపోయి కనిపించాయి. కాగా మంగళవారం స్వామి వారికి వివిధ పూజల ద్వారా కేవలం రూ.4,74,114 ఆదాయమే సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. - యాదగిరిగుట్ట

మహిళకు కుడి వైపున గుండె

ఉష

వైరా: సాధారణంగా ఎవరికైనా గుండె ఎడమ చేతి వైపు ఛాతీ భాగంలో ఉంటుంది. కానీ.. వైరాలోని ఓ మహిళకు కుడి వైపున గుండె ఉన్న విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వైరా సంత బజార్‌కు చెందిన బాసాటి ఆనంద్, ఉష దంపతులకు పెళ్లయి ఐదేళ్లయింది. ఇప్పటి వరకు పిల్లలు కలగకపోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పరీక్షల నిమిత్తం వెళ్లారు. అయితే అక్కడ ఆమెకు స్కానింగ్ చేస్తున్న సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఎడమ వైపున ఉండాల్సిన గుండె కుడి వైపున ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటివి చాలా అరుదుగా జరుగుతుంటాయని, జన్యుపరమైన లోపాల వల్ల ఇలా జరుగుతుందని వైద్యులు తెలిపారు.

ఒక టీఎంసీ.. నాలుగు జిల్లాలు

సింగూరు జలాశయంలో అడుగంటిన జలాలు

- నాలుగు జిల్లాలకు పొంచి ఉన్న నీటి కష్టాలు
- ఏప్రిల్ నుంచి రోజు విడిచి రోజు సరఫరాకు సన్నాహాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వేసవిలో సింగూరు జలాశయం ఆధారిత నాలుగు జిల్లాల గ్రామాల వాసులకు తాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. ఈ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామాలకు సాగు, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.19 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అంటే కేవలం ఒక టీఎంసీ నీళ్లను మాత్రమే పంపు చేసేందుకు వీలుంటుంది. నిత్యం 45 క్యూసెక్కుల నీళ్లు ఆవిరి (ఎవాపొరేషన్ లాసెస్) రూపంలో పోగా, ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 40 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు. దీంతో నాలుగు జిల్లాలకు ఏప్రిల్ నుంచి రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అక్కడక్కడ తాగునీటి సమస్య తలెత్తుతోంది. మరో పక్షం రోజుల్లో ఈ సమస్య తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తే నాలుగు జిల్లాలకు ఒక టీఎంసీ సరిపోతాయని మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజనీర్ రాజేంద్ర కుమార్ 'సాక్షి'తో పేర్కొన్నారు. సింగూరు జలాశయంలో నీరు లేకపోవడంతో మిషన్ భగీరథ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. అద్దె బోర్లు తీసుకోవడం, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని భావిస్తున్నారు. మరోవైపు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండుగా కనిపిస్తోంది. దీంతో ఈ ప్రాజెక్టు ఆధారిత జిల్లాలైన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్ని గ్రామాలతో పాటు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు తాగునీటి సరఫరాకు ఏ మాత్రం ఢోకా లేదు. ప్రస్తుతం 43 టీఎంసీలు ఉండగా, మిషన్ భగీరథకు 142 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇటలీ విమానాశ్రయంలో చిక్కుకున్న నిర్మల్ విద్యార్థి

భారత్‌కు పంపని అధికారులు ● కరోనా ఎఫెక్ట్‌తో ఇక్కట్లు

నిర్మల్ రూరల్: స్వదేశానికి వస్తున్న ఓ విద్యార్థి కరోనా ఎఫెక్ట్ కారణంగా ఇటలీ విమానాశ్రయంలోనే చిక్కుకున్నాడు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని నరహరి కు మారుడు అజయ్‌కుమార్ ఉన్నత విద్య కోసం గత అక్టోబర్‌లో ఇటలీకి వెళ్లాడు. ఇటీవల పరీక్షలు పూర్తి కావడంతో రెండు నెలల పాటు సెలవు ప్రకటించారు. దీంతో నిర్మల్‌కు వచ్చేందుకు విమాన టికెట్‌ను ముందుగానే బుక్ చేసుకున్నాడు. 11న ఇటలీ నుంచి బయలుదేరాల్సి ఉంది. ఇతనితో పాటు నిజామాబాద్, హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు కూడా ఉన్నారు. అయితే కరోనా ప్రభావం కారణంగా వీరందరినీ ఇటలీ విమానాశ్రమంలోనే అడ్డుకున్నారు. కరోనా పరీక్షలు పూర్తయ్యే వరకు పంపించేది లేదని తేల్చి చెప్పారు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా విమానాశ్రయంలోనే ఉంటున్నారు.

రెండు వేల కోళ్ల సజీవ సమాధి

గుంతలో పూడ్చిన కోళ్లు

చెన్నారావుపేట: కోళ్ల ఫారంతో ఆర్థికంగా లాభ పడొచ్చని ఆశించిన వ్యక్తిని కరోనా నిండా ముంచింది. వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన చాపర్తి రాజు 25 రోజుల క్రితం సహకార సంఘం పరిధిలోని కోళ్ల షెడ్డు కిరాయికి తీసుకుని బ్రాయిలర్ కోళ్లను పెంచుతున్నాడు. అయితే, కరోనా వైరస్‌తో కోడి మాంసానికి డిమాండ్ పడిపోగా కోళ్ల ధర అట్టడుగుకు చేరింది. దీంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఫారం యజమాని రాజు మంగళవారం సమీప గ్రామాల ప్రజలకు ఉచితంగా కోళ్లను పంపిణీ చేయడంతో పాటు మిగిలిన రెండు వేలకు పైగా కోళ్లను బతికి ఉండగానే గుంత తీసి పూడ్చి వేశాడు.

ప్రజలతో మమేకం కండి

పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలి: డీజీపీ

- మావోల కదలికలపై అలర్ట్
- రెండోరోజు పోలీసు అధికారులతో సమావేశం

సాక్షి ప్రతినిధి, వరంగల్/ఆసిఫాబాద్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలతో మమేకమై వారికి సేవలందించాలని డీజీపీ మహేందర్ రెడ్డి సూచించారు. పోలీసు శాఖపై మరింత నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని కోరారు. రెండో రోజు మంగళవారం ఆయన వరంగల్, కరీంనగర్, రామగుండం, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నియంత్రణ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చెప్పారు. పోలీస్ అధికారులు ఇతర శాఖలతో మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణలో మావోయిస్టుల కదలికలపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో కూంబింగ్ ముమ్మరం చేయాలన్నారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పోలీసులు భాగస్వాములు కావాలని సూచించారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో పోలీసులు భాగస్వాములు కావాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డీజీపీ ఆదేశించారు. అప్పుడే పోలీసు శాఖ ప్రతిష్ట పెరుగుతోందని చెప్పారు.

భక్తులు లేకుండానే రాములోరి కల్యాణం

సాదాసీదాగా నిర్వహించాలని నిర్ణయం: మంత్రి పువ్వాడ

- కరోనా వైరస్ కారణంగా ముందు జాగ్రత్త చర్యలు
- భక్తులు ఇంటి వద్ద నుంచే వీక్షించాలని విజ్ఞప్తి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: శ్రీ రామనవమి సందర్భంగా ప్రతి ఏటా భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణాన్ని ఈసారి సాదాసీదాగా నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. కరోనా వైరస్ కారణంగా భక్తుల మధ్య కాకుండా శాస్త్రోక్తంగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. భక్తులు కల్యాణాన్ని ఇంటి వద్ద నుంచే వీక్షించాలని, ఇందుకుగాను ప్రసార సాధనాల ద్వారా ప్రత్యక్ష ప్రసార సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ ప్రబలకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపడుతోందని చెప్పారు. రాములోరి కల్యాణం కోసం కనీస ఏర్పాట్లకే పరిమితం కావాలని దేవాదాయ శాఖ అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో టికెట్ విక్రయాలను నిలిపి వేశామని, ఇది వరకే విక్రయించిన టికెట్లకు సంబంధించి డబ్బు తిరిగి ఇచ్చేయనున్నట్లు మంత్రి వివరించారు. అయితే కల్యాణం దేవస్థానంలో నిర్వహించాలా..? ఎప్పటిలాగే కల్యాణ మండపంలో నిర్వహించాలా..? అనే అంశంపై ఇదమిత్థంగా ఒక నిర్ణయానికి రాలేదని స్పష్టం చేశారు. ఈ బాధ్యతను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సలహాదారు రమణాచారికి అప్పగించారని తెలిపారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు అందించి సంప్రదాయాన్ని కొనసాగిస్తామని, వాటిని ఎవరి ద్వారా అందిస్తారనేది ఇంకా నిర్ణయం కాలేదన్నారు. పట్టాభిషేకం సైతం శాస్త్రోక్తంగా.. సంప్రదాయబద్ధంగానే కొనసాగుతుందని, భక్తులు పరిస్థితిని అర్థం చేసుకుని పట్టాభిషేకాన్ని సైతం టీవీల్లోనే వీక్షించాలని మంత్రి పువ్వాడ కోరారు.

మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

వాట్సాప్‌లో ప్రశ్నపత్రం

- ఇంటర్ ఫస్ట్ ఇయర్ కెమిస్ట్రీ పేపర్ లీక్ కలకలం
- పోస్టు చేసింది ఓ ప్రైవేట్ అధ్యాపకుడు

సాక్షి, వరంగల్ రూరల్: వరంగల్‌లో కెమిస్ట్రీ పేపర్ లీక్ కావడం కలకలం రేపింది. ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఉదయం 9.52 గంటలకు 'ప్రైవేట్ లెక్చరర్స్ ఇన్ వరంగల్' పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో నగరానికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు కెమిస్ట్రీ మొదటి సంవత్సరం ప్రశ్నపత్రాన్ని పోస్టు చేశాడు. దీంతో గ్రూపులో ఉన్న మిగతా అధ్యాపకులు కంగుతిన్నారు. ప్రశ్నపత్రం ఎక్కడిది? ఇలా ఎందుకు పోస్టు చేశారనే చర్చ సాగింది. ఆ వెంటనే పలువురు అధ్యాపకులు ఆ గ్రూపు నుంచి లెఫ్ట్ కావడం గమనార్హం. వరంగల్ జిల్లాలోని ఏదో పరీక్ష కేంద్రం నిర్వాహకులతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యం కుదుర్చుకున్న ఒప్పందంతోనే ప్రశ్నపత్రం బయటకు వచ్చిందా.. అదే సమయంలో సమాధానాలు కూడా పంపించారా అన్నది తేలాల్సి ఉంది. కాగా, వాట్సాప్‌లో పేపర్ లీక్ అయిన విషయం తన దృష్టికి రాలేదని ఆర్‌జేడీ వెంకట్యా నాయక్ విలేకరులకు తెలిపారు.

చివరి పరీక్షకు వెళ్తూ...

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

వివేక్ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి చివరి పరీక్షకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పాత డోర్నకల్‌కు చెందిన మామిడి నాగరాజు, సుజాత దంపతుల చిన్న కుమారుడు వివేక్ (16) ఖమ్మంలోని చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా.. రెజోనెన్స్ కళాశాలలో పరీక్షలు రాస్తున్నాడు. ప్రతిరోజు డోర్నకల్ నుంచి ప్యాసింజర్ రైలులో ఖమ్మం వెళ్లి పరీక్షలు రాస్తుండగా.. మంగళవారం చివరి పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి వెళ్లే సరికి రైలు బయలుదేరింది. దీంతో మిత్రుడు లెనిన్‌తో కలసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ మేరకు బండిపాడు గ్రామం దాటాక ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలో పడింది. ఈ ఘటనలో వివేక్‌కు తీవ్ర గాయాలై మృతి చెందాడు. కాగా, వివేక్ నేత్రాలను ఆయన తల్లిదండ్రులు దానం చేశారు.

పీఎఫ్ఐ బాధ్యుడి అరెస్టు

కరీంనగర్ క్రైం: నిషేధిత సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) బాధ్యుడిని కరీంనగర్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కరోనా నేపథ్యంలో ఈ నెల 31 వరకు అన్ని విద్యాసంస్థలు, శిక్షణ కేంద్రాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయినా కరీంనగర్ ముకరంపుర లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ (ఐవోఎం) అకాడమీలో శిక్షణ ఇస్తున్నారనే సమాచారంతో టూటౌన్ సీఐ దేవారెడ్డి, కరీంనగర్ ఎంఈవో భద్రయ్య తనిఖీలు చేపట్టారు. పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు ఎండీ జమీల్ అహ్మద్ పీఎఫ్ఐ బాధ్యుడిగా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోచింగ్ సెంటర్ పేరుతో పీఎఫ్ఐ కార్యకలాపాలు ఏవైనా నిర్వహిస్తున్నాడా అనే కోణంలో విచారణ చేస్తామని, పీఎఫ్ఐ జిల్లా నేతగా చురుకుగా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ సంస్థలో తరగతులకు హాజరవుతున్న కొందరు విద్యార్థులను పీఎఫ్ఐ కార్యకలాపాల్లో చురుకుగా పనిచేసే విధంగా తయారుచేసి బెంగళూరు ప్రాంతానికి తరలించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

పేలిన గ్యాస్ సిలిండర్

తల్లీకొడుకు సజీవదహనం ● ఇంటి పైకప్పు ధ్వంసం

రాహుల్

యశోద

ధర్మారం: గ్యాస్ సిలిండర్ పేలి తల్లీకొడుకు సజీవ దహనమయ్యారు. పేలుడు ధాటికి ఇల్లు పైకప్పు ధ్వంసమైంది. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తిలో చోటుచేసుకుంది. ఏసీపీ హబీబ్‌ఖాన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొట్టె నారాయణ, భార్య యశోద (45), కుమారుడు రాహుల్ (18) రాత్రి భోజనం చేశాక నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి 11:30 గంటల ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ పేలింది. భారీ శబ్దానికి భయపడిన నారాయణ తలుపులు తీసుకుని కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశాడు. దీంతో ఇరుగుపొరుగు వారు మరో గదిలో నిద్రిస్తున్న యశోద, రాహుల్‌ను కాపాడేందుకు విఫలయత్నం చేశారు. మంటలకు వారిద్దరు సజీవదహనమయ్యారు. కాగా, గ్యాస్ సిలిండర్ పేలడంపై తమకు అనుమానాలు ఉన్నాయని యశోద సోదరి గమ్మటి కమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్ కుమార్ విలేకరులకు తెలిపారు.

ఆంధ్రా ఉద్యోగులకు స్థానం లేదు

ఇంజనీర్ల జేఏసీ ధర్నా

నాగార్జునసాగర్: తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్రా ఉద్యోగులకు స్థానం లేదని ఇంజనీర్ల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని టీఈఈఏ, టీఎస్‌పీఏ యూనియన్లు కలిసి జేఏసీగా ఏర్పడి ఆంధ్రా ఇంజనీర్లను తెలంగాణ రాష్ట్రానికి బదిలీ చేయడాన్ని నిరసిస్తూ జెన్‌కో కార్యాలయం ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఏపీ స్థానికత ఉన్న 655 మంది ఇంజనీర్లను ఈ నెల 13న తెలంగాణకు బదిలీ చేశారని.. వీరిని తెలంగాణ విద్యుత్ సంస్థల్లో తీసుకోవడాన్ని తెలంగాణ ఇంజనీర్లు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఆంధ్రా ఇంజనీర్లను తెలంగాణలోకి తీసుకోవడం వల్ల ఇక్కడి నిరుద్యోగులకు దశాబ్దకాలం పాటు ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆంధ్రా ఉద్యోగులను నాగార్జునసాగర్‌లో అడుగు పెట్టనీయబోమని స్పష్టం చేశారు. వారి బదిలీలను నిలిపివేయాలని, లేకుంటే జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరాహార దీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఇంజనీర్ల ఉద్యోగుల భద్రత కోసం ఆంధ్రా ఉద్యోగులు ఇక్కడికి రాకుండా సీఎండీ ప్రభాకర్‌రావు న్యాయపరంగా సుప్రీంకోర్టులో అప్పీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈలు నాగేశ్వర్‌రావు, ప్రవీణ్‌కుమార్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ జెన్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తెలంగాణ ప్రభుత్వం
S.E. కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, సంగారెడ్డి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
e-Proc Notice No.35 to 40/2019-20 తేది. 16.03.2020
పనుల సంఖ్య (06) పనుల పేరు: మైనర్ ఇరిగేషన్-మెదక్ జిల్లా, చిలిప్‌చెడ్ (మం.), ఫైజాబాద్ (గ్రామం) సమీపాన మంజీరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణం. మైనర్ ఇరిగేషన్-మెదక్ జిల్లా, చిలిప్‌చెడ్ (మం.), చిట్కుల్ (గ్రామం) సమీపాన మంజీరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణం. మైనర్ ఇరిగేషన్-సంగారెడ్డి జిల్లా, హత్నూర (మండలం) లింగాపూర్ (గ్రామం) సమీపాన మంజీరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణం. మైనర్ ఇరిగేషన్-సంగారెడ్డి జిల్లా, హత్నూర (మం.), రెడ్డి ఖానాపూర్ (గ్రామం) సమీపాన మంజీరా నదిపై చెక్ డ్యామ్ నిర్మాణం. మైనర్ ఇరిగేషన్-సిద్దిపేట జిల్లా, మిర్‌దొడ్డి (మం.), మోతె (గ్రామం) కుడ్లియర్ వాగుపై (బోదనం నర్సింహారెడ్డి పొలాల దగ్గర) చెక్ డ్యామ్ నిర్మాణం. మైనర్ ఇరిగేషన్-సిద్దిపేట జిల్లా, బెజ్జంకి (మం.), దేవక్కపల్లి (గ్రామం) సమీపాన మోహితుమ్మెద వాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం. మొత్తం ECV: రూ. 32.13 కోట్లు. టెండరు ప్రారంభ & ముగింపు తేది: 19-03-2020 నుంచి 26-03-2020 వరకు. వివరాలకు19-03-2020 నుంచి ఇ-ప్రొక్యూర్‌మెంట్ హార్మెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in చూడండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఇరిగేషన్ సర్కిల్, సంగారెడ్డి
DIPR Ro.No.936-PP/CL/Advt/1/2019-20, Dt:17-03-2020

చేప.. ఎంతకీ పెరగక!

సాక్షి, హైదరాబాద్: మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. చెరువుల్లో పోసిన చేపపిల్లలు ఎనిమిది నెలలైనా అరకిలో పరిమాణానికి కూడా పెరగకపోవడంతో మత్స్యకారులు దిగాలు పడుతున్నారు. నాణ్యత లేని చేపపిల్లల్ని పంపిణీ చేయడమే ఇందుకు కారణమని మత్స్యకారులు అంటుండగా, ఫీడింగ్ లోపాలే కారణమని అధికారులు అంటున్నారు.

జీవన ప్రమాణాలు పెంచాలని..

మిషన్ కాకతీయ కింద పునరుద్ధరించిన చెరువులను అటు సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు ఇటు మత్స్య సంపద కేంద్రాలుగా మార్చడం ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 80 కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేసింది. ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు చేపపిల్లలను చెరువుల్లో అట్టహాసంగా వదిలారు. అయితే, ఈ చేపపిల్లల్లో ఎంతకీ ఎదుగుదల కనిపించడం లేదు. దీంతో ఇవి పెరిగాక పట్టుకుని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఉపాధి పొందాలనుకుంటున్న మత్స్యకారుల ఆశలకు గండి పడుతోంది. తమను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినా చేపలు పెరగకపోవడంతో నష్టాల పాలుకావాల్సి వస్తోందని వారంటున్నారు. ప్రైవేటు వ్యక్తుల దగ్గర నుంచి తెచ్చుకున్న చేపపిల్లలు 8 నెలల్లో కనీసం కిలో నుంచి రెండు కిలోల వరకు పెరిగాయని, ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లలు మాత్రం అర కిలో కూడా పెరగలేదని అంటున్నారు. పెరిగిన చేపల్ని పట్టే వారికి కిలోకు రూ.10 – రూ.15 ఇవ్వాలని, దీనికి తోడు లారీ, ఐస్, బాక్సులు, కూలీలకు కలిపి కిలోకు రూ.80 వరకు ఖర్చవుతుందని, ఇంత చేసినా ఈ పెరగని చేపల ధర రూ.60 – రూ.80 మించడంలేదని వాపోతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 80 కోట్ల చేపపిల్లలు ఉచితంగా పంపిణీ

- చెరువుల్లో పోసి 8 నెలలైనా.. అరకిలో కూడా పెరగని వైనం
- ఎదుగుదల లేని చేపలకు మార్కెట్లో ధర, డిమాండ్ కరువు
- ఉపాధికి గండిపడి.. దిగాలుపడుతున్న మత్స్యకారులు



చిన్న చేపలకు డిమాండ్ తక్కువ

మార్కెట్‌లో చేపలు అమ్మాలన్నా, కొనాలన్నా వాటి కనీస సైజును బట్టి ధర పలుకుతుంది. కిలో కంటే తక్కువున్న వాటికి ధర, డిమాండ్ తక్కువ. ప్రభుత్వం చెరువుల్లో ఉచితంగా పోస్తున్న వాటిలో ఎక్కువగా రవ్వ, బొచ్చ వెరైటీలు ఉన్నాయి. నిజానికి మార్కెట్‌లో ఈ రకాలకు డిమాండ్ ఎక్కువ. రవ్వ కిలో రూ.140 – రూ.200, బొచ్చ రూ.150 – రూ.220, కొర్రమీను రూ.450–రూ.650 ధర పలుకుతున్నాయి. కానీ ప్రభుత్వం పోసిన చేపలు అర కిలో కూడా తూగట్లేదు. దీంతో అయినకాడికి అమ్ముకుంటున్నట్టు మత్స్యకారులు వాపోతున్నారు. కష్టపడి చేపలు పడుతున్నా.. కనీస ధర రావట్లేదని, చెరువుల్లోనే ఉంచితే చనిపోతున్నాయని అంటున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

చేపపిల్లల్లో నాణ్యతంటూ ఏమీ ఉండదని, ఆశపడి పిల్లలు ఎక్కువగా పోసినా పెరుగుదలలో తేడా వస్తుందని, దాణా సరిగా ఇవ్వకపోవడం కూడా కారణం కావచ్చని అధికారులు చెబుతున్నారు. చేపపిల్లల నాణ్యతపై అనుమానాలుంటే, విచారణ జరిపిస్తామని అంటున్నారు.

చిన్న చేపలు కొనడం లేదు

ప్రభుత్వం ఉచితంగా పోసిన చేపపిల్లలు ఏడు నెలలైనా వాటి కనీస అరకిలో కూడా పెరగడం లేదు. చిన్నసైజు చేపల్లో ముళ్లు ఎక్కువ ఉంటాయని ప్రజలు కొనడం లేదు.

– జి.గణేష్, సిరిసిల్ల, మత్స్యకారుడు

నాణ్యతలేకే ఇలా..

చేపపిల్లల్లో నాణ్యత లేకే ఎదగడం లేదు. మత్స్యకారుల మంచి కోసమే చేపపిల్లల పంపిణీ చేపట్టినా.. నాణ్యతపై కూడా దృష్టి పెట్టాలి.

– కనకయ్య, సిద్దిపేట, మత్స్యకారుడు

చెరువును బట్టి చేపలు వదలాలి

చెరువును బట్టి చేపపిల్లలు పోస్తే బాగుంటుంది. ఇష్టానుసారం చెరువుల్లో వదలడం వల్ల ఉపయోగం లేదు. ప్రభుత్వం ఇచ్చిన చేపల్లో కొన్ని సోడిపట్లపోతున్నాయి.

– శ్రవణ్‌కుమార్, భిక్షపతి చేపల వ్యాపారి

సంక్షోభంలో పౌల్ట్రీ పరిశ్రమ

ఉత్పత్తి వ్యయంలో పది శాతం కూడా వెనక్కి రావడం లేదు: ఎంపీ రంజిత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: పౌల్ట్రీ రైతుల పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉందని, రైతు ఆదాయం రెట్టింపు మాట పక్కనపెడితే ఉత్పత్తి వ్యయంలో పది శాతం కూడా వెనక్కి రావడం లేదని టీఆర్ఎస్ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో ఈ అంశంపై మాట్లాడారు. పౌల్ట్రీ రైతులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం ఏం సాయం చేయనుందో చెప్పాలని ప్రశ్నించారు. మొదటిసారిగా పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్లు, చికెన్ నిల్వ చేసేందుకు శీతలీకరణ గిడ్డంగులు ఏర్పాటు చేయడంగానీ, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు గానీ ఏవైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. దీనికి పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ సమాధానం ఇచ్చారు. కరోనాపై వచ్చిన అపోహల కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కష్టాల్లో ఉన్నట్లు తెలుసని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, శీతలీకరణకు సంబంధించి 31 ప్రతిపాదనలు వచ్చాయని, శీతలీకరణ వసతులు పెంచేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

కాలిపోతున్న కారు

కారులో మంటలు

క్షేమంగా బయటపడిన ముగ్గురు వ్యక్తులు

కడ్తాల్: ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఆ కారు పూర్తిగా కాలిపోయింది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చరికొండ–పల్లెచెలక ఘాట్ రోడ్డులో మంగళవారం ఈ ఘటన జరిగింది. కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన నీలాల మహేశ్ తన బంధువులైన బొమ్మరాజు శివ, సాయిలుతో కలసి సరూర్‌నగర్‌లో ఉంటున్నారు. నాలుగు రోజుల కింద చరికొండలో జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యారు. మంగళవారం ఉదయం కారులో తిరుగు పయనమయ్యారు. చరికొండ–పల్లెచెలక ఘాట్‌రోడ్డులో కారు ఆగిపోయింది. దీంతో వాహనం నడుపుతున్న నీలాల మహేశ్ దిగి ఇంజిన్ బానట్ లేపి చూడగా పొగలు కమ్ముకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన మహేశ్ సూచన మేరకు కారులో ఉన్న ఇద్దరు కిందికి దిగారు. ఒక్కసారిగా మంటలు వ్యాపించి కారు కాలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.

భూముల వివరాలు త్వరగా తేల్చండి

ఇంజనీర్లకు నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల కింద సేకరించిన భూముల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఇంజనీర్లను ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్ ఆదేశించారు. ప్రాజెక్టుల్లో ఉన్న రిజర్వాయర్లు, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, కార్యాలయాలు, భూములకు సంబంధించి జలసౌధలో మంగళవారం చీఫ్ ఇంజనీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. కొత్త, పాత ప్రాజెక్టుల కింద కలిపి వివిధ అవసరాలకై ఇప్పటివరకు 6 లక్షల మేర భూములు సేకరించగా ఇందులో 2 లక్షల మేర శాఖ పరిధిలోకి రాలేదని గుర్తించారు. ఈ భూమి కబ్జాలో ఉందని, పలు చోట్ల రైతు బంధు కూడా తీసుకుంటున్నారని ఇంజనీర్లు తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారుల అలసత్వం వల్లే ఈ భూములు ఇరిగేషన్ శాఖ పరిధిలోకి రాలేదని, జిల్లాలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించి భూములు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు వివరించారు.

పసుపు మద్దతు ధర రూ.10 వేలుగా ప్రకటించండి

జీరోఅవర్‌లో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పసుపు రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, పండిన పంటకు గిట్టుబాటు ధర కరువైందని కాంగ్రెస్ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభలో ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన జీరోఅవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని క్వింటాలుకు రూ.10 వేలు మద్దతు ధరగా ప్రకటించి రైతుల నుంచి పసుపు పంటను కొనుగోలు చేయాలని కోరారు. గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ నిర్దిష్ట హామీ ఇచ్చారని, కానీ ఆ దిశగా ఎలాంటి చర్య తీసుకోలేదని పేర్కొన్నారు.

ఇద్దరు వైద్యుల అభిప్రాయం తీసుకోవాలి

20 వారాల వ్యవధి వరకు గర్భం తొలగించాల్సి వస్తే కనీసం ఇద్దరు వైద్య నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (సవరణ) బిల్లు–2020పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. విభిన్న ఆరోగ్య సమస్యల మధ్య గర్భాన్ని తొలగించాల్సి వస్తే ఆ నిర్ణయం తీసుకోవడంలో గర్భిణీపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుందని, ఇది అదనపు మానసిక ఒత్తిడికి కారణమై ఆర్థిక భారాన్ని మిగుల్చుతుందని పేర్కొన్నారు. అందువల్ల గర్భాన్ని తొలగించుకోవాలని గర్భిణీ నిర్ణయానికి వచ్చినప్పుడు ఆ గర్భిణీ పునరుత్పత్తి హక్కులను కాపాడాలని, ఇందుకు వీలుగా చట్టబద్ధమైన, భద్రతతో కూడిన అబార్షన్‌కు వీలు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.